అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 16-07-2024

సంపుటి : 10 | సంచిక : 197 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల: 6.50

భగ్గుమన్న నిత్యావసరాల ధరలు

పెరిగిన టోకు ధరల ద్రవ్యోల్బణం

జూన్‌లో 16 నెలల గరిష్ట స్థాయికి చేరిక



న్యూఢిల్లీ : దేశంలో నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా ఆకాశాన్ని తాకుతున్నాయి. ద్రవ్యోల్బణ ఆధారిత టోకు (హోల్‌సేల్) ధరల సూచీ జూన్‌లో 16 నెలల గరిష్ట స్థాయి 3.36 శాతానికి చేరింది. మేలో హోల్‌సేల్ ద్రవ్యోల్బణ సూచీ 2.61 శాతం, ఏప్రిల్‌లో 1.26 శాతంగా మాత్రమే నమోదైంది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సోమవారం ఈ మేరకు వివరాలు విడుదల చేసింది. వరుసగా ఏడు నెలల పాటు తగ్గిన తర్వాత ...13లో



రాజ్యసభలో 86కు తగ్గిన బీజేపీ బలం

మిత్రపక్షాలతో కలిపి 101 మంది మద్దతు

ఇతరుల సాయంతో బిల్లులు గట్టెక్కే అవకాశం

వివరాలు 3లో

రేషన్ కార్డే ప్రామాణికం




రుణమాఫీ మార్గదర్శకాలు విడుదల

- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాలకు వర్తింపు
- కుటుంబానికి గరిష్టంగా రూ.2లక్షల వరకు మాఫీ
- ఎస్‌హెచ్‌జీ, జేఎల్‌జీ, ఆర్‌ఎంజీ, ఎల్‌ఈసీఎస్, రీ-షెడ్యూల్ రుణాలకు మాఫీ వర్తించదు.
- ఆరోహణ క్రమంలో నేరుగా రైతుల ఖాతాల్లో నగదు జమ
- సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి యం.రఘునందన్‌రావు ఇందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేశారు. "ప్రతి కుటుంబానికి గరిష్టంగా రూ.2 లక్షల వరకు రుణమాఫీ వర్తించనుంది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది. రైతు కుటుంబం గుర్తింపునకు రేషన్ కార్డును ప్రామాణికంగా పరిగణిస్తారు. రుణ ఖాతా లోని ఆధార్ సంఖ్య, పాస్‌బుక్‌ను ఆహారభద్రత కార్డుల డేటా బేస్‌కు అనుసంధానం చేసి, లబ్దిదారుల ను గుర్తిస్తారు. ఇందుకోసం ప్రత్యేక వెబ్ పోర్టల్ ఏర్పాటు చేయనున్నారు. రుణమాఫీ నగదు నేరుగా లబ్దిదారుల రుణ ఖాతాల్లోనే జమ కానుంది.



ఆరోహణ క్రమంలో సొమ్ము విడుదల చేయనున్నారు. మహిళా సంఘాలు, జేఎల్‌జీ, ఆర్‌ఎంజీ, ఎల్‌ఈసీఎస్ రుణాలకు, రీ-షెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు. రుణమాఫీపై రైతుల సందేహాలు తీర్చేందుకు ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయనున్నారు. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరిస్తారు. మరిన్ని వివరాలకు వెబ్ పోర్టల్, లేదా మండల సహాయ కేంద్రాలను సంప్రదించాలి" అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రుణమాఫీ మార్గదర్శకాలు

- తెలంగాణలో భూమి కలిగి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రూ. 2 లక్షల వరకు రుణమాఫీ వర్తిస్తుంది.
- ఈ పథకం స్వల్పకాలిక పంట రుణాలకు వర్తిస్తుంది.
- రాష్ట్రంలో ఉన్న షెడ్యూల్డ్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు.. వాటి బ్రాంచ్‌ల నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలకు ఈ పథకం వర్తిస్తుంది.
- 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 13 వరకు తీసుకున్న పంట రుణాలకు వర్తింపు
- ఈ పథకం కింద ప్రతి రైతు కుటుంబం రూ. 2 లక్షల వరకు పంట రుణమాఫీకి అర్హులు. 09.12.2023 తేదీ నాటికి ...6లో

బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ రూపొందించండి

మిగతా రాష్ట్రాల్లో అమలుపై అధ్యయనం చేయండి : సీఎం రేవంత్‌రెడ్డి

6లో..

మోడీ నాయకత్వంలో బీజేపీ

మునిగిపోతుంది

సుబ్రమణ్యస్వామి విమర్శలు



న్యూఢిల్లీ : మోడీ నేతృత్వం కొనసాగితే బీజేపీ టైటానిక్ నావలా మునిగిపోతుందని ఫైర్‌బ్రాండ్ నేత సుబ్రమణ్య స్వామి వ్యాఖ్యానించారు. బీజేపీ ఓడ బీటలు వారుతోందని, అది మునిగిపోవడం ఖాయమని ఆయన చెప్పారు. వివిధ రాష్ట్రాల శాసనసభలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాలు బీజేపీకి చేదు అనుభవాన్ని మిగిల్చిన నేపథ్యంలో సుబ్రమణ్య స్వామి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో స్పందించారు. 'బీజేపీలో ఉన్న మనం టైటానిక్ నావ మాదిరిగా పార్టీ మునిగిపోవడం చూడాలంటే మోడీ నేతృత్వమే ఉత్తమం. బీజేపీ నావ బీటలు వారుతోంది. అది మరింత మునిగిపోతుంది' అని ఆయన వ్యాఖ్యానించారు. సుబ్రమణ్య స్వామి ఇటీవలి కాలంలో ప్రధాని మోడీ, ...13లో

పదికి చేరిన ఫిరాయింపులు

హస్తం గూటికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్‌ఎస్‌కు చెందిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. సోమవారం సీఎం రేవంత్ సమక్షంలో ఆయన మూడు రంగుల కండువా కప్పుకున్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దామోదర రాజనర్సింహా, ...5లో

డీఎస్సీ నిర్వహణకు

సర్వంసిద్ధం

18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో రాతపరీక్షలు

2.79 లక్షల మంది దరఖాస్తు

15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రాల గేట్లు మూసివేత

13లో..



మాకు తెలిసింది మీకు చెబుతాం

పీసీ ఘోష్‌తో సీనియర్ ఐఏఎస్‌లు

రామకృష్ణారావు, స్మితాసబర్వాల్,వికాస్‌రాజ్, సోమేష్‌కుమార్, రజత్‌కుమార్ హాజరు

పీపీటీ ఇచ్చిన జేఏసీ నేత రఘు

నోటీసులకు స్పందించని నాగిరెడ్డి

కాళేశ్వరం లోపాలపై కొనసాగుతున్న విచారణ

నేడు వెదిరె శ్రీరామ్ హాజరు

వివరాలు 13లో

బోనాల్లో ప్రొటోకాల్ రగడ

చెక్కుల పంపిణీలో వివాదం

నేలపై కూర్చొని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిరసన

ప్రజాప్రతినిధులను గౌరవించే సంప్రదాయమిదేనా అంటూ విమర్శ



5లో..

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాపాడాలి

సీఎస్, కలెక్టర్లకు ఆదేశాలివ్వండి : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

13లో..

జీవో 10 రద్దు చేయాలి

ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించిన అంగన్‌వాడీలు

వర్షంలోనూ కొనసాగిన ఆందోళన

తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు

ములుగులో మంత్రి సీతక్కకు వినతి

కొత్త జీవో వచ్చే వరకు రిటైర్మెంట్ చేయొద్దని అధికారులకు మంత్రి ఆదేశం

అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కరిస్తామని ఎమ్మెల్యేల హామీ



నవతెలంగాణ- విలేకరులు

" ఎన్నో ఏండ్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ వర్కర్స్, ఆయాలకు నష్టం చేకూర్చే జీవో నెంబర్ 10 రద్దు చేయాలి.. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచి అమలు చేయాలి" అంటూ రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాలను ముట్టడించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంలోనూ ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పెంచుతూ కొత్త జీవో ఇవ్వాలని, హెల్పర్లకు పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలని నినాదాలు చేశారు. ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు అందజేయగా.. అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కరిస్తామని వారు హామీ ఇచ్చారు. ములుగులో మంత్రి సీతక్క క్యాంపు ఆఫీసు ముందు ధర్నా చేయకుండా ముందస్తుగా అంగన్‌వాడీలను పోలీసులు అరెస్టు చేశారు. అంగన్‌వాడీ ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన మంత్రి వెంటనే అధికారులకు ఫోన్ చేసి.. కొత్త జీవో వచ్చే వరకు ఎవరినీ రిటైర్మెంట్ చేయొద్దని ఆదేశించారు.

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి మాట్లాడారు. జీవో 10ని రద్దు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ పెంచుతూ వీఆర్‌ఎస్ సౌకర్యం కల్పిస్తూ కొత్త జీవో ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం ...6లో

సైబరాబాద్ పరిధిలో.. డ్రగ్స్ పట్టివేత



రూ.35 లక్షల విలువైన మత్తుమందు స్వాధీనం

ఐదుగురు నిందితుల అరెస్టు

డ్రగ్స్ తీసుకున్న వారిలో ఓ ప్రముఖ హీరోయిన్ తమ్ముడు

వివరాలు వెల్లడించిన రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్

5లో..

ఎస్‌బీఐ రుణాలు భారం

వడ్డీ రేట్ల పెంపు



ముంబయి : దిగ్గజ విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రుణాలు మరింత భారం కానున్నాయి. సోమవారం నుంచి వడ్డీ రేట్లను పెంచుతూ ఆ బ్యాంక్ నిర్ణయం తీసుకుంది. కొన్ని కాలపరిమితులపై మార్జినల్ కాస్ట్ లెండింగ్ రేటు (ఎంసీఎల్‌ఆర్)ను 10 బేసిస్ పాయింట్లు లేదా 0.10 శాతం వరకు పెంచింది. ఏడాది కాలవ్యవధి గల ఎంసీఎల్‌ఆర్‌ను 8.75 శాతం నుంచి 8.85 శాతానికి చేర్చింది. ఆరు నెలల కాల వ్యవధికి 8.65 శాతం నుంచి 8.75 శాతానికి, రెండేండ్లకు 8.85 శాతం నుంచి 8.95 శాతానికి పెంచింది. మూడేండ్ల కాలపరిమితి ఎంసీఎల్‌ఆర్‌ను 8.95 శాతం నుంచి 9 శాతానికి చేర్చింది. దీంతో ...13లో

ప్రాజెక్టులకు చేరుతున్న వరద

జిల్లాల్లో మోస్తరు వర్షం | హుస్సేన్‌సాగర్ రెండు గేట్లు ఎత్తివేత

- జూరాలకు నీటి ప్రవాహం
- హైదరాబాద్‌లో పొద్దంతా జల్లులు
- రోడ్లపై నిలిచిన నీరు
- జీహెచ్‌ఎంసీ అధికారుల అప్రమత్తత



నవతెలంగాణ-సిటీబ్యూరో/ విలేకరులు

ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు, రాష్ట్రంలో ఓ మోస్తరు వర్షాలు పడుతుండటంతో ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం మొదలైంది. గ్రేటర్ హైదరాబాద్‌లో సోమవారం పొద్దంతా ఆకాశం ముసుగేసింది. తెరపలు తెరపలుగా జల్లులు పడుతూనే ఉన్నాయి. హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. దాంతో అధికారుల రెండు గేట్లు ఎత్తి దిగువకు నీరు వదిలారు. హైదరాబాద్ జంట నగరాలతో పాటు సంగారెడ్డి, భూపాపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వర్షాలతో అక్కడక్కడా భారీ చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడి.. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వరప్రదాయిని జూరాల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి నీటి ప్రవాహం మొదలైంది.గ్రేటర్‌లో చిన్నపాటి వర్షం కురిస్తే చాలు రోడ్లపై వరదనీరు భారీగా నిలిచిపోతోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు కురిసిన వర్షానికి పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. చింతల్, సుచిత్ర, బాలానగర్, ఐడీపీఎల్, జీడిమెట్ల, సికింద్రాబాద్, బేగంపేట్, బోయిన్‌పల్లి, ...13లో

డిగ్రీలెందుకు

పంక్చర్ షాపులు పెట్టుకోండి

బీజేపీ ఎమ్మెల్యే

వివరాలు 3లో

ఎమర్జెన్సీలో తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తారా?

బీజేపీ ప్రభుత్వానికి తమిళనాడు సీఎం స్టాలిన్ సూటి ప్రశ్న



వివరాలు 3లో

డీఎస్సీ వాయిదా వేయాలి

సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగుల ఆందోళన..పలువురి అరెస్ట్




నవతెలంగాణ-ముషీరాబాద్

డీఎస్సీని వాయిదా వేయాలని, గ్రూప్ 2, 3 పోస్టులను పెంచాలని, గ్రూప్-2ను డిసెంబర్‌లో నిర్వహించాలని డిమాండ్ చేస్తూ హైదరాబాద్‌లోని చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీ వద్ద సోమవారం సాయంత్రం నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. పెద్దఎత్తున నినాదాలు చేస్తూ లైబ్రరీ నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నం చేయగా.. పోలీసులు లైబ్రరీ గేట్లను మూసేశారు. దాంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అభ్యర్థులు లైబ్రరీలోనే ఆందోళన కొనసాగించారు. పలువురు గేటు తోసుకుంటూ బయటకు వచ్చే ప్రయత్నం చేయగా పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు నిరుద్యోగులకు మధ్య తోపులాట జరిగింది. భారీగా పోలీసులు మోహరించి నిరుద్యోగులను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు నిరుద్యోగులు మాట్లాడుతూ.. తమ డిమాండ్లను పరిష్కరించే వరకు వెనకడుగు వేసేది లేదని తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

రుణమాఫీ ఎగ్గొట్టేలా మార్గదర్శకాలు

- మాజీమంత్రి హరీశ్ రావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ సర్కారు విడుదల చేసిన మార్గదర్శకాలు రైతుల రుణమాఫీని ఎగ్గొట్టేలా ఉన్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాటను మార్చడం హస్తం పార్టీకి అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు. 2018 డిసెంబర్ 12కు ముందు వరకు రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ వర్తించదనే నిబంధన ప్రభుత్వం తన భారాన్ని తగ్గించుకునేందుకేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆహార భద్రత కార్డు, పీఎం కిసాన్ పథకం ప్రామాణికం అని ప్రకటించడమంటే లక్షలాది మంది రైతుల ఆశలపై నీళ్లు చల్లడమేనని దుయ్యబట్టారు. రేవంత్ ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి స్పందిస్తూ, రుణమాఫీకి రేషన్ కార్డు ప్రాతిపదికన పెట్టడం, కుటుంబం ప్రాతిపదికగా చూపడం సరికాదని తెలిపారు. రేషన్ కార్డు లేని వారు వ్యవసాయ రుణం పొందితే వారు అర్హులు కారా..? అని ప్రశ్నించారు. రెండు బ్యాంకుల్లో రుణం తీసుకుంటే..లేదా ఒక బ్యాంకులో రెండు లక్షల కన్నా పై బడి ఉంటే మిగిలిన మొత్తం చెల్లిస్తేనే రూ.2 లక్షల వరకు రుణమాఫీ అవుతుందనటం శోచనీయమన్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం 40 శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించే అవకాశముందని చెప్పారు. ఈ రకంగా 60 శాతం మంది రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. ఏ బ్యాంకులో అయినా రైతు తీసుకున్న రూ.2 లక్షల రుణాన్ని బేషరతుగా మాఫీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ సర్కారు రెండు సార్లు రుణమాఫీ చేసి అందరికీ వర్తింపజేసిందని గుర్తుచేశారు. అదే మాదిరిగా షరతులు లేకుండా అందరికీ వర్తింపజయాలని కోరారు. రైతులు రోడ్లపైకి వచ్చి నిరసన తెలపకముందే మార్గదర్శకాలను మార్చాలని కోరారు.

విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యం

హైదరాబాద్‌లోని చిక్కడపల్లి సెంట్రల్ లైబ్రరీలో విద్యార్థులపై పోలీసులు దౌర్జన్యం చేయడాన్ని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. గ్రూప్స్, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగులపై ప్రభుత్వం ఇంత పాశవికంగా ప్రవర్తించడం దుర్మార్గమని విమర్శించారు. ఇదేనా ప్రజాపాలన అంటే, ఇదేనా ఇందిరమ్మ రాజ్యం అంటే?అని ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నాడు సిటీ సెంట్రల్ లైబ్రరీకి రాహుల్‌గాంధీని తీసుకెళ్లి ఓట్లు కొల్లగొట్టారని తెలిపారు. నేడు అదే లైబ్రరీకి పోలీసులను పంపించి విద్యార్థులు వీపులు వగులగొడుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థులపై జరుగుతున్న దమనకాండను ప్రభుత్వం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యత వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని కోరారు.

నేటినుంచి కళాశాల విద్యాశాఖ ఉద్యోగుల బదిలీలు

- 31 వరకు నిర్వహణ
- రెండేండ్ల సర్వీసు ఉన్నోళ్లే అర్హులు
- ఐదేండ్ల సర్వీసు నిండితే తప్పనిసరి ట్రాన్స్‌ఫర్
- మార్గదర్శకాలు విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న అధ్యాపకులు, ఉద్యోగుల బదిలీల ప్రక్రియ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఈనెల 31 వరకు ఈ ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం సోమవారం మార్గదర్శకాలను విడుదల చేశారు. ఈ ఏడాది జూన్ 30 నాటికి ఐదేండ్ల సర్వీసు పూర్తి చేసిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుందని తెలిపారు. రెండేండ్ల సర్వీసు ఉంటే బదిలీకి దరఖాస్తు చేసేందుకు అర్హులని పేర్కొన్నారు. 317 జీవో బాధితులకు సంబంధించి పాత స్టేషన్ సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. 2026, జూన్ 30 నాటికి ఉద్యోగ విరమణ పొందే అధ్యాపకులకు బదిలీల నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు. బదిలీ అయిన ఉద్యోగులకు నూతన స్టేషన్‌లో చేరేందుకు మూడు రోజుల సమయం ఉంటుందని పేర్కొన్నారు. ఆ తర్వాత సీసీఏ నిబంధనల ప్రకారం ఉద్యోగులు, అధ్యాపకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ బదిలీల నిర్వహణ కోసం అధికారుల నేతృత్వంలో కమిటీలను ఏర్పాటు చేశామని తెలిపారు.

ఏడాది సర్వీసు ఉన్నా బదిలీకి అవకాశమివ్వాలి : టిగ్లా

రాష్ట్రంలోని జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, అధ్యాపకుల బదిలీల మార్గదర్శకాలను విడుదల చేయడం పట్ల ప్రభుత్వానికి తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) ఆర్గనైజింగ్ సెక్రెటరీ, తెలంగాణ ఇంటర్మీడియెట్ గవర్నమెంట్ లెక్చరర్ల అసోసియేషన్ (టిగ్లా) ప్రధాన కార్యదర్శి మాచర్ల రామకృష్ణగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఆ మార్గదర్శకాలను స్వాగతిస్తున్నట్టు పేర్కొన్నారు. 20 ఏండ్లుగా కాంట్రాక్టు అధ్యాపకులుగా పనిచేసి గతేడాది మేలో రెగ్యులర్ అయ్యారని వివరించారు. వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించారని తెలిపారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ మానసిక బాధలను అనుభవిస్తున్న ఉద్యోగులకు ఏడాది సర్వీసు ఉన్నా బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు.

టీజీజేఎల్ఏ హర్షం

రాష్ట్రంలో కళాశాల విద్యాశాఖ పరిధిలోని ఉద్యోగులు, అధ్యాపకులకు బదిలీలను నిర్వహించేందుకు మార్గదర్శకాలను విడుదల చేయడం పట్ల టీజీజేఎల్ఏ-475 అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిసెట్టి సురేష్ హర్షం ప్రకటించారు.

సాగర్ నుంచి నీటి కేటాయింపులు

తెలంగాణకు 5.4 టీఎంసీలు,ఏపీకి 4.5 టీఎంసీలు: కేఆర్ఎంబీ త్రైపాక్షిక కమిటీ నిర్ణయం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

నాగార్జునసాగర్ నుంచి తెలుగు రాష్ట్రాలకు నీటి కేటాయింపులు చేస్తూ కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) త్రైపాక్షిక కమిటీ నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం జలవిద్యుత్ ఉత్పత్తి కోసం తెలుగు రాష్ట్రాలు చెరో మూడు టీఎంసీలు సాగర్‌లోకి వదలాల్సి ఉంటుందని తేల్చింది. కేఆర్ఎంబీ కన్వీనర్ డిఎం రాయ్‌పురే అధ్యక్షతన జరిగే సమావేశంలో తెలంగాణ ఈఎన్సీ బి. అనిల్‌కుమార్, ఏపీ ఈఎన్సీ సి నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇరు రాష్ట్రాల అధికారుల చర్చల అనంతరం నాగార్జునసాగర్‌లోని 9.9 టీఎంసీల నీటిలో తెలంగాణకు 5.4 టీఎంసీలను కమిటీ కేటాయించింది.ఎడమ కాలువ ద్వారా తెలంగాణ నీటిని వినియోగిం చుకుంటుంది.వీటిని హైదరాబాద్,ఖమ్మం, నల్లగొండ జిల్లాల తాగునీటి అవసరాలకు వాడుకోనున్నారు. ఏపీలో గుంటూరు,పల్నాడు ప్రాంతాల తాగునీటి అవసరాల కోసం కుడి కాలువ ద్వారా ఉపయోగిస్తారు. కృష్ణా నదీ జలాల పంపిణీపై ఢిల్లీలో జరిగిన కేఆర్ఎంబీ భేటి వాయిదా పడింది.

విద్యార్థులు, నిరుద్యోగులకు అండగా ఉంటాం

- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

విద్యార్థులు, నిరుద్యోగులు ప్రజావాణికి వచ్చి తమ సమస్యలు చెప్పుకోవాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయొద్దని కోరుతున్నామని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలోని మీడియా పాయింట్ దగ్గర ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత పదేండ్లుగా తెలంగాణలో నియంతల పాలన నడిచిందని గుర్తు చేశారు. ఇనుపకంచెలు వేసి ప్రగతిభవన్ రానీయకుండా అందరిని అడ్డుకున్న విషయాన్ని గుర్తుచేశారు. వాటిని బుల్డోజర్లు పెట్టి రేవంత్ రెడ్డి తొలగించారని చెప్పారు. పరీక్షల వాయిదా, పరీక్షకు పరీక్షకు మధ్య గ్యాప్ తదితర సమస్యలపై కలిసి మాట్లాడితే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఫీజు రియంబర్స్‌మెంటు మొత్తం కూడా త్వరలోనే విడుదల చేయబోతున్నామన్నారు. కేసీఆర్ కత్రిమ ఉద్యమాలు సష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. 30 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయబోతున్నామన్నారు. విద్యా, వైద్యం, వ్యవసాయం ప్రధాన ప్రాధాన్యతలుగా ప్రభుత్వం ముందుకెళ్తున్నదన్నారు. గత ప్రభుత్వం ఖజానా పూర్తిగా ఖాళీ చేసి వెళ్ళిపోయిందని గుర్తు చేశారు. ఇలాంటి పరిస్థితులలో కూడా ప్రభుత్వం ఎంతో గొప్పగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నదన్నారు. విద్యార్థులు, నిరుద్యోగులకు రేవంత్ సర్కారు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.



పిరామిల్ పరిశ్రమలో సీఐటీయూ జయకేతనం

15 ఓట్ల మెజార్టీతో చుక్కరాములు గెలుపు

ఎన్నికల వరకే రాజకీయం.. ఆ తర్వాత కార్మికులందరూ సమానమే

వారందరి సంక్షేమానికి కృషి : చుక్క రాములు

నవతెలంగాణ-జహీరాబాద్, కోహిర్

సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం దిగ్వాల్‌లోని పిరామిల్ ఫార్మా కంపెనీ కార్మిక సంఘం ఎన్నికల్లో సీఐటీయూ జయకేతనం ఎగురవేసింది. పరిశ్రమలో మొత్తం 137 ఓట్లు ఉండగా.. అందులో సీఐటీయూ తరఫున నిలబడిన సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములుకు 68 ఓట్లు వచ్చాయి. ప్రత్యర్థికి 53 ఓట్లు రావడంతో 15 ఓట్ల మెజార్టీతో చుక్క రాములు గెలుపొందారు. దాంతో రాష్ట్రంలోనే మెజార్టీ పరిశ్రమల్లో ఎన్నికైన నాయకుడిగా చుక్క రాములు గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. గెలిచినా, ఓడినా కార్మికుల పక్షానే నిలబడుతామని తెలిపారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు ఉంటాయని.. ఎన్నికల అనంతరం పరిశ్రమలోని కార్మికులందరూ సమానమేనని అన్నారు. ఎన్నికల సందర్భంగా తాము ఇచ్చిన ప్రతి హామీనీ నిలబెడుతామని కార్మికులకు హామీ ఇచ్చారు. కాగా సీఐటీయూ విజయకేతనం ఎగరవేయడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేశారు.

రాజ్యసభలో 86కు తగ్గిన బీజేపీ బలం


మిత్రపక్షాలతో కలిపి 101 మంది మద్దతు

ఇతరుల సాయంతో బిల్లులు గట్టెక్కే అవకాశం

న్యూఢిల్లీ : రాజ్యసభలో బీజేపీ బలం మరింత తగ్గిపోయింది. ఆ పార్టీ పక్షాన ఉన్న నలుగురు నామినేటెడ్ సభ్యుల పదవీకాలం శనివారం ముగిసింది. దీంతో పెద్దల సభలో బీజేపీ బలం 86కు పడిపోయింది. దీంతో ఎన్డీఏ సభ్యుల సంఖ్య కూడా 101కి తగ్గింది. సభలో ప్రస్తుతం 226 మంది సభ్యులు ఉన్నారు. 19 స్థానాలు ఖాళీగా ఉన్నాయి. అయితే ఏడుగురు నామినేటెడ్ సభ్యులు, ఇద్దరు స్వతంత్రులు, అన్నా డీఎంకే, వైసీపీ వంటి స్నేహపూర్వక పార్టీల మద్దతు ఉన్న కారణంగా రాబోయే బడ్జెట్ సమావేశాల్లో కీలక బిల్లులు ఆమోదం పొందే అవకాశం ఉంది.

నామినేటెడ్ కేటగిరీలో ఖాళీగా ఉన్న స్థానాలను సాధ్యమైనంత త్వరగా భర్తీ చేస్తే బీజేపీకి మిత్రులు, ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. నామినేటెడ్ సభ్యులు రాకేష్ సిన్హా, రాం షకల్, సోనాల్ మాన్‌సింగ్, మహేష్ జెత్మలానీ శనివారం పదవీవిరమణ చేశారు. రాజ్యసభకు నామినేట్ అయిన తర్వాత వీరు బీజేపీకి చేరువయ్యారు. నామినేటెడ్ సభ్యుడైన గులాం అలీ కూడా బీజేపీకే మద్దతు ఇస్తున్నారు. ఆయన 2028 సెప్టెంబరులో రిటైర్ అవుతారు.

ప్రభుత్వ సిఫార్సు మేరకు రాష్ట్రపతి 12 మంది



సభ్యులను ఎగువ సభకు నామినేట్ చేస్తారు. వీరిలో ఏడుగురు సభ్యులు బీజేపీతో జట్టు కట్టనప్పటికీ తీర్మానాలు, బిల్లులు ఆమోదం పొందే సమయంలో పాలక పక్షం వైపే ఉంటారు. ప్రస్తుతం సభలో ఖాళీగా ఉన్న 19 స్థానాల్లో జమ్మూకాశ్మీర్ నుండి నాలుగు, నామినేటెడ్ స్థానాలు నాలుగు, అస్సాం, బీహార్, మహారాష్ట్ర నుండి రెండు చొప్పున, హర్యానా, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, త్రిపుర నుండి ఒక్కో స్థానం చొప్పున ఉన్నాయి. జమ్మూకాశ్మీర్ మినహా మిగిలిన 8 రాష్ట్రాలకు చెందిన 11 స్థానాలు గత నెలలో ఖాళీ అయినవే. వీరిలో 10 మంది లోక్‌సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు చెందిన కె. కేశవరావు గత నెలలో రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు.

రాజ్యసభలో మొత్తం స్థానాల సంఖ్య 245. ఖాళీగా ఉన్న 19 స్థానాలు పోను ప్రస్తుతం సభలో 226 మంది సభ్యులు ఉన్నారు. మెజారిటీకి 114 సీట్లు అవసరం కాగా ఎన్డీఏకు 101, ప్రతిపక్ష ఇండియా కూటమికి 87 మంది సభ్యులు ఉన్నారు. అధికార, ప్రతిపక్ష కూటములకు దూరంగా ఉన్న సభ్యుల సంఖ్య 29. ఎన్డీఏకు ఇద్దరు స్వతంత్రులు, ఏడుగురు నామినేటెడ్ సభ్యుల మద్దతు ఉంది. పార్టీల వారీగా చూస్తే బీజేపీకి 86, కాంగ్రెస్‌కు 26, తృణమూల్ కాంగ్రెస్‌కు 13, వైఎస్సార్‌సీపీకి 11, ఆప్‌కు 10, డీఎంకేకు 10, బీజేడీకి 7, ఆర్జేడీకి 5, బీఆర్ఎస్, సీపీఐ (ఎం), జేడీయూ, అన్నా డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలకు నాలుగు చొప్పున, జేఎంఎంకు 3, స్వతంత్రులు 3, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే), ఎన్సీపీ (శరద్ పవార్), ఎన్సీపీ, సీపీఐ, ఐయూఎంఎల్ పార్టీలకు రెండు చొప్పున స్థానాలు ఉన్నాయి. 13 పార్టీల నుండి ఒక్కొక్కరు చొప్పున ఎగువ సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరితో పాటు ఏడుగురు నామినేటెడ్ సభ్యులు కూడా ఉన్నారు.

గత నెలలో ఖాళీ అయిన 11 స్థానాలకు రాబోయే నెలల్లో ఎన్నికలు జరుగుతాయి. వీటిలో ఎన్డీఏకు 8, ఇండియా కూటమికి 3 స్థానాలు లభిస్తాయి. కాంగ్రెస్‌కు తెలంగాణ నుండి ఒక స్థానం దక్కుతుంది. దీంతో ఆ పార్టీ బలం 27కు పెరుగుతుంది. రాజ్యసభలో ప్రతిపక్ష నేత హోదాను నిలుపుకోవాలంటే ఆ పార్టీకి 25 స్థానాలు ఉంటే చాలు.

డిగ్రీలెందుకు పంక్చర్ షాప్ పెట్టుకోండి

బీజేపీ ఎమ్మెల్యే

భోపాల్: డిగ్రీలతో ఏం ఉపయోగం లేదని, పంక్చర్ షాప్ తెరుచుకోండని ఓ బీజేపీ ఎమ్మెల్యే విద్యార్థులకు సూచించారు. ఈ ఘటన బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. గుణ అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్యే పన్నాలాల్ షాక్యా ఆదివారం 'పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్' ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ 'మేం ఈ రోజు పీఎం కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభిస్తున్నాం. ఈ కాలేజీ డిగ్రీలతో ఏం ప్రయోజనం లేదు. నేను ప్రతి ఒక్కరికీ విజ్ఞప్తి చేస్తున్నా. డిగ్రీలకు బదులుగా, జీవనోపాధి కోసం కనీసం



మోటార్‌సైకిల్ పంక్చర్ రిపేర్ షాప్‌ను తెరవండి' అని అన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కాగా బీజేపీ ఎమ్మెల్యే వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తాయి.

గుజరాత్ బొగ్గు గనిలో ముగ్గురు మృతి

- ఊపిరాడక చనిపోయిన కార్మికులు
- పరారీలో గని యజమానులు

గాంధీనగర్ : గుజరాత్‌లోని అక్రమంగా నిర్వహిస్తున్న ఒక బొగ్గు గనిలో ముగ్గురు కార్మికులు చనిపోయారు. గనిలోపల కార్మికులకు తగినంతగా ప్రాణవాయువు లభించకపోవటంతో ఊపిరాడక ప్రాణాలు విడిచారు. శనివారం రాత్రి ఈ ఘటన జరగగా.. మృతులను ఆదివారం బయటికి తీశారు. అయితే ఆ గనిలో పనిచేసే కార్మికులకు భద్రత విషయంలో గని యజమానులు నిర్లక్ష్యం వహించారనీ, దీంతో కార్మికులు తమ విలువైన ప్రాణాలను కోల్పోయారని పోలీసులు తెలిపారు. గుజరాత్ లోని సురేంద్ర నగర్ జిల్లా, థంగడక తాలూకా భేట్ గ్రామంలో ఉన్న బొగ్గు గనికి అనుమతి లేకుండా చట్టవ్యతిరేకంగా బొగ్గు తవ్వకాలు చేస్తున్నారని బొగ్గు గనికి సంబంధించిన నలుగురు యజమానులపై పోలీసులు కేసు నమోదు చేశారు. బొగ్గు గని యజమానులంతా ప్రస్తుతం పరారీలో ఉన్నారు. గని యజమానులు జషాభాయ్ కేరాలియా, జనక్ అనియారియా, ఖీమ్ జీ భాయ్ సరాదియా, కల్పేష్ పర్మార్‌పై పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. బొగ్గు గనిలో పనిచేసే లక్ష్మణ్ దాభి(35), ఖోడా భాయ్ మక్వానా(32) , విక్రమ్ కెరాలియా (35) శనివారం గనిలోపల పనిచేసేందుకు వెళ్లి తిరిగి రాలేదు. గనిలోపల ప్రమాదకర గ్యాస్‌ని పీల్చుకున్నారనీ, వారికి గనిలో ఆ ప్రదేశంలో సరిపడా ప్రాణవాయువు లభించపోవటంతో ఈ దుర్ఘటన జరిగిందని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. గనిలో పనిచేసే కార్మికుల భద్రత కోసం ఎటువంటి హెల్మెట్లు, మాస్క్ లు ఇచ్చేవారు కాదని తెలిసింది. చనిపోయిన నలుగురు కార్మికుల మృతదేహాలు పోస్ట్-మార్టం కోసం పంపించారు. ఫిబ్రవరి నెలలో కూడా ముగ్గురు గని కార్మికులు జెలటిన్ బాంబు పేలి ఆ గ్యాస్ పీల్చుకోవడంతో చనిపోయారు. దీంతో రాష్ట్రంలోని గనుల్లో పని చేసే కార్మికుల భద్రత పట్ల ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కార్మికుల సంక్షేమం విషయంలో గనుల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మతోన్మాదుల అకృత్యాలను ప్రతిఘటించాలి

- కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ
- రాష్ట్రంలో దళితులపై పెరుగుతున్న దౌర్జన్యాలు : కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి. స్కైలాబ్ బాబు



నవతెలంగాణ-సుబేదారి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారినప్పటికీ దళితుల బతుకులు మాత్రం మారడం లేదని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్‌వెస్లీ, స్కైలాబ్‌బాబు అన్నారు. కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి రావడంతో ప్రజలు, దళితులపై అకృత్యాలు పెరుగుతాయని, వాటిని సామాజిక శక్తులు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. హన్మకొండ జిల్లా విద్యుత్ భవన్‌లో సోమవారం ప్రారంభమైన కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణా తరగతుల్లో జాన్‌వెస్లీ జెండా ఎగరవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ పాలనతో పాటు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై 300 రెట్లు దాడులు, దౌర్జన్యాలు పెరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని నీరుగార్చేలా వ్యవహరించిందన్నారు. దేశంలో 20శాతం ఉన్న దళితుల సంక్షేమానికి జనాభా దామాషాలో నిధులు కేటాయించలేదని, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయకుండా వివక్ష పాటించిందన్నారు. ఇటీవల కొన్ని రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం చెప్పినప్పటికీ.. దేశ ప్రజలు సంఘటితంగా మతోన్మాదులను ప్రతిఘటించలేకపోవడం వల్ల దాని ప్రమాదం మరింత పొంచి ఉందన్నారు. రాష్ట్రంలో ఎస్సీ కార్పొరేషన్ పూర్తిగా నిర్వీర్యమైందని, దళితుల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక అసెంబ్లీ సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే దళితులపై దాడులు పెరిగాయని అన్నారు. చట్టాలు అమలు చేయాల్సిన స్థానంలో ఉన్న ఒక దళిత ఎస్ఐ ఆత్మహత్య చేసుకునే దుస్థితి నెలకొందన్నారు. దానిమ్మ చెట్టును ముట్టుకున్నాడని దళిత మైనర్ బాలుడిని కట్టేసి కొట్టి కులం పేరుతో దూషించిన సంఘటన రాష్ట్రంలో జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం దళిత బంధువు ఇస్తే అది అవినీతిమయమైందని చెప్పిన కాంగ్రెస్, తాము మేము అధికారం చేపడితే రూ.12 లక్షలతో అంబేద్కర్ బంధు ప్రవేశపెడతామని చెప్పిన హామీ ఏమయిందని ప్రశ్నించారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. శిక్షణా తరగతులకు కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంద సంపత్, నందిపాటి మనోహర్, ఆరూరి కుమార్, దయ్యపు రాధాకృష్ణ, టి సురేష్, కోట గోపి, మస్కు ప్రకాష్ కరత్, పల్లేర్ల లలిత, డి రామ్మూర్తి, దుర్గం దినకర్, హన్మకొండ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీలో తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తారా..?

బీజేపీ ప్రభుత్వానికి తమిళనాడు సీఎం స్టాలిన్ సూటి ప్రశ్న

చెన్నై : ఎమర్జెన్సీ సమయంలో విద్యపై కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాన్ని రద్దు చేస్తారా.. అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ సోమవారం కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. విద్య అంశాన్ని రాష్ట్ర జాబితాలో నుంచి ఉమ్మడి జాబితాలోకి మార్చిన నిర్ణయాన్ని ఉపసంహరించుకునేందుకు ఇప్పటి బీజేపీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ముందుకు వస్తుందా అని స్టాలిన్ ప్రశ్నించారు. సోమవారం తిరువళ్లూరు జిల్లాలోని కీజాచేరిలో సెయింట్ అన్నస్ ప్రైమరీ స్కూల్‌లో తమిళ నాడు ప్రభుత్వ పథకమైన ముఖ్యమంత్రి అల్పాహార పథకం విస్తరణ ప్రారంభోత్స కార్యక్రమంలో ఎంకె స్టాలిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్టాలిన్ ప్రసంగిస్తూ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో విధించిన ఎమర్జెన్సీపై ఇప్పటికీ తీవ్రస్థాయిలో బీజేపీ చేస్తున్న విమర్శలను ప్రస్తావించారు. 'ఎమర్జెన్సీపై తీవ్ర స్థాయిలో అన్ని విమర్శలు చేస్తున్న బీజేపీ.. ఎమర్జెన్సీ సమయంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసం హరించుకుని విద్యను ఉమ్మడి జాబితా నుంచి రాష్ట్ర జాబితాకు మార్చడానికి ముందుకు వస్తుందా?' అని స్టాలిన్ ప్రశ్నించారు. అలాగే, నీట్‌ను తీవ్రంగా వ్యతిరేంచే తమిళనాడు ప్రభుత్వ నిర్ణయాన్ని స్టాలిన్ మరోసారి పునరుద్ఘాటించారు. 'ఆకలిగా ఉండటం



లేదా నీట్ అనేదే కేంద్ర ప్రభుత్వ యొక్క నూతన విద్యా విధానం. ఇలాంటి అడ్డంకులను ఛేదించడమే తమ ప్రాథమిక లక్ష్యం' అని స్టాలిన్ తెలిపారు. తమిళనాడు బాటలో ఇప్పుడు దేశం యావత్తు కూడా నీట్‌ను వ్యతిరేకిస్తుందని స్టాలిన్ గుర్తు చేశారు. కాగా, ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని విస్తరించడం ద్వారా రాష్ట్రం మొత్తంగా ఉన్న 3,995 ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల్లోని 2.23 లక్షల మంది చిన్నారులకు కూడా లబ్ధి కలుగుతుంది. ప్రస్తుతం పథకం ద్వారా రాష్ట్రంలోని 30,992 ప్రభుత్వ పాఠశాలల్లోని ఒకటి నుంచి ఐదో తరగతి వరకూ చదువుతున్న 18.50 లక్షల మంది చిన్నారులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ పథకాన్ని మాజీ ముఖ్యమంత్రి కె.కామరాజ్ జయంతి రోజున విస్తరించడం ద్వారా ఆయన్ను సత్కరిస్తున్నట్టు స్టాలిన్ సోషల్ మీడియా పోస్టు ద్వారా తెలిపారు.

అదేవిధంగా, సోమవారం రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన 10 కొత్త బస్సులను కూడా ముఖ్యమంత్రి స్టాలిన్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరువళ్లూరు ఎంపీ శశికాంత్ సెంథిల్, ఎమ్మెల్యేలు విజి రాజేంద్రన్, ఎస్ చంద్రన్; ఎస్ ఇనిగో ఇరుదయరాజ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ దాస్ మీనా, ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

రైతుల డిమాండ్లపై నేటి నుంచి ఎంపీలకు వినతులు

సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అన్ని పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)ను సి2 ప్లస్ 50 శాతం ప్రాతిపదికన ఇచ్చేందుకు చట్టబద్ధత కల్పించాలనీ, పంటలను గ్యారెంటీగా సేకరించాలనే డిమాండ్లపై మంగళవారం నుంచి ఈ నెల 18 వరకు లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు వినతిపత్రాలు ఇవ్వాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు కన్వీనర్లు సోమవారం టి.సాగర్, పశ్య పద్మ, పి.ప్రభాకర్, పెద్దారపు రమేష్, మండల వెంకన్న, జక్కుల వెంకటయ్య, కొండల్, మామిడాల భిక్షపతి, ఆర్ వెంకట్రాములు, ఎస్ బాల మల్లేశ్, పి రామకృష్ణ ఒక ప్రకటన విడుదల చేశారు. 'అన్ని పంటలకు గ్యారెంటీ సేకరణతో సి2ప్లస్50 శాతంతో కూడిన ఎంఎస్‌పీ చట్టబద్ధంగా హామీ ఇవ్వాలి. రైతులు, వ్యవసాయ కార్మికులకు రుణభారం నుండి విముక్తి కల్పించి రైతు ఆత్మహత్యలకు ముగింపు పలకడానికి సమగ్ర రుణమాఫీ చేయాలి. విద్యుత్ రంగం ప్రయివేటీకరణ ఆపాలి. ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు. ప్రభుత్వ రంగం కింద అన్ని పంటలకు, పశుపోషణకు సమగ్ర బీమా కవరేజీ ఇవ్వాలి. రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల పీఎంఎఫ్‌బీవై పథకాన్ని సవరణ చేయాలి. రైతులు, వ్యవసాయ కార్మికులందరికీ నెలకు రూ.10 వేలు చొప్పున పెన్షన్ ఇవ్వాలి. భూసేకరణ, పునరావాస చట్టం-2013ను అమలు చేయాలి. దేశం అంతటా ప్రతి సంవత్సరం భూమి సర్కిల్ రేటును సవరించాలి. ప్రభుత్వ, ప్రయివేట్ రంగం ప్రాజెక్టుల కోసం అక్రమంగా సేకరించడం వల్ల భూమిని కోల్పోయిన వారందరికీ తగిన పరిహారం అందించాలి. బుల్డోజర్ రాజ్‌కు ముగింపు పలకాలి. ముందస్తు పునరావాస ఏర్పాట్లు చేయకుండా మురికివాడల, నివాసాల కూల్చివేతను ఆపాలి.

వ్యవసాయంలో కార్పొరేటీకరణ ఆపాలి. వ్యవసాయ ఉత్పత్తి, వాణిజ్యంలో బహుళజాతి కంపెనీలు వద్దు. వ్యవసాయంపై డబ్ల్యూటీవో ఒప్పందం నుండి భారత్ బయటకు రావాలి. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, విద్యుత్, నీటిపారుదల, పెట్రోలియం ఉత్పత్తులు, యంత్రాలు, ట్రాక్టర్లు వంటి వ్యవసాయ ఇన్‌పుట్‌లపై జీఎస్‌టీ ఆపాలి. రాజ్యాంగంలోని సమాఖ్య సూత్రాల ప్రకారం పన్ను విధించే రాష్ట్ర ప్రభుత్వాల హక్కును నిర్ధారించడానికి జీఎస్‌టీ చట్టాన్ని సవరించాలి. జీడీపీలో తగిన వాటాతో వ్యవసాయం కోసం ప్రత్యేక కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి.

కేంద్ర ప్రభుత్వంలో సహకార మంత్రిత్వశాఖను రద్దు చేయాలి. రాజ్యాంగంలో పొందుపరిచిన విధంగా సహకారాన్ని రాష్ట్ర అంశంగా ఉంచాలి. ఉత్పత్తి వర్గాలైన రైతులు, కార్మికుల ఖర్చుతో కార్పొరేట్ వర్గ ప్రయోజనాల కోసం అధికార కేంద్రీకరణను ప్రోత్సహించే బదులు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు మద్దతు ఇవ్వాలి. వన్యప్రాణుల ముప్పు కోసం శాశ్వత పరిష్కారాన్ని నిర్ధారించాలి.

ప్రాణ నష్టానికి పరిహారంగా రూ.1 కోటి, పంటలు, పశువుల నష్టానికి తగిన పరిహారం అందించాలి. లఖింపూర్ ఖేరీ అమరవీరులతో సహా చారిత్రాత్మక రైతుల పోరాట అమరవీరుల కుటుంబాలకు పరిహారం అందించాలి. రైతుల పోరాటానికి సంబంధించిన అన్ని కేసులనూ ఉపసంహరించుకోవాలి. 736 మంది రైతు అమరవీరుల స్మారకార్థం సింగు, టిక్రీ సరిహద్దుల్లో అమరవీరుల స్మారకాన్ని నిర్మించాలి'అని డిమాండ్ చేస్తూ ఎంపీలకు వినతి పత్రాలు ఇవ్వనున్నట్టు తెలిపారు.

గిరిజన టీచర్లు, సిబ్బంది రిక్రూట్‌మెంట్ తీరును మార్చాలి

ఆదివాసీల సంస్కృతి, స్థానిక భాష తెలిసిన వారికే ఉద్యోగాలివ్వాలి : కేంద్రమంత్రికి బృందాకరత్ లేఖ

న్యూఢిల్లీ : గిరిజన విద్యార్థుల ప్రయోజనాలను దెబ్బతీసేలా వున్న ఇఎంఆర్ పాఠశాలల్లోని ప్రస్తుత కేంద్రీకృత రిక్రూట్‌మెంట్ ప్రకియలను మార్చే విషయంలో జోక్యం చేసుకోవాలని, తక్షణమే వాటిని మార్చాలని సీపీఐ(ఎం) కోరింది. ఈ మేరకు కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి జ్యూయల్ ఓరమ్‌కు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కరత్ సోమవారం లేఖ రాశారు. గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలు, ముఖ్యంగా స్థానిక భాష తెలిసిన వారిని మాత్రమే అక్కడ రిక్రూట్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

దేశవ్యాప్తంగా ఇఎంఆర్ పాఠశాలల్లో చదువుతున్న ఆదివాసీ విద్యార్థుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఆదివాసీ విద్యార్థులకు ఉత్తమ విద్యా పద్ధతులను, అవకాశాలను అందించేందుకు ఈ పాఠశాలలు ఉద్దేశించబడ్డాయి. ఆదివాసీ సంస్కృతులు, వారి భాషలు, అవసరాలను అర్థం చేసుకోవడానికి బోధనా సిబ్బంది నిబద్ధతతో, సున్నితత్వంతో పనిచేయడం ఎంతో అవసరం. కానీ దురదృష్టవశాత్తూ, ఈ ఇఎంఆర్ స్కూళ్ళ బోధనా, బోధనేతర సిబ్బంది అలాగే ప్రిన్సిపాల్ పదవులను భర్తీ చేయడానికి ప్రస్తుతం అనుసరిస్తున్న రిక్రూట్‌మెంట్ పద్దతి లోపభూయిష్టంగా వుందని బృందాకరత్ ఆ లేఖలో పేర్కొన్నారు. దీన్ని సవరించని పక్షంలో ఈ పాఠశాలలు ఎందుకోసం ఏర్పాటు చేశారో ఆ ప్రయోజనాలు దెబ్బతింటాయని అన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు జాతీయ గిరిజన విద్యార్థుల విద్యా సొసైటీ (ఎన్‌ఈఎస్‌టీఎస్) అనుసరిస్తోన్న కొత్త రిక్రూట్‌మెంట్ పద్ధతి గురించి ఆమె ప్రస్తావించారు. గతంలో రిక్రూట్‌మెంట్‌ను రాష్ట్ర అధికారులు జరిపేవారు. రాబోయే ఐదేండ్లలో ఈఎంఆర్ పాఠశాలలకు 38వేల మంది సిబ్బందిని కేంద్ర సంస్థ ఎన్‌ఈఎస్‌టీఎస్ రిక్రూట్ చేస్తుందని గత బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఆదివాసీల సంస్కృతులు గురించి ఎవరికీ అవగాహన వుండనవసరం లేని రీతిలో ఈ కేంద్రీకృత పరీక్షను రూపొందించారు. పైగా ఆశ్చర్యం గొలిపే రీతిలో ఈ పరీక్ష రాసే అభ్యర్థులందరికీ ఇంగ్లీషు, హిందీల్లో ప్రావీణ్యత వుండడం తప్పనిసరి చేశారు కానీ రాష్ట్ర భాష గురించి అస్సలు పట్టించుకోకపోవడం విచారకరం. ఇక ఆదివాసీల కమ్యూనిటీల గురించి అస్సలు తెలియదు. రాష్ట్ర భాషను ఎందుకు ఇంతలా నిర్లక్ష్యం చేస్తున్నారు? ఆదివాసీ సంస్కృతులు, భాషల గురించి తెలిసి వుండాల్సిన నిబంధనలు ఎందుకు చేర్చలేదు? దక్షిణ లేదా తూర్పు, ఈశాన్య భారతాలకు చెందిన రాష్ట్రాల్లో మాట్లాడే భాష కాని హిందీని ఎందుకు రాష్ట్రాలపై రుద్దుతున్నారు? పైగా రిక్రూట్ అయినవారు రెండేళ్ళలోగా స్థానిక భాష నేర్చుకోవాలని కోరుతున్నారు. ఇది సాధ్యమేనా? ఒకవేళ సాధ్యమైతే పిల్లలకు విద్య నేర్పేటపుడు భాషే ప్రధాన అడ్డంకిగా మారుతున్నందున ఈ రెండేళ్ళలో జరిగేదేమిటి? నిజానికి, తమది కాని భాషకు సర్దుకుపోవాల్సిన పరిస్థితి పిల్లలకు ఏర్పడుతోంది. వారు నేర్చుకునే క్రమంలో అనేక తీవ్ర పర్యవసానాలు ఎదుర్కొంటారు.

ఈఎంఆర్‌లు తరచుగా మారుమూల ప్రాంతాల్లో వుంటాయి. దీనివల్ల స్థానికేతరులైన ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది ఏదో ఒక సాకుతో పాఠశాలలకు గైర్హాజరయ్యే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. ఇప్పటికే ఇది అనుభవంలోకి వచ్చింది. పైగా ఇలా రిక్రూట్ అయినవారిలో ఎక్కువమంది తమ స్వస్థలాలకు, తమ కుటుంబాలకు దగ్గరగా వుండే ప్రాంతాలకు బదిలీ చేయించుకోవాలని కోరుకుంటారు. నిజానికి, ఇలా బదిలీల కోసం చాలా అభ్యర్ధనలు వచ్చాయని, అందువల్ల పోస్టింగ్‌లు ఇచ్చిన అభ్యర్థులందరూ తమ పోస్టింగ్‌ను మార్చాలని కోరుతూ ఎన్‌ఈఎస్‌టీఎస్ ఆఫీసుకు రావద్దని గిరిజన వ్యవహారాల వెబ్‌సైట్‌లోనూ మరీ ముఖ్యంగా ఎన్‌ఈఎస్‌టీఎస్ వెబ్‌సైట్‌లోనూ పేర్కొన్నారు. ప్రస్తుతం, పోస్టింగ్ మార్చాలని కోరుతున్న అభ్యర్థనలు వేటినీ పరిగణించడం లేదు. ఇది కాకుండా, ఒకవేళ జరిగితే బదిలీలు ఎన్‌ఈఎస్‌టీఎస్ వెబ్‌సైట్‌లోని ట్రాన్స్‌ఫర్ పోర్టల్ ద్వారా జరిగాలి. బదిలీ విధానం రూపొందించిన తర్వాత ఈ పోర్టల్ అందుబాటులోకి రావాలి. విద్యార్థుల ప్రయోజనాలకు హామీ కల్పించేందుకు అత్యుత్తమమైన మార్గం ఏమంటే, ఈఎంఆర్ స్కూళ్ళలోని బోధన, బోధనేతర సిబ్బందికి కచ్చితంగా విద్యార్థులు మాట్లాడే భాష తెలిసి వుండాలి. విద్యార్థులు నివసించే సాంస్కృతిక సమాజ కట్టుబాట్లు, ఆచార, సాంప్రదాయాలు తెలిసి వుండాలని బృందాకరత్ ఆ లేఖలో సూచించారు. అందువల్ల స్థానికులను మాత్రమే రిక్రూట్ చేసుకునే విషయాన్ని పరిశీలించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దీనికి సంబంధించిన ఉదాహరణ వుంది. గుణపాఠం కూడా వుంది. ఉమ్మడి ఆంధ్రాలో గిరిజనుల ప్రాబల్యం గల ప్రాంతాల్లో రెగ్యులర్ అటెండెన్స్‌కు, బోధనకు ఎస్‌టీ టీచర్లకు వంద శాతం రిజర్వేషన్ వుంది. జస్టిస్ అరుణ్ మిశ్రా నేతృత్వంలోని సుప్రీం బెంచ్ దీని కొట్టివేయడంతో, రిక్రూట్‌మెంట్ నిబంధనలను మార్చడంతో ఎస్‌టీయేతర కమ్యూనిటీలకు చెందిన కొత్తగా రిక్రూట్ అయినవారు స్కూళ్ళకు



రెగ్యులర్‌గా వెళ్ళలేదని తేలింది. దానివల్ల పిల్లలు బాగా ఇబ్బందులు పడ్డారు. జెఎస్ఎల కోసం తెలంగాణాలో గల ఖాళీల్లో ఎన్‌ఈఎస్‌టీఎస్ కేంద్రీకృత రిక్రూట్‌మెంట్ పద్ధతి వల్ల 47మందిని నియమిస్తే 44మంది హర్యానా రాష్ట్రానికి చెందినవారే వున్నారు. ఒక్కరు కూడా తెలంగాణాకు చెందినవారు లేరు. తెలంగాణాకు చెందినవారికి హిందీలో ప్రావీణ్యత లేకపోవడమే కారణం. కానీ తెలుగులో వారికి వున్న ప్రావీణ్యత ఏ దశలోనూ ఎక్కడా పరిగణనలోకే తీసుకోలేదు. అందువల్ల ప్రస్తుతం అనుసరిస్తున్న ఈ పద్ధతి రాజ్యాంగ ఫెడరల్ స్వభావంపై దాడి చేయడమే కాకుండా ఈఎంఆర్‌ల ప్రయోజనాలనే దెబ్బతీస్తున్నాయని బృందా కరత్ ఆ లేఖలో పేర్కొన్నారు. గిరిజన విద్యార్థులకు సాయం చేయడానికి ఈఎంఆర్‌లు చాలా ముఖ్యమైన సంస్థ. అయితే, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో వుంచుకుని ప్రస్తుతమున్న రిక్రూట్‌మెంట్ పద్ధతిని మార్చాల్సిన అవసరం వుందని బృందాకరత్ స్పష్టం చేశారు. ఈ అంశంపై తగిన రీతిలో దృష్టి సారించి తక్షణమే పరిష్కరించాల్సిందిగా ఆమె కోరారు.

కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిగా కొత్తగా బాధ్యతలు చేపట్టినందుకు అంతకుముందు ఆమె మంత్రికి అభినందనలు తెలియచేశారు.

ఇమ్రాన్ ఖాన్ పార్టీపై నిషేధం ?

- ఆయనతో సహా ముగ్గురిపై కేసులు
- ప్రకటించిన పాక్ సర్కార్


ఇస్లామాబాద్ : జాతి వ్యతిరేక కార్యకలాపాల్లో ప్రమేయమున్నందుకు మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ పార్టీపై నిషేధం విధించనున్నట్లు పాక్ ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. దేశ ద్రోహానికి పాల్పడ్డారంటూ ఆయనపై, ఇద్దరు సీనియర్ పార్టీ సహచరులపై కేసులు బనాయించింది.

విదేశీ నిధుల కేసు, మే 9 అల్లర్లు, సిఫర్ అధ్యాయం, అమెరికా సభలో తీర్మానం ఆమోదించడం ఇవన్నీ చూస్తుంటే ఖాన్ పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పిటిఐ)ని నిషేధించేందుకు విశ్వసనీయమైన సాక్ష్యాధారాలు వున్నాయని విశ్వసిస్తున్నట్లు సమాచార శాఖ మంత్రి అత్తుల్లా తరార్ పత్రికా సమావేశంలో ప్రకటించారు. 2022 ఏప్రిల్‌లో ప్రధాని పదవి నుంచి తప్పించినప్పటి నుండి ఆయనపై నమోదైన పలు కేసుల్లో ఖాన్ రావల్పిండిలోని అడియాలా జైల్లో వున్నారు. ఖాన్‌తో పాటు మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీలపై 6వ అధికరణ కింద కేసులు నమోదు చేసినట్లు జియో న్యూస్ తెలిపింది.

తమ సహనాన్ని, ఓపికను వారు బలహీనతగా పరిగణిస్తున్నారని తరార్ వ్యాఖ్యానించారు. దేశాన్ని రాజకీయంగా,ఆర్థికంగా సుస్థిరపరచాలని తమ ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ తరుణంలో పిటిఐ, పాకిస్తాన్ కలిసి వుండలేవని అన్నారు.పార్టీని నిషేధించాలని కోరుతూ సుప్రీంలో పిటిషన్ వేయనున్నట్లు చెప్పారు.

సంపాదకీయం

శృంగభంగం



సార్వత్రిక ఎన్నికలలో చావుతప్పి కన్ను లొట్టపోయిన బీజేపీకి నిన్నటి ఉపఎన్నికలు మరింత శృంగభంగం కలిగించాయి. సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికార ఎన్డీయే, ప్రతిపక్ష ఇండియా బ్లాక్‌కు తొలి పరీక్షగా భావించిన అసెంబ్లీ ఉప ఎన్నికల్లో 'ఇండియా బ్లాక్' జయకేతనం ఎగురవేసింది. దేశవ్యాప్తంగా 7 రాష్ట్రాల్లోని 13 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల ఫలితాల్లో ఇండియా బ్లాక్ 10 చోట్ల విజయం సాధించి, బీజేపీని రెండు స్థానాలకే పరిమితం చేసింది. మరో చోట స్వతంత్ర అభ్యర్థి గెలుపొందారు. జులై10న పశ్చిమ బెంగాల్‌లోని నాలుగు, హిమాచల్ ప్రదేశ్‌లోని మూడు, ఉత్తరాఖండ్‌లోని రెండు, పంజాబ్, బీహార్, తమిళనాడు, మధ్యప్రదేశ్‌లోని ఒక్కొక్క స్థానానికి ఉపఎన్నిక జరిగిన విషయం విధితమే. శనివారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభం నుంచే ఇండియా బ్లాక్ అభ్యర్థులు ఆధిక్యంలో కొనసాగారు. ఫిబ్రవరి 27న జరిగిన రాజ్యసభ ఎన్నికలలో హిమాచల్ ప్రదేశ్‌లో ఫిరాయింపులను ప్రోత్సహించడం ద్వారా అనైతిక విజయం సాధించిన బీజేపీకి ప్రస్తుతం జరిగిన ఉప ఎన్నికలలో ప్రజలు తగిన పాఠం చెప్పారు.

> రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు (హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ, బీహార్) ఒకరకంగా ఇది రిహార్సల్స్‌గా భావించవచ్చు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతిపక్షాలు మరింత ఐక్యంగా వ్యవహరించాలని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అనాలోచిత విధానాల వలన సార్వత్రిక ఎన్నికలలో ఇండియా బ్లాక్ తగిన ఫలితాలు రాబట్టలేకపోయింది. ఈ ఉపఎన్నికలలో వచ్చిన ఫలితాలతోనైనా కాంగ్రెస్ పార్టీ మేల్కొని ప్రతిపక్షాల మధ్య మరింత ఐక్యతకు కృషి చేయాలి. అవసరమైతే ఆ పార్టీ కొన్ని త్యాగాలకు కూడా సిద్ధపడాలి.

ఇందులో నాలుగు రాష్ట్రాల్లో ఇండియా బ్లాక్ అధికారంలో ఉండగా, మూడుచోట్ల ఎన్డీయే ప్రభుత్వం ఉంది. పశ్చిమబెంగాల్‌లో రాయ్‌గంజ్, రాణాఘాట్, బాగ్దా, మాణిక్తలా నాలుగు స్థానాల్లోనూ తృణమూల్ అభ్యర్థులు విజయం సాధించారు. సార్వత్రిక ఎన్నికలలో ఉత్తరాఖండ్‌లో ఐదు ఎంపీ స్థానాలను గెలుచుకున్న కాషాయ పార్టీకి ఇప్పుడు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మంగలౌర్, బద్రీనాథ్ స్థానాలలో కాంగ్రెస్ విజయం సాధించింది. మొన్న అయోధ్యలో...నిన్న బద్రీనాథ్‌లో సైతం కాషాయ పార్టీని ప్రజలు ఓటు ఆయుధంతో తిప్పికొట్టారు. ప్రఖ్యాత హిందూ దేవాలయాలు ఉన్న చోట కూడా బీజేపీ ఓటమిపాలవడం గమనార్హం. ఇది దాని ' హిందూత్వ' భావజాలాన్ని హిందువులు కూడా ఆమోదించడం లేదనడానికి నిదర్శనం. బద్రీనాథ్ కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీలోకి మారారు. ఈ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించడం ద్వారా ఆయనకి తగిన బుద్ధి చెప్పారు.

తాజాగా ఇద్దరి గెలుపుతో 68 మంది సభ్యులున్న హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 40కి చేరింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 40 సీట్లు నెగ్గి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే రాజ్యసభ ఎన్నికల్లో ఏకంగా ఆరుగురు ఎమ్మెల్యేలు బీజేపీకి క్రాస్ ఓటింగ్ వేయడంతో సుఖు ప్రభుత్వాన్ని అస్థిరత వెంటాడింది. లోక్‌సభ ఎన్నికలతో పాటే 6 స్థానాలకు జరిగిన ఉపఎన్నికల్లో కాంగ్రెస్ నాలుగు నెగ్గింది. ఇప్పుడు మరో రెండు స్థానాలు గెలవడంతో కాంగ్రెస్ బలం మళ్లీ 40కి చేరింది. రాజీనామాచేసి బీజేపీ తీర్థం పుచ్చుకున్న ఇద్దరు స్వతంత్ర ఎమ్మెల్యేలు ఈ ఎన్నికల్లో భారీ మూల్యమే చెల్లించుకున్నారు. దేహ్రాలో సీఎం సతీమణి కమలేశ్ ఠాకుర్ బీజేపీపై విజయం సాధించారు. నాలాగఢ్ స్థానంలో కాంగ్రెస్ గెలుపొందగా... హమీర్‌పుర్ స్థానంలో మాత్రమే బీజేపీ గెలుపొందింది.

పంజాబ్ జలంధర్ స్థానంలో ఆప్ అభ్యర్థి మోహిందర్ భగత్ బీజేపీపై ఏకంగా 37వేల ఓట్ల మెజారిటీతో విజయం నమోదు చేశారు. తమిళనాడులోని విక్రావండి స్థానంలో డీఎంకే అభ్యర్థి అన్నియుర్ శివ విజేతగా నిలిచారు. మధ్యప్రదేశ్‌లోని అమర్వాడాలో బీజేపీ అభ్యర్థి కమలేశ్ షా గెలిచారు. బీహార్‌లోని రూపాలి స్థానంలో స్వతంత్ర అభ్యర్థి శంక్ సింగ్ జయకేతనం ఎగురవేశారు. మొత్తంగా ఈ ఫలితాలు మసకబారుతున్న "బ్రాండ్ మోడీ" ఇమేజేస్‌ను ఎత్తిచూపుతున్నాయి.

రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు (హర్యానా, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ, బీహార్) ఒకరకంగా ఇది రిహార్సల్స్‌గా భావించవచ్చు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రతిపక్షాలు మరింత ఐక్యంగా వ్యవహరించాలని ఈ ఫలితాలు సూచిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అనాలోచిత విధానాల వలన సార్వత్రిక ఎన్నికలలో ఇండియా బ్లాక్ తగిన ఫలితాలు రాబట్టలేకపోయింది. ఈ ఉపఎన్నికలలో వచ్చిన ఫలితాలతోనైనా కాంగ్రెస్ పార్టీ మేల్కొని ప్రతిపక్షాల మధ్య మరింత ఐక్యతకు కృషి చేయాలి. అవసరమైతే ఆ పార్టీ కొన్ని త్యాగాలకు కూడా సిద్ధపడాలి. ప్రస్తుతం అసెంబ్లీలో ఉన్న సీట్ల సంఖ్యతో నిమిత్తం లేకుండా అన్ని పార్టీలకు సీట్లను కేటాయించాలి. అప్పుడే ఇండియా బ్లాక్ ఓట్లు చీలిపోవు. కేంద్రంలో ప్రస్తుతం ఉన్నది సంకీర్ణ ప్రభుత్వం అన్న మాట మరిచి తన సొంత పార్టీ ప్రభుత్వంగా వ్యవహరిస్తూ మోడీ చేసే ప్రయత్నాలను తిప్పికొట్టే విధంగా ఉద్యమించాలి. మోడీ ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజల దృష్టికి తీసుకువెళ్లేందుకు ప్రయత్నించాలి. కార్మికులు, రైతులు, దళితులు, గిరిజనులు సమాజంలోని అణగారిన వర్గాలలో చైతన్యానికి కృషి చేయాలి. ప్రతిపక్షం ఐక్యంగా చర్చించి సమష్టి వ్యూహంతో వ్యవహరించకపోతే మోడీ మరింత దుష్పరిపాలన సాగించే అవకాశముందన్న విషయాన్ని కాంగ్రెస్ గమనంలో ఉంచుకోవాలి.

యూరప్‌లో ఫాసిజం దూకుడుకు కళ్లెం



ప్రభాత్ పట్నాయక్

ప్రపంచంలోని చాలా దేశాల్లో ఫాసిస్టు శక్తులు అధికారాన్ని చేపట్టడమో లేక చేపట్టే ప్రమాదం పొంచి వుండడమో ప్రస్తుతకాలంలో మనం చూస్తున్నాం. యూరప్‌లో చాలా దేశాల్లో ఫాసిస్టులు అధికారాన్ని చెలాయి స్తున్నారు. ఈ జాబితాలో ఫ్రాన్స్ దేశం పేరు కూడా చేరే ముప్పు దాదాపు ముంచుకొచ్చేసింది. అదే గనుక జరిగి వుంటే, ఇటలీ తర్వాత ఫాసిస్టు ప్రభుత్వాన్ని కలిగి వుండే రెండో ప్రధాన శక్తిగా ఫ్రాన్స్ అయి వుండేది. అప్పుడు అదొక చారిత్రిక ప్రాధాన్యతను సంతరించుకుని వుండేది. గతంలో ఫ్రాన్స్‌లో మార్షల్ పెటైన్ నాయకత్వంలో విచీ ప్రభుత్వం అడ్డగోలుగా హిట్లర్‌తో ముఠా కట్టి వ్యవహరించింది. ఆ కాలంలో ఫ్రాన్స్‌ను ఆక్రమించుకున్న నాజీ సైన్యాలను ఫ్రాన్స్‌లోని వామపక్షాలు, కార్మికవర్గం వీరోచితంగా సాయుధ ప్రతిఘటన ద్వారా తిప్పికొట్టాయి. అటువంటి బలమైన కార్మికోద్యమ వారసత్వాన్ని, వామపక్ష వారసత్వాన్ని కలిగి వున్న ఫ్రాన్స్‌లో ఇప్పుడు గనుక మళ్లీ ఫాసిస్టు శక్తుల చేతుల్లోకి అధికారం వచ్చి వుంటే అది అత్యంత విషాదకర సంఘటన అయి వుండేది. అయితే ఆ విధంగా జరగలేదు. ఫాసిస్టు దూకుడుకు ఫ్రాన్స్‌లో కళ్లెం వేశారు. అంతేగాక ఎన్నికల నిర్ణయాత్మక తుది రౌండ్‌లో న్యూ పాపులర్ ఫ్రంట్ (వామపక్ష కూటమి) గెలుపు సాధించింది.

ఫాసిజం ఒక సవాలుగా ముందుకు రావడం అంతగా అంతుపట్టని విషయం ఏమీ కాదు. పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోయినప్పుడు బడా పెట్టుబడి తన ఆధిపత్యానికి వచ్చే ముప్పు నుండి తప్పించుకోడానికి ఫాసిస్టు శక్తులతో చేతులు కలుపుతుంది. ఆ ఫాసిస్టు శక్తులు ప్రజల దృష్టిని ప్రధాన సమస్యల నుండి పక్కకు మళ్లించి ఏదో ఒక నిస్సహాయ స్థితిలో ఉన్న మైనారిటీ తరగతి ప్రజలకు వ్యతిరేకంగా తక్కినవారిలో ద్వేషాన్ని రెచ్చగొడుతుంది. ప్రజల దృష్టిని ఆవిధంగా పక్కకు మళ్లించడం ద్వారా బడా పెట్టుబడి తన పెత్తనాన్ని కాపాడుకుంటుంది, తన దోపిడీని కూడా మరింత ముమ్మరం చేస్తుంది.

1930 దశకంలో మహా మాంద్యం కాలంలో జరిగింది ఇదే. ప్రస్తుతం నయా ఉదారవాద విధానాలు ఆర్థిక వ్యవస్థను ఒక సుదీర్ఘ మాంద్యంలోకి, సంక్షోభంలోకి నెట్టాయి. 2008 నాటికి యూరప్ దేశాల్లో సగటున ఒక కుటుం బం తన ఆదాయంలో వెచ్చించగలిగిన సొమ్ముతో పోల్చితే 2023 నాటికి అది కేవలం 6.4 శాతం మాత్రమే పెరిగింది. ఈ పెరుగుదల చాలా తక్కువ. పైగా ఇందులో అతి ధనవంతుల ఆదాయాలు కూడా కలిసి వుంటాయి. ఈ కాలంలో ధనిక పేదల నడుమ ఆదాయాల అంతరాలు బాగా పెరిగాయి. ఈ అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నప్పుడు సామాన్యుల కుటుంబ ఆదాయాల్లో పెరుగుదల దాదాపు లేనట్టే అనుకోవాలి. అంతేగాక చిన్న పెట్టుబడిదారుల సంస్థల్లో ఉపయోగించే యంత్రాల, పరికరాల అరుగుదలను (దానిని డిప్రిసియేషన్‌గా లెక్కిస్తారు) ఈ లెక్కలు పరిగణనలోకి తీసుకోలేదు. చాలా పరిశ్రమలు పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో పని చేయగలిగిన స్థితి లేదు. దానికి మాంద్యం కారణం. అందుచేత ఆ డిప్రిసియేషన్ కూడా ఎక్కువగానే ఉంటుంది. అప్పుడు ఆ చిన్న, మధ్య తరహా పరిశ్రమల యజమానుల కుటుంబాల ఆదాయాలు కూడా నికరంగా తగ్గుతాయి. మొత్తంగా అతి సంపన్నుల కుటుంబ ఆదాయాలు మినహా తక్కినవారి నిజ ఆదాయాలలో పెరుగుదల ఏమీ లేదని బోధపడుతోంది. ఇటువంటి పరిస్థితులను అనుభవించవలసి వస్తున్నందుకు ప్రజల్లో ఆగ్రహం పెరుగుతుంది. ఈ ఆగ్రహాన్ని ఫాసిజం అదే ప్రజల్లోన్ని ఒక మైనారిటీ భాగం మీదకు మళ్లిస్తుంది. తద్వారా బడా పెట్టుబడిని కాపాడుతుంది.

అయితే బడా పెట్టుబడికి, ఫాసిస్టు శక్తులకు మధ్య చెలిమి రకరకాల మార్గాల్లో పెంపొందుతుంది. ఉదాహరణకు, ప్రజల్లో బడా పెట్టుబడిదారుల పట్ల ఉన్న ఆగ్రహాన్ని తమకు అనుకూలంగా ఉపయోగించుకోడానికి ఫాసిస్టులు ముందు తామూ బడా పెట్టుబడిదారులకు వ్యతిరేకమే అన్న అభిప్రాయాన్ని కలిగించే విధంగా వ్యవహరిస్తారు. అప్పట్లో హిట్లర్ చేసిందిదే. అటువంటి సందర్భంలో కూడా వాళ్లకి కొంతమంది గుత్త పెట్టుబడిదారులు చాటు మాటుగా సహకరిస్తారు. ఒకసారి ఫాసిస్టులు అధికారం చేజిక్కించుకున్నాక ఇక బాహాటంగానే వారికి బడా పెట్టుబడిదారులతో ఉన్న భాగస్వామ్యం బైట పడుతుంది. తమకు మొద ట్లో మద్దతుదారులుగా ఉంటూ అధికా రంలోకి వచ్చాక కూడా బడా పెట్టుబడి దారులకు వ్యతిరేక వైఖరిని పాటించే వారినందరినీ నిర్మొహమాటంగా పార్టీ నుండి బయటకు తోలేస్తారు.

మన దేశంలో ఈ విషయంలో కొంత తేడా ఉంది. మైనారిటీ మతస్తుల పట్ల విద్వేషాన్ని రెచ్చగొట్టే తొలి దశలో కూడా ఇక్కడి ఫాసిస్టులు తమకు బడా పెట్టుబడిదారులతో ఉన్న చెలిమిని ఎక్కడా దాచిపెట్టలేదు. ప్రత్యేకించి కొంతమంది బడా పెట్టుబడిదారులతో బాగా సన్నిహితంగా మెలుగుతూ వచ్చారు. ఐతే ఫ్రాన్స్‌లో నయా ఫాసిస్టులు మాత్రం ముందు దశలో గుత్త పెట్టుబడికి తాము వ్యతిరేకం అన్నట్టు కొంత హడావుడి చేశారు. ఫ్రెంచి ఫాసిస్టు నాయకురాలు మెరైన్ లీపెన్ నయా ఉదారవాద విధానాలకు తాను వ్యతిరేకం అన్నట్టు వ్యవహరించింది. గ్రీస్‌లో సిరిజా పార్టీ ఎన్నికల సమయంలో నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ విధానాలను అమలు చేస్తానని ప్రకటించి ఎన్నికల్లో గెలిచిన తర్వాత అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒత్తిళ్లకు లొంగిపోయింది. ఆ సందర్భంలో లీపెన్ సిరిజా పార్టీ ద్రోహం చేసిందంటూ విరుచుకుపడింది. కాని ఆమె పార్టీకి ఫ్రెంచి మీడియా గుత్తాధిపతి. శత కోటీశ్వరుడు అయిన విన్సెంట్ బొల్లొరె పూర్తి అండదండలందించాడు. ఎన్నికల సమయం సమీపిస్తున్న కొద్దీ ఆ పార్టీ ప్రధానమంత్రి అభ్యర్థి జోర్డాన్ బార్డెల్లా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి వ్యతిరేకంగా మాట్లాడడం తగ్గించివేశాడు. మొదట్లో తమ పార్టీ ప్రకటించిన వైఖరికి ఇది భిన్నమైనది.

ఇటలీలో కూడా ఇదే విధంగా జరిగింది. అక్కడ ఫాసిస్టు నాయకురాలు జార్జియా మెలోనీ ముందు తమ ఆర్థిక ఎజెండా నయా ఉదారవాద విధానాలకు భిన్నంగా ఉంటుందని ప్రకటించారు. అప్పటికి అధికారంలో ఉన్న మారియో డ్రాఘీ ప్రభుత్వం సూటిగా నయా ఉదారవాద విధానాలనే అమలు చేస్తోంది. మెలోనీ ప్రకటించిన వైఖరిని నమ్మి ప్రజలు ఆమెకు పట్టం కట్టారు. కాని ఒకసారి అధికారం చేతికి వచ్చాక తాను అంతకు ముందు ప్రకటించిన దానికి భిన్నంగా బడా పెట్టుబడికి అత్యంత విశ్వసనీయమైన మిత్రురాలిగా మెలోనీ మారిపోయారు.

> యూరప్‌లోని వామపక్షాలు బూర్జువా పార్టీకి తోకల్లా వ్యవహరించడం అనేది చాలాకాలం నుండి కొనసాగుతున్నదే. యుగోస్లేవియా మీద బాంబులు వేసినప్పటి నుంచీ వారిది అదే వైఖరి. ఇలా సామ్రాజ్యవాదులకు తోకల్లా వ్యవహరించడం అనేది ఇప్పుడు ముదిరిపోయి ఉక్రెయిన్ యుద్ధానికి, నయా ఉదారవాదానికి పూర్తి మద్దతు తెలిపేదాకా వాళ్లుపోయారు. దాంతో ఫాసిస్టులు తామే శాంతిని పరిరక్షించేవాళ్లమని, తామే ప్రజల్ని బాధల నుండి విముక్తి చేయగలం అని పోజు పెట్టడానికి అవకాశం వచ్చింది. ఆ పోజు ఒకసారి వాళ్లు అధికారంలోకి రాగానే మారిపోతుంది. అటువంటి ఫాసిస్టు శక్తుల ఆటలు కట్టించే దారి ఫ్రాన్స్‌లోని వామపక్షాలు చూపుతున్నాయి. నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ ఎజెండాను రూపొందించి ప్రజల్లోకి దానిని తీసుకుపోవడమే ఆ మార్గం.

ఉక్రెయిన్ యుద్ధం విషయంలో కూడా చాలామంది యూరోపియన్ ఫాసిస్టులు ఇదే విధంగా తమ తమ పూర్వపు వైఖరులను మార్చుకున్నారు. యూరోపియన్ కార్మికవర్గం స్పష్టంగా ఉక్రెయిన్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తోంది. రష్యా మీద విధించిన ఆంక్షల కారణంగా పెరిగిపోయిన ఇంధన ధరల భారాన్ని వారు భరించలేక పోతున్నారు. తిరిగి శాంతి నెలకొనాలని వారంతా కోరుతున్నారు. ఫాసిస్టులు మొదట్లో కార్మికుల మద్దతు పొందడం కోసం యుద్ధం పట్ల కొన్ని అభ్యంతరాలను ప్రకటించారు. కాని అధికారంలోకి వచ్చాక వారంతా అమెరికా విధించిన ఆంక్షలను పూర్తిగా బలపరచం ప్రారంభించారు. తమకన్నా ముందు పాలించిన ఉదారవాద బూర్జువా పార్టీలు అనుసరించిన వైఖరికి వీరు అనుసరించే వైఖరికి తేడా లేకుండా పోయింది.

క్లుప్తంగా చెప్పాలంటే ఫాసిస్టు శక్తులు ఒక మైనారిటీ భాగపు ప్రజలమీద ద్వేషాన్ని రెచ్చగొట్టడం మాత్రమే కాకుండా శ్రామిక వర్గాన్ని సైతం మోసం చేస్తారు. ఉదారవాద బూర్జువా పార్టీకన్నా తాము భిన్నంగా పాలిస్తామని చెప్పుకున్నా ఆచరణలో ఆ ఉదారవాద బూర్జువా పార్టీకన్నా కూడా మితవాద వైఖరులను పాటిస్తారు. అది ఆర్థిక విధానాలైనా లేక ఉక్రెయిన్ యుద్ధం విషయం అయినా అంతే. ఇస్లాం మతం పట్ల విద్వేషాన్ని, భయాన్ని రెచ్చగొట్టడంలో గాని, బతుకుదెరువు కోసం వలసలు వచ్చే కాందిశీకుల పట్ల శత్రుత్వాన్ని కలిగించడంలోకాని, ఆ ఉదారవాద బర్జువా పార్టీలను మించి మితవాద వైఖరిని ప్రదర్శిస్తారు. ఆర్థిక విధానాలలో, యుద్ధం పట్ల వైఖరిలో ఆ ఉదారవాద బూర్జువా పార్టీల అడుగుజాడల్లోనే నడుస్తారు. అధికారంలోకి వచ్చేంత వరకూ, కార్మిక వర్గపు ఓట్ల కోసం దొంగనాటకం ఆడతారు.

వీళ్ల నాటకాలు ఇలా సాగడానికి అవకాశం ఇచ్చింది వామపక్షాలే. వామపక్షాలలోని ప్రధాన శక్తులు కార్మికవర్గ ప్రయోజనాలను పరిరక్షించే బాధ్యతను వదిలిపెట్టి బూర్జువ వర్గానికి తోకలుగా తయారయ్యారు. జర్మనీలో ఉక్రెయిన్ యుద్ధం కారణంగా రష్యా మీద విధించిన ఆంక్షల ఫలితంగా ద్రవ్యోల్బణం బాగా పెరిగింది. దీనివలన అక్కడి కార్మికవర్గం బాగా దెబ్బ తింటోంది. అందుచేత జర్మన్ కార్మికవర్గం యుద్ధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కాని అక్కడ సోషల్ డెమోక్రాట్లతోబాటు వామపక్షాలు సైతం అమెరికన్ సామ్రాజ్యవాదానికి మద్దతుగా నిలబడ్డాయి. ఆ వామపక్షాల నుండి చీలిపోయిన సహ్రా వేగెన్‌నెక్ట్ గ్రూపు గట్టిగా యుద్ధాన్ని వ్యతిరేకించే వైఖరి తీసుకుంది. అందుచేత ఆ గ్రూపునకు కార్మికుల్లో ఆదరణ బాగా పెరుగుతోంది. జర్మనీలోని వామపక్షాల మాదిరిగానే యూరప్‌లోని చాలా వామపక్షాలు నయా ఉదారవాదాన్ని బలపరిచేవారుగా తయారయ్యారు. ఈ వైఖరి వలన ఫాసిస్టుల పని తేలికైంది. వాళ్లు కార్మికవర్గాన్ని తేలికగా మోసగించగలుగుతున్నారు.

సరిగ్గా ఇక్కడే ఫ్రాన్స్‌లో పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వామపక్షాలు న్యూ పాపులర్ ఫ్రంట్ అనే ఒక కొత్త కూటమిని కూర్చడంలో జయప్రదం అయ్యారు. అంతేగాక ఆ కూటమి నయా ఉదారవాద విధానాలకు భిన్నమైన ఆర్థిక కార్యక్రమాన్ని ఆమోదించేలా చేయగలిగారు. అంత వరకూ ఫాసిస్టులను అధికారం నుండి దూరంగా ఉంచాలని కోరుకున్నవారు చాలా మంది ఉన్నప్పటికీ, వారి వద్ద నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ కార్యక్రమం అంటూ ఏదీ లేదు. ఈ పరిస్థితిని మాక్రాన్ బాగా ఉపయోగించుకున్నాడు. నయా ఉదారవాద విధానాలను వేగంగా అమలు చేశాడు. దానిని కార్మికవర్గం రానురాను తీవ్రంగా వ్యతిరేకించడం జరుగుతున్నా అతడు పట్టించుకోలేదు. మాక్రాన్ పలుకుబడి తగ్గుతున్న కొద్దీ ఆ మేరకు ఫాసిస్టులు బలపడడం ప్రారంభించారు. ప్రజల్ని ఆకట్టుకోవడం కోసం వాళ్ళు అతడి ఆర్థిక విధానాలను విమర్శించడం చేశారు. ఐతే ఈ వ్యవహారానికి ఇప్పుడు తెర పడింది. న్యూ పాపులర్ ఫ్రంట్ ఫాసిజాన్ని వ్యతిరేకించడమే గాక, ప్రత్యామ్నాయ ఆర్థిక కార్యక్రమాన్ని కూడా రూపొందించడమే దీనికి కారణం.

రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో ఫాసిస్టు వ్యతిరేక కార్యక్రమం ఒక్కటే. యుద్ధాన్ని వెంటనే నిలుపు చేయాలన్నదే ఆ కార్యక్రమం. వేరే ఆర్థిక ఎజెండా ఏదీ అవసరం లేకపోయింది. అప్పటి మాదిరిగానే ఇప్పుడు కూడా కేవలం ఫాసిస్టు వ్యతిరేకతను ఒక్కదానినే కార్యక్రమంగా పెట్టుకుని, నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయంగా ఒక కార్యక్రమాన్ని రూపొందించ కుండా ముందుకు పోవాలనుకుంటే ప్రస్తుత పరిస్థితుల్లో అది ముందుకు సాగదు. కేవలం ఫాసిస్టు వ్యతిరేకత ప్రాతిపదికగా ప్రత్యామ్నాయ రాజకీయ శక్తులు కలిస్తే అది సామాన్య ప్రజల ఆర్థిక స్థితిగతుల్ని ఏమాత్రమూ మెరుగుపరచలేదు. సరికదా ఫాసిస్టు శక్తుల విజయావకాశాలను అది మరింత పెంచుతుంది.

యూరప్‌లోని వామపక్షాలు బూర్జువా పార్టీకి తోకల్లా వ్యవహరించడం అనేది చాలాకాలం నుండి కొనసాగుతున్నదే. యుగోస్లేవియా మీద బాంబులు వేసినప్పటి నుంచీ వారిది అదే వైఖరి. ఇలా సామ్రాజ్యవాదులకు తోకల్లా వ్యవహరించడం అనేది ఇప్పుడు ముదిరిపోయి ఉక్రెయిన్ యుద్ధానికి, నయా ఉదారవాదానికి పూర్తి మద్దతు తెలిపేదాకా వాళ్లుపోయారు. దాంతో ఫాసిస్టులు తామే శాంతిని పరిరక్షించేవాళ్లమని, తామే ప్రజల్ని బాధల నుండి విముక్తి చేయగలం అని పోజు పెట్టడానికి అవకాశం వచ్చింది. ఆ పోజు ఒకసారి వాళ్లు అధికారంలోకి రాగానే మారిపోతుంది. అటువంటి ఫాసిస్టు శక్తుల ఆటలు కట్టించే దారి ఫ్రాన్స్‌లోని వామపక్షాలు చూపుతున్నాయి. నయా ఉదారవాద విధానాలకు ప్రత్యామ్నాయ ఎజెండాను రూపొందించి ప్రజల్లోకి దానిని తీసుకుపోవడమే ఆ మార్గం.

(స్వేచ్ఛానుసరణ)

అంకురిస్తున్న ఇరాన్ ప్రజాస్వామ్యం!

ఇరాన్ దేశాధ్యక్షునిగా ఉదారవాది మసూద్ పెజిష్కియన్ ఎన్నిక కావడం చాలామందిని ఆశ్చర్యచకితుల్ని చేసింది. ప్రజాస్వామ్యం అంకురించి విరబూయడానికి ఈ ఎన్నిక విజయం ఎంతో కొంత దోహదపడగలదని పలువురు రాజకీయ పరిశీలకులు నేడు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందుకే సర్వత్రా హర్షామోదం వెల్లడవుతున్నది.

ఇరాన్‌లో రాజరికం కుప్పకూలి 45 ఏండ్లు కావస్తున్నది. 1979లో ఇరాన్ రాజు షా మహ్మద్ రెజా పెహ్లావి రాజరికం కూలిపోయిన తర్వాత అయితుల్లా ఖోమైనీ నాయకత్వంలో అక్కడ ఇస్లామిక్ ప్రభుత్వం ఏర్పడింది. ఆసియా ఖండంలో ఇరాన్ ఓ మధ్య ప్రాచ్యదేశం. జనాభా దాదాపు ఏడుకోట్లు, గతంలో ఇరాన్‌ను ప్రష్యా అని కూడా పిలిచేవారు. ఇరాన్ పేరుకు అర్థం స్థలి ఆర్యన్. అంటే ఆర్య భూమి. ఆర్యులు మన భారత దేశానికి అక్కడినుండే తరలి వచ్చారనే వాదన లేకపోలేదు.

ప్రస్తుతం ఆదేశంలో పేరుకు ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వం అని ఉన్నా... అది గతంలోని మత రాజరిక ప్రభుత్వాలకంటే భిన్నమైనది కాదనే వాస్తవం ఎప్పటికప్పుడు వెల్లడవుతూనే ఉంటుంది.

2022లో మెహసా అమినీ అనే యువతి హిజాబ్ వస్త్రధారణ సరిగా పాటించలేదనే నెపంపై పోలీసులు నిర్బంధించారు. ఆ నిర్బంధంలో చిత్రహింసలు పెట్టిన కారణాన ఆమె మరణించడంతో ప్రజా నిరసన మిన్నంటిందప్పుడు. నిరసనను అణచేందుకు ప్రభుత్వం రకరకాల చర్యలకు ఒడిగట్టింది. నిరసన చెలరేగుతున్న ప్రాంతాలను గుర్తించి నెట్ బంద్ చేసింది. సామాజిక మాధ్యమాలపై నిషేధం విధించింది. ఉద్యమకారులపై పోలీసుల దమనకాండ నిత్యకృత్యమైంది. వేల సంఖ్యలో ప్రజలు జైళ్ల పాలయ్యారు. చిత్రహింసలకు గురయ్యారు. అమాయకులు బలైపోయారు.

అయినా యువతులు, మహిళలు పెద్ద సంఖ్యల్లో అప్పుడు వీధుల్లోకి వచ్చి హిజాబ్ వస్త్రధారణను బాహాటంగా ఉల్లంఘించడం వెల్లువెత్తింది. అధికారులనే కాక మతఛాందసులకు సైతం ఏం చేయాలో పాలు పోలేదు.

'మహిళల జీవితం మహిళలదే. మతం ముసుగులో మగ పెత్తనమేంటి? అంటూ మహిళా ధిక్కారస్వరం దిక్కులు పిక్కటిల్లేలా మార్మోగింది. చాపకింద నీరులా సాగిన ఆ ప్రజాస్వామ్య ఉద్యమ హోరు ఈ మార్పునకు ఇప్పుడు నాంది పలికినట్టు వారు భావిస్తున్నారు. యుద్ధవీరుడు సయ్యద్ జలీలీ మీద సంస్కరణ వాది పెజిష్కియన్ మంచి మెజారిటీతో గెలవడం సామాన్య విషయంకాదనేవి ఆ పరిశీలకుల అభిప్రాయం.

'సంప్రదాయాలను గౌరవిస్తూనే. ఆధునికతకు చోటివ్వక తప్పదని' పెజిష్కియన్ ఇప్పుడు అంటున్నాడు, స్త్రీలను రెండో తరగతి పౌరులుగా చూడటం ఇక ఎంతమాత్రం తగదని కూడా చెబుతున్నాడు.

ఇరాన్‌లోని అల్పసంఖ్యాక వర్గాలతో పాటు సంస్కరణ వాదులు, ప్రజాస్వామ్యవాదుల ఆదరణ సైతం పొందడం వల్లనే పెజష్కియన్‌కు 53 శాతం ఓట్ల ఘన విజయం లభించినట్టు బోగట్టా.

గత అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ మే నెలలో హెలికాప్టర్ ప్రమాదంలో మరణించడం వల్లనే ఇప్పుడు ఈ అధ్యక్షుని ఎన్నిక జరిగింది. కాగా ఈ ఎన్నికల బరిలో నిలవడానికి షియా మతాచార్యుల మండలి అనుమతి లభించిన ఏకైక సంస్కరణ వాది పెజిష్కియన్ మాత్రమే.

పెజిష్కియన్ గెలుపును ఇరాన్ మిత్రదేశం రష్యా వెంటనే స్వాగతించింది. వృత్తి రీత్యా హృదయ శస్త్ర నిపుణుడై పెజిష్కియన్ ఇరవైయేండ్ల క్రితం ఆరోగ్యమంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్నది.

అగ్రరాజ్యం అమెరికా ఆంక్షల కారణంగా ఇరాన్ నేడు ఉక్కిరి బిక్కిరవుతున్నది. ఇరాన్ అణ్వస్త్ర తయారీని విరమిస్తే తప్ప ఆర్థిక ఆంక్షలు సడలించమని అమెరికా బెదిరిస్తున్నది. అయితే గాజాలో ఇజ్రాయిల్ సైన్యాలతో పోరాడుతున్న పాలస్తీనా సాయుధ బృందాలకు ఇరాన్ అండగా నిలుస్తున్నది. ఇజ్రాయిల్‌కు అడుగడుగునా వత్తాసు పలుకుతున్నది. అమెరికా అనేది జగమెరిగిన సత్యం.

అమెరికా - ఇజ్రాయిల్ యుద్ధోన్మాద చర్యలకు వ్యతిరేకంగా ఎర్రసముద్రంలో చమురు రవాణాకు ఆటంకం కలిగిస్తున్న హైతీ తిరుగుబాటు దార్లకూ ఇరాన్ మద్దతునిస్తున్నది. ఈ కారణాల రీత్యా ఇజ్రాయిల్ - ఇరాన్‌ల మధ్య క్షిపణుల యుద్ధం (మిస్సైల్ వార్) ఢీ అంటే ఢీ అంటున్నది.

ఈ నేపథ్యంలో ఎన్నికల పెజిష్కియన్ ఓ సంస్కరణవాదిగా అటు అంతర్గతంగానూ, ఇటు బహిర్గతంగానూ ఎలాంటి చర్యలు చేపడతాడా? అని లోకం ఎదురు చూస్తున్నది. ఆయన చేపట్టే పాలనా చర్యలకు మతాచార్యుల మండలి మరి తోడ్పాటునందిస్తుందా..? ఎందుకంటే ఆ మండలి సర్వాధికారి ఇప్పటికీ అయితుల్లా ఖొమైనీనే.

దేశం లోపల మతఛాందసత్వం, వెలుపల అమెరికా సామ్రాజ్యవాదాన్ని ఏకకాలంలో ధిక్కరిస్తూ ముందుకు సాగడం అత్యంత సాహసోపేతమైన కృత్యం. నిజంగా కత్తిమీద సాములాంటిదీ. అయితే ప్రజల ఆకాంక్షలు, ఆదరణ, ప్రజాఉద్యమాలు పెజిష్కి యన్ వెన్నంటి ఉన్నాయి. అదే ఆయన అద్వితీయ బలం.

ప్రజాస్వామ్యం బలోపేతం కావడానికి ఎక్కడైనా పునాదిగా నిలిచేది ప్రజల చొరవేనని, ప్రజల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని థోరో చెప్పిన మాటలు రుజువు కావడమే ఆ హర్షాతిరేకం.

- కె.శాంతారావు, 9959745723

మట్టిరాసిన 'మరణశాసనం'



షేక్ కరిముల్లా
9705450705

మూఢ నమ్మకాల పునాదుల మీద అసత్యాల సమాజం నిలిపి అమాయకుల నెత్తురుతో హోలీ ఆడుకుంటున్న దగుల్బాజీల్లారా! సత్యం ఏదో ఒక రోజు కారుమబ్బుల చీకటిని చీల్చుకొని ప్రచండ ఉసస్సుతో ఈ సమాజం మీద పరుచుకుంటుంది. జ్ఞానం చేతిలో కాగడా వచ్చి మొత్తం ప్రపంచాన్ని కాంతిమయం చేస్తుంది. అప్పుడు ఈ దోపిడీ సమాజం కూలిపోయి సత్యం అధారంగా ప్రకృతిని ప్రేమించే ఓ సమాజం నిర్మితమౌతుంది. అంతదాక మా ఈ పోరాటం కొనసాగుతుంది.

దేశంలో నకిలీ బాబాలకు కొదువేలేదు. వీరి లీలలు, అఘాయిత్యాలు, చీకటి వ్యాపారాలు యథేచ్ఛగా జరిగిపోతున్నాయి. మరి ముఖ్యంగా గడిచిన పదేళ్లుగా బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుండి వీరి ఆగడాలు ఎక్కువయ్యాయి. రాజ్యం అండదండలు వీరికి పుష్క లంగా ఉండడమే దీనికి కారణం. ఈ నకిలీ బాబాలు సహజంగా నేర స్వభావం కలిగి ఉంటారు. బాబాలుగా అవతారమెత్తి నేర వ్యాపార సామ్రాజ్యాలు నిర్మించుకుంటారు. ప్రజల బలహీనతలను ఆసరా చేసుకొని అంధ, మూఢవిశ్వాసాలను ప్రజల్లో నింపుతూ లక్షల కోట్ల ఆస్తులు దోచుకుంటారు. ఘరానాగా బతుకుతుంటారు. ఇలాంటి దొంగబాబాలకు అపారమైన రాజకీయ పలుకుబడి ఉంటుందని అనేకసార్లు రుజువైంది. సమాజంలో డబ్బున్న పెద్ద మనుషులు, రాజకీయ నాయకులు పార్టీలతో నిమిత్తం లేకుండా బాబాలను, మూఢ నమ్మకాలను విశ్వసించటంలో పోటీ పడుతుంటారు. మరీ విచిత్రం ఏమంటే చదువుకున్న మూర్ఖులు, సైన్సు చదువుకొని, ఏ మాత్రం శాస్త్రీయ దృక్పథం లేని సైంటిస్టులు అనబడే వారు కూడా ఈ బాబాల చుట్టూ తిరుగుతుంటారు. అంటే జ్ఞానానికి- చదువుకు లింకు ఎప్పుడో తెగిపోయిందని అర్థం చేసుకోవాలి. గతంలో అనేక నేరాలు చేసిన ఆశారామ్బపు, డేరా బాబా తదితర 15మంది వరకు బాబాలు జైళ్లలో ఉన్నారు. దేశంలో నూటికి 80శాతం తొక్కిసలాటలు ధార్మిక సమ్మేళనాలు, తీర్థ యాత్రలలో జరుగుతున్నవేనని అధ్యయనాలు చెబుతున్నాయి.



ఉత్తరప్రదేశ్ లోని హత్రాస్‌లో జులై రెండున స్వయం ప్రకటిత దేవునిగా ప్రకటించుకున్న బోలేబాబా 'సత్సంగ్' పేరిట నిర్వహించిన కార్యక్రమానికి 2.50 లక్షల మంది హాజరయ్యారు. బాబా పాదధూళి తాకితే సకల పాపాలు, రోగాలు పోతాయని, బాబా మహిమగల వ్యక్తి అని ఆయన శిష్యగణం ప్రచారం చేయడంతో ఆయన పాదధూళి కోసం అమాయక జనం పోటీ పడగా తొక్కిసలాట చోటుచేసుకుంది. 121 మంది మరణించారు. మరణించిన వారిలో 112 మంది మహిళలు, పిల్లలే ఉన్నారు. వీరందరూ పేదబడుగు జీవులే. ఈ ఘోరానికి కారకుడైన బాబా తొక్కిసలాట జరిగిన ప్రదేశం నుంచి తన మనుషులతో కలసి దర్జాగా ఉడాయించాడు. ప్రభుత్వం విచారణకు ఆదేశించి చేతులు దులుపుకుంది. 855 పేజీల సిట్ నివేదికలో బోలేబాబా పేరులేదు. కనీసం ఎఫ్ఐఆర్‌లో ఇతని పేరే లేదు. అంటే రాజ్యానికి బాబాలకు మధ్య బంధం ఎలాంటిదో అర్థం చేసుకోవచ్చు. ఈ నకిలీ బాబా ఒక నేరస్తుడు. ఇతనిపై గతంలోనే అనేక కేసులున్నాయి. స్త్రీలపై లైంగిక దాడుల కేసులో జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. బాబాగా కొత్త అవతారమెత్తి రూ.100కోట్ల వరకు ఆస్తులు కూడబెట్టాడు. దేశవ్యాప్తంగా 24 ఆశ్రమాలు నెలకొల్పాడు. హంగు ఆర్భాటాలతో విలాసవంతమైన జీవితం గడుపుతున్నాడు.

హత్రాస్ ఘటన లాంటివి మనకు కొత్తకాదు. గతంలోనూ ఇలాంటివి అనేకం జరిగాయి. 2005లో మహారాష్ట్రలోని వాయిలో మంద రరాదేవి గుడివద్ద తొక్కిసలాటలో 340 మందికి పైగా చనిపోయారు. 2008లో రాజస్థాన్లోని చాముండదేవి ఆలయం వద్ద 250 మంది, హిమాచల్‌ప్రదేశ్‌లోని నైనాదేవి గుడివద్ద 162 మంది, ఇంకా వెనక్కి వెళితే 1954లో అలహాబాద్‌లో జరిగిన తొలి కుంభమేళాలో 800 మంది, మన రాష్ట్రంలో 2015లో గోదావరి పుష్కరాలలో జరిగిన తొక్కిసలాటలో 20మందికి పైగా చనిపోయారు. ఇవన్నీ గుండెల్ని మెలిపెట్టే విషాదాలు. ఇలాంటి దుర్ఘటనలు తరుచూ జరుగుతున్నా నివారించాల్సిన ప్రభుత్వాలు చేష్టలూడిగి చూస్తుండటం బాధాకరం. సైన్స్ అండ్ టెక్నాలజీ ఊహించనంత స్థాయికి ఎదిగినా అదేస్థాయిలో దొంగ బాబాలు కూడా ఎక్కువైపోతున్నారు. మానవ సమాజాన్ని ఎంతో వెనుకకు తీసుకెళ్తూ నష్టం చేస్తున్నారు. అయినా పాలకులు నిమ్మకు నిరెత్తినట్లు ఉంటున్నారు. ప్రజలు కూడా వాస్తవ ప్రపంచాన్ని గురించిన శాస్త్రీయ అవగాహన కలిగి ఉన్నట్లు కనిపించటం లేదు. మతాలు, దేవుళ్ల, సాంప్రదాయలు అంటూ మధ్యయుగాల్లో జీవిస్తున్నవారే ఎక్కువ. ఎవరి నమ్మకాలు వారివి అని మర్యాదగా సమర్థించుకొని పోతున్నామేగాని ప్రజల్లో శాస్త్రీయ అవగాహనను కల్పించటంలో పాలకుల వైఫల్యం మెండుగా ఉంది. రాజ్యాంగంలో ఆర్టికల్ 51ఏ ప్రకారం రాజ్యం ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని రాసుకున్నామేగాని, చిత్తశుద్ధిగా ఆచరించటం లేదు. గత కొంతకాలంగా రోజురోజుకూ మార్కెట్లోకి కొత్త బాబాలు పుట్టుకొస్తున్నారు. వీరు ప్రజల బలహీనతలను, అమాయకత్వం, అజ్ఞానాన్ని ఆసరాగా చేసుకొని వేలకోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంతటితో ఆగకుండా స్త్రీల మానప్రాణాలు హరించి వేస్తున్నారు. చివరకు ఈ ప్రక్రియ ప్రాణాంతకంగా మారిపోయినప్పుడు చూస్తూ సహించలేం. ఇంత జరుగుతున్నా మన పాలకులకు చీమ కుట్టినట్టు కూడా లేదు. పైపెచ్చు రాజకీయ నాయకుడు, రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారు సైతం దొంగబాబాల చెంతకుపోయి పొర్లు దండాలు పెడుతూ, వారికి పాదదాసులుగా మారిపోతున్నారు. ఇక సామాన్య ప్రజలకు శాస్త్రీయ విజ్ఞానంపై అవగాహన ఎలా ఏర్పడుతుంది?

ఏ జీవన సంక్షోభాల నుంచి ప్రజలు బాబాలను ఆశ్రయిస్తున్నారు? అవధులు దాటిన ఈ బాబాభక్తి వెనుక ఉన్న సామాజిక, మానసిక వెనుకబాటుతనాన్ని శోధించాలి. పేదరికం, దారిద్రం నుండి అమాయక ప్రజలు బయటపడే మార్గం ఈ వ్యవస్థలో లేకనే ప్రజలు దేవుడు, దెయ్యం, మంత్రాలు, తంత్రాలు అంటూ మూఢాచారాలను నమ్ముతూ ఈ దొంగ బాబాల మోసాల బారిన పడుతున్నారు. అందుకే మూఢాచారాలు, దొంగ బాబాలను నిషేధిస్తూ ఓ ప్రత్యేక చట్టం తేవాలి. ఈ ప్రకృతిని ఏ దేవుడు సృష్టించలేదని, ఈ ప్రకృతి అంతా స్వతహాగా భౌతిక పదార్థాలతో నిండి ఉంటుందని, పదార్థాలకు పదార్థ ధర్మాలేగాని మహిమలు ఉండవని ప్రజలు గ్రహించాలి. ప్రకృతి, సామాజిక పరిణామాలను శాస్త్రీయ దృక్పథంతో విద్యాలయాల్లో మొదటి నుంచి వివరిస్తూ, ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేస్తూ తీసుకువెళ్లాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. అంధ మూఢత్వానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరచటానికి ప్రభుత్వాలు తగిన ప్రాధాన్యతనివ్వాలి.



ఆగస్టు 9 నుంచి 14 వరకు రాజ్యాంగ పరిరక్షణ వారోత్సవాలు

- 9న క్విట్ కార్పొరేట్, కమ్యూనల్ డే
- బడ్జెట్ కేటాయింపులపై ఎంపీలు, కేంద్ర మంత్రులకు వినతులు
- ఏఐఎడబ్ల్యూయూ జనరల్ కౌన్సిల్ పిలుపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆగస్టు 9 నుంచి 14 వరకు రాజ్యాంగ పరిరక్షణ వారోత్సవాలు జరపాలని వ్యవసాయ కార్మిక సంఘం జనరల్ కౌన్సిల్ పిలుపునిచ్చింది. తమిళనాడులోని తిరుచిరాపల్లిలో రెండ్రోజుల పాటు జరిగిన అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఎడబ్ల్యూయూ) జాతీయ కౌన్సిల్ సమావేశాలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న క్విట్ కార్పొరేట్, కమ్యూనల్ డే పాటించాలని కౌన్సిల్ పిలుపునిచ్చింది. అలాగే బడ్జెట్ కేటాయింపుల కోసం ఎంపీలు, కేంద్ర మంత్రులకు వినతులు అందజేయాలని సమావేశం నిర్ణయించింది.

ఈ సమావేశాలకు ఏఐఎడబ్ల్యూయూ జాతీయ అధ్యక్షులు ఎ. విజయ రాఘవన్ అధ్యక్షత వహించారు. భూ కేంద్రీకరణను బద్దలు కొట్టాలని భూ పంపిణీయే దేశంలో సకల సమస్యలకు పరిష్కార మార్గమనే తీర్మానాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు ప్రవేశపెట్టారు. ఆంధ్రప్రదేశ్ కమిటీ నిర్మాణ రిపోర్టును దడాల సుబ్బారావు, ఉద్యమ సమీక్షను కంకణాల ఆంజనేయులు ప్రవేశపెట్టారు. తెలంగాణ ఉద్యమ సమీక్షను రాష్ట్ర కార్యదర్శి పి. వెంకట రాములు ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా ఏఐఎడబ్ల్యూయూ జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ బడ్జెట్‌లో ఉపాధికి రూ.2.5 లక్షల కోట్లు, వివిధ రకాల పెన్షన్లు రూ.5 వేలు, పక్కా గృహాల నిర్మాణానికి ఒక్కో లబ్దిదారునికి కేంద్రం వాటా రూ.5 లక్షల చొప్పున కేటాయిం చాలని, విద్యా వైద్య రంగాలకు బడ్జెట్‌లో ఆరు శాతం చొప్పున నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించబోయే బడ్జెట్‌లో సామాన్యులకు సంక్షేమ పథకాలు, భూమి, ఉపాధి, విద్య, వైద్యం ఆహారం లాంటి అంశాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, లేకపోతే దేశ వ్యాప్త ఉద్యమాలకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

వీరోచిత పోరాటాలు, అశేష త్యాగాలతో దేశ ప్రజలు పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని బీజేపీ మద్దతుతో కార్పొరేట్, కమ్యూనల్ శక్తులు కబలిస్తున్నాయని విమర్శించారు.

దేశానికి స్వేచ్ఛ సమానత్వం సాధించాలనే లక్ష్యంతో జరిగిన స్వాతంత్ర పోరాటంలో ఆగస్టు 9న జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం ప్రసిద్ధిగాంచిందని అన్నారు.

నేడు ఆ త్యాగాలతో, ఆ ఉద్యమాలతో ఎటువంటి సంబంధం లేని వారు పాలకులుగా గద్దెనెక్కడం విచారకరమని అన్నారు. నాడు దేశ సంపద సామ్రాజ్యవాదులకు ధారాదత్తమైతే, నేడు ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాల తొలగింపు పేరుతో అంతకంటే భయంకరమైన, అమానుషమైన చట్టాలను బీజేపీ ప్రభుత్వం తెచ్చిందని అన్నారు.

చట్టాల సవరింపు పేరుతో బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నూతన క్రిమినల్ చట్టాలు దేశ ప్రజల స్వేచ్ఛ, సమానత్వాన్ని నిర్మూలించి నియంతృత్వాన్ని, ఆధిపత్యాన్ని పెంచేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పాలనలో ప్రజాస్వామ్యానికి అర్థమే మారిపోయిందని , నియంతృత్వమే రాజ్యమేలుతున్నదని అన్నారు. స్వాతంత్రోద్యమం సమానత్వాన్ని సాధించాలని, అంటరానితనాన్ని నిర్మూలించాలని, అణగారిన వర్గాలకు అండగా ఉంటామని హామీ ఇస్తే, నేడు బీజేపీ పాలకులు వాటికి తిలోదకాలిస్తున్నారని అన్నారు.

ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్లో రూ.2.5 లక్షల కోట్ల నిధులు కేటాయించాల్సి ఉందని, కానీ కేవలం రూ. 60 వేల కోట్లకు కుదించి పేదలకు అన్యాయం చేసే చర్యలకు పాలకులు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆర్టికల్ 39 ప్రకారం భూ పంపిణీ జరగాలని, సంపద వికేంద్రీకరణ జరగాలని చెబుతుంటే దానికి భిన్నంగా పాలకులు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఇటువంటి స్థితిలో క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మరో స్వాతంత్ర్య పోరాటానికి సంసిద్ధులు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

పదికి చేరిన ఫిరాయింపులు

(మొదటిపేజీ తరువాయి)

మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, కాంగ్రెస్ నేతలు నీలం మధు, శశికళ యాదవ్‌తో కలిసి సీఎంతో భేటీ అయిన మహిపాల్ అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. దీంతో ప్రధాన ప్రతిపక్షం నుంచి అధికార పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల సంఖ్య పదికి చేరింది. మహిపాల్‌తోపాటు జహీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నేత గాలి అనిల్ కుమార్ కూడా కాంగ్రెస్‌లో చేరారు. వీరితోపాటు పలువురు కార్పొరేటర్లు, వారి అనుచరులు సైతం హస్తం గూటికి చేరిపోయారు. మహిపాల్ రెడ్డి 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో పఠాన్‌చెరు నుంచి గెలిచి హ్యాట్రిక్ కొట్టారు. గత డిసెంబరులో జరిగిన ఎలక్షన్‌లో ఆయన కాంగ్రెస్ అభ్యర్థి కాటా శ్రీనివాస్‌పై ఏడు వేల పైచిలుకు మెజార్టీతో గెలుపొందారు. ఇటీవల మహిపాల్ నివాసంలో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. దీంతో ఆయన బీజేపీలో చేరబోతున్నారనే ప్రచారం జరిగింది. కానీ అందరి అంచనాలను తారుమారు చేస్తూ ఆయన కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

మరోవైపు గ్రేటర్ హైదరాబాద్‌లో మిగిలిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు అధికార పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. పార్టీని వీడుతున్న ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శతవిధాలా ప్రయత్నించారు. కానీ అవేవీ ఫలించ లేదు. ఆ పార్టీ అధినేత కేసీఆర్ సైతం కొద్ది రోజులపాటు ఎర్రవెల్లిలోని ఫామ్‌హౌస్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీలు నిర్వహించినప్పటికీ ఫిరాయింపులను నిరోధించలేకపోయారు. మొత్తం 39 ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌కు ఉండగా, వీరిలో ఇప్పటికే 10 మంది అధికార పార్టీ పంచన చేరారు. మిగతా వారిలో ఎవరెప్పుడు పార్టీ మారతారో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో అసెంబ్లీ సమావేశాల్లోపే బీఆర్ఎస్ శాసనసభాపక్షం కాంగ్రెస్‌లో విలీనమైనా ఆశ్చర్యపోనక్కర్లేదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఇప్పటి వరకూ బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు

1) దానం నాగేందర్	2) కడియం శ్రీహరి
3) తెల్లం వెంకటరావు	4) పోచారం శ్రీనివాసరెడ్డి
5) డాక్టర్ సంజయ్ కుమార్	6) కాలె యాదయ్య
7) బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి	8) ప్రకాశ్ గౌడ్
9) అరికెపూడి గాంధీ	10) గూడెం మహిపాల్ రెడ్డి

సీఎంకు కేజీకేఎస్ ధన్యవాదాలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కల్లు గీత వృత్తిలో ప్రమాదాల నివారణకు గీత కార్మికులకు సేఫ్టీ మోకులు పంపిణీ చేసిన సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) ధన్యవాదాలు తెలిపింది. గీత వృత్తిలో ఏడాదికి 500 మందికిపైగా చెట్టుపై నుంచి పడి చనిపోతున్నారని ఆ సంఘం పేర్కొంది. కొందరు వికలాంగులవుతున్నారని తెలిపింది.

ఈ విషయమై పలు సార్లు కేజీకేఎస్ ప్రభుత్వాలకు విన్నవించిందని గుర్తు చేసింది. కల్లుగీత కార్మిక సంఘం చేసిన పలు సూచనలతో రూపుదిద్దుకొన్న సేఫ్టీ మోకులను సీఎం పరిశీలించి వాటిని పంపిణీ చేయటం అభినందనీయమని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంపీ రమణ, బెల్లకొండ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

బోనాల్లో ప్రొటోకాల్ రగడ

నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గంలో ప్రొటోకాల్ వివాదం రాజుకుంది. బోనాల పండుగ చెక్కుల పంపిణీ సందర్భంగా అధికారులు ప్రొటోకాల్‌ను పూర్తిగా ఉల్లంఘించారంటూ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కింద కూర్చొని నిరసన తెలిపారు. ప్రొటోకాల్ పాటించకుండా ప్రజలచే ఎన్నికైన ఎమ్మెల్యేలను అగౌరపరుస్తున్నారని, ప్రజాప్రతినిధులను గౌరవించే సంప్రదాయం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని అన్నారు. వివరాల్లోకెళ్తే.. ఆషాఢ మాసం బోనాల దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆర్కేపురం డివిజన్‌లోని ఖిల్లా మైసమ్మ దేవాలయం ఆవరణలో సోమవారం దేవాలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పాటు ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్‌రావు హాజరయ్యారు. అయితే, కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డిని స్టేజ్‌పైకి పిలవడంతో వివాదం తలెత్తింది. అలాగే ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మద్దతుదారులను ఆలయంలోకి అనుమతించలేదు. దాంతో ఎమ్మెల్యే ఎగ్జిక్యూటివ్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం తలెత్తింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తులను వేదికపైకి అనుమతించడం ప్రొటోకాల్ ఉల్లంఘ నేనంటూ బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే నేలపై బైటాయించి నిరసన తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇక్కడ ఎమ్మెల్యేతో పాటు ఓడిపోయిన అభ్యర్థి కూడా స్టేజ్ మీద ఉన్నారంటే, కొడంగల్‌లో కూడా ఓడిపోయిన అభ్యర్థిని తీసుకొచ్చి ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనే విధంగా ఒక చట్టాన్ని తీసుకురావాలని అన్నారు. తనపై ఓడిపోయిన లక్ష్మారెడ్డిని ప్రభుత్వ కార్యక్రమాల్లో స్టేజీపై కూర్చోబెట్టడం సరైంది కాదన్నారు. ఓడిపోయిన వారిపై ప్రేమ ఉంటే వారి పార్టీ కార్యక్రమాల్లో నెత్తిపై కూర్చోబెట్టుకొని ఊరేగొచ్చని తెలిపారు. ప్రభుత్వం తమదేనని ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తే ప్రజలు తిరగబడతారని హెచ్చరించారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమప్పుడు ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులతో తులం బంగారం పంపిస్తే హర్షిస్తామని అన్నారు. ఏ ప్రభుత్వ కార్యక్రమానికి వెళ్లినా ప్రొటోకాల్ సమస్య తలెత్తుతోందని, ఈ విషయంలో స్పీకర్ కలగ జేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమయ్యాయని విమర్శిం చారు. అనంతరం ప్రభుత్వ సలహాదారు వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేను స్టేజీపై కూర్చోవాలని కోరినా కూర్చోలేదని అన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, కొండల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సాజిద్, బేర బాలకిషన్, మహేందర్ యాదవ్, బండి మధు సుధన్ రావు తదిత రులు పాల్గొన్నారు.ఓ వైపు నిరసన కొనసాగు తుండగా నే.. దేవాదాయశాఖ అధికారులు 34 చెక్కులను మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ పారిజాత, చల్లా నరసింహారెడ్డి, టీపీసీసీ ప్రతి నిధి దేప భాస్కర్‌రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయ కులు చిలుక ఉపేందర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధు లతో కలిసి పలు ఆలయ కమిటీలకు పంపిణీ చేసి వెళ్లిపోయారు.

సైబరాబాద్ పరిధిలో డ్రగ్స్ పట్టివేత



నవతెలంగాణ-మియాపూర్

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రాజేంద్రనగర్ పోలీసులు భారీగా డ్రగ్స్ పట్టుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ.35 లక్షల విలువ చేసే 119 గ్రాముల మత్తుపదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను సీపీ కార్యాలయంలో రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ సోమవారం మీడియాకు వెల్లడించారు. నైజీరియన్ ముఠా ఫేక్ పాస్‌పోర్టు ద్వారా భారత దేశంలోకి ప్రవేశించి.. వివిధ నగరాల్లో డ్రగ్స్ విక్రయిస్తున్నది. ఈ ముఠాకు చెందిన ఒనౌహా బ్లెస్సింగ్ (వెస్ట్ ఆఫ్రికా) అనే మహిళ ఈ డ్రగ్స్ విక్రయిస్తోంది. ఈ ముఠా హైదరాబాద్‌లో సైతం డ్రగ్స్ విక్రయాలు చేపట్టింది. ఈ క్రమంలో రాజేంద్రనగర్ పరిధిలోని హైదర్శకోట్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నైజీరియాకు చెందిన ముఠా మత్తు పదార్థాలు అమ్ముతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే రాజేంద్రనగర్ పోలీసులు దాడి నిర్వహించగా.. ఐదుగురు నిందితులు ఒనౌహా బ్లెస్సింగ్, అజీజ్ నోహీం, అల్లం సత్య వెంకట గౌతమ్, సానబోయిన వరుణ్‌కుమార్, మహ్మద్ మహబూబ్ షరీఫ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరు 13 మందికి డ్రగ్స్ విక్రయించినట్టు గుర్తించారు. వారిలో ఆరుగురికి కొకైన్ టెస్టులో పాజిటివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చిన వారిలో ప్రముఖ హీరోయిన్ తమ్ముడు అమాన్ ప్రీత్‌సింగ్‌తోపాటు పలువురు ఉన్నారు. వీరిపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నాడు. ఇప్పటివరకు ఈ ముఠా ఇరవై సార్లు నగరానికి మత్తు పదార్థాలను సరఫరా చేసినట్టు పోలీసులు గుర్తించారు. వీరి నుంచి 119 గ్రాముల డ్రగ్స్, 2 పాస్‌పోర్టులు, 10 సెల్ ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు డీసీపీ తెలిపారు.

బోడుప్పల్ మేయర్ పీఠం 'హస్త'గతం



- మేయర్‌గా అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్‌గా స్రవంతిగౌడ్ ప్రమాణ స్వీకారం
- ఫలించిన తోటకూర వజ్రేష్ యాదవ్ వ్యూహం

నవతెలంగాణ-బోడుప్పల్

హస్తం ఖాతాలో మరో కార్పొరేషన్ చేరింది. బోడుప్పల్ కార్పొరేషన్ మేయర్‌గా కాంగ్రెస్‌కు చెందిన తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్‌గా కొత్త స్రవంతి గౌడ్ ఎన్నికయ్యారు. సోమవారం బోడుప్పల్ కార్పొరేషన్ ప్రత్యేక కౌన్సిల్ సమావేశంలో కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన మేయర్ ఎన్నిక నిర్వహించారు. ఈ ఎన్నిక గురించి ఆర్డీవో ఎజెండా అంశాన్ని ప్రకటించగా.. మేయర్ అభ్యర్థిగా తోటకూర అజయ్ యాదవ్ పేరును కాంగ్రెస్ 17వ డివిజన్ కార్పొరేటర్ పోగుల నరసింహారెడ్డి ప్రతిపాదించారు. అనంతరం 23వ డివిజన్ కార్పొరేటర్ రాసాల వెంకటేశ్ యాదవ్ బలపరిచాక.. సభ్యులందరూ ఏకగ్రీవంగా అజయ్ యాదవ్‌ను ఎన్నుకున్నారు. దీంతో మేయర్‌గా తోటకూర అజయ్ ఎన్నికైనట్టు ప్రకటించారు. అనంతరం డిప్యూటీ మేయర్ పదవికి ఎన్నిక నిర్వహించగా.. 4వ డివిజన్ కార్పొరేటర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్‌ను 3వ డివిజన్ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్ ప్రతిపాదించగా, 5వ డివిజన్ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి బలపరిచారు. దీంతో సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మేయర్, డిప్యూటీ మేయర్ ప్రమాణ స్వీకారం చేశారు.

ప్రజా పాలనను తీసుకొస్తాం..మేయర్ తోటకూర అజయ్‌యాదవ్

బోడుప్పల్ కార్పొరేషన్‌లో నాలుగేండ్ల కాలంగా అరాచక పాలన సాగిందని, ఇక నుంచి ప్రజాపాలన అందిస్తామని నూతన మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. మేయర్‌గా ప్రమాణస్వీకారం అనంతరం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బోడుప్పల్‌లో కుంటుపడిన అభివృద్ధి ఇక నుంచి పరుగులు పెడుతుందన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ సహకారంతో ముందుకెళ్తామన్నారు. బోడుప్పల్ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. తనపై నమ్మకంతో మేయర్‌గా అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతిగౌడ్, కార్పొరేషన్ అధ్యక్షుడు పోగుల నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మునిగిపోయిన నావ.. : మైనంపల్లి హన్మంతరావు

బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లాలో కనుమరుగైపోయిందని.. ఆ పార్టీ మునిగిపోయిన నావ అని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బోడుప్పల్ మేయర్ ఎన్నిక సందర్భంగా పర్యవేక్షణ బాధ్యతల్లో హాజరైన ఆయన మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్‌తో కలిసి నూతన మేయర్, డిప్యూటీ మేయర్‌ను సన్మానిం చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పాలనలో మాజీ మంత్రి మల్లా రెడ్డి, ఆయన అనుచరులు చేసిన అరాచకాలను కచ్చితంగా వెలికి తీస్తామన్నారు.

గిరిజన గురుకుల అడ్మిషన్లలో అవకతవకలు



- నిబంధనలు పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి : సంక్షేమ భవన్ ముందు ధర్నాలో గిరిజన సంఘాల నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన గురుకుల అడ్మిషన్లలో అవకతవకలు జరిగాయనీ, రాజకీయ పలుకుబడి, మధ్యదళారీల పైరవీలకు తలొగ్గి నిబంధనలకు నీళ్లొదిలారని గిరిజన సంఘాల నేతలు విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని దామోదర సంజీవయ్య సంక్షేమ భవన్‌ముందు ఆయా గిరిజన సంఘాల నేతృత్వంలో ధర్నా నిర్వహించారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరాం నాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్య నాయక్, బంజారా జన సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివానాయక్, తెలంగాణ గిరిజన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు వినోద్ నాయక్, లంబాడి పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మల్లేష్ నాయక్ ప్రసంగించారు.శ్రీరాం నాయక్ మాట్లాడుతూ గిరిజన గురుకుల సొసైటీల్లో సీట్ల కేటాయించే విషయంలో పారదర్శకత లోపించిందని చెప్పారు. దరఖాస్తు పెట్టుకున్న వారికి ఇవ్వకుండా నిబంధనలకు విరుద్ధంగా గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మౌఖిక ఆదేశాలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, మధ్యదళారీల పైరవీలతో వచ్చిన వారికే సీట్లు కేటాయించటమేంటని ప్రశ్నించారు. ఈ సందర్భంగా డబ్బు చేతులు మారిందంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారని గుర్తు చేశారు. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ చెప్పారనే కారణంతో ఒక్క నల్లగొండ జిల్లాలో 150 సీట్లకు పైగా కేటాయిస్తూ లిస్టు ఇవ్వడమేంటని ప్రశ్నించారు. ఈ లిస్టుల తయారీలో పైరవి కారుల చేతి వాటం ఎంతుందో తేల్చాలని డిమాండ్ చేశారు. ఏ నిబంధన ప్రకారం ఈ పద్ధతిని పాటించారో ప్రకటించాలన్నారు. నిబంధనలను తుంగలో తొక్కిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటుకేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అంజయ్య నాయక్ మాట్లాడుతూ గిరిజన గురుకులాల్లో సీట్ల కోసం వేలాదిమంది పరీక్షలు రాశారనీ, మొదటి కౌన్సిలింగ్‌లో సీట్లు రానివారు తిరిగి దరఖాస్తు చేసుకున్నా ప్రయోజనం లేకుండా పోయిందని చెప్పారు. రెండు నెల్లుగా తమ పిల్లల సీటు కోసం తల్లిదండ్రులు ఆశతో ఎదురు చూస్తున్నారని తెలిపారు. నిబంధనలు పాటించకుండా పైరవీలకు పీట వేయటమేంటని ప్రశ్నించారు. సీట్ల కేటాయింపులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలన్నారు. తిరిగి పారదర్శకంగా సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో గిరిజన సంఘం హైదరాబాద్ నగర కార్యదర్శి ఎం బాలు, అమర్ సింగ్, గిరిజన సమాఖ్య నాయకులు శివా ప్రచండ, నారాయణ, దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సచివాలయ ముట్టడి ఉద్రిక్తం
- మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ సహా పలువురి అరెస్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2021-22, 2022-23, 2023-24 విద్యాసంవత్సరాలకు సంబంధించి సుమారు రూ.ఎనిమిది వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెంటనే విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు చెల్లించాలని కోరుతూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం తలపెట్టిన సచివాలయ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. బీఆర్‌కే భవన్ వద్దకు ప్రదర్శనగా వచ్చిన విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సమయంలో తోపులాట జరిగింది. అనంతరం మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మణ్ సహా పలువురు విద్యార్థులను పోలీసులు అరెస్టు చేశారు. అంతకుముందు వారు మీడియాతో మాట్లాడుతూ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాలేజీ యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఆఫీసు బేరర్లు ఇటిక్యాల రామకృష్ణ, గ్యార నరేష్, రఘురామ్, నాగజ్యోతి, ప్రవీణ్, రాజు, నాయకులు చైతన్య యాదవ్, శివ, మచ్చ రమేష్, వెంకటేశ్, అన్వర్, వంశీ లక్ష్మణ్, సంతోష్, మురళి, అంజి, ప్రేమ్‌కుమార్, హరీశ్, నరేష్, శరత్, పార్థసారథి, జోసెఫ్, ప్రీతమ్ తదితరులు పాల్గొన్నారు.

జీవో 10 రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మెల్యే పీఏకి వినతిపత్రం అందజేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని కాడ(కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ) కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా చేపట్టారు. కాడ అధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇండ్లు, క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. ఉట్నూర్ లోని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హయాంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. బోథ్ మండలంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఆసిఫాబాద్‌లో భారీ ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే కోవలక్ష్మి ఇంటి వద్ద బైటాయించి నిరసన తెలిపారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి ఇండ్లను ముట్టడించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు క్యాంపు కార్యాలయాన్ని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు ముట్టడించారు. వర్షంలో గొడుగులు పట్టుకుని నిరసన తెలిపారు. ఎమ్మెల్యే వెంకట్రావు వెంటనే అక్కడకు చేరుకొని అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు విన్నారు. ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి పరిష్కా రానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇల్లందులో ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య వారి సమస్యలు విని అసెంబ్లీ సమావేశంలో చర్చిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగూడెంలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యాలయం ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేశారు. ఖమ్మం జిల్లాలో డిప్యూటీ సీఎం కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.భువనగిరి జిల్లా కేంద్రం, యాదగిరిగుట్ట పట్టణాల్లో ఎమ్మెల్యేల క్యాంపు ఆఫీసుల ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ధర్నా నిర్వహించారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ప్రత్యేక క్యాంపు కార్యాలయం వద్ద ధర్నా చేశారు. మిర్యాలగూడలో ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు, దేవరకొండలో ఎమ్మెల్యే బాలునాయక్ క్యాంపు కార్యాలయంలో వినతిపత్రం అందజే శారు.నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఇంటి వరకు అంగన్‌వాడీలు ర్యాలీగా వెళ్లి బైటాయించారు. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా.. అసెంబ్లీ సమావేశాల్లో అంగన్‌వాడీల సమస్యపై ప్రస్తావిస్తానని, అవసరమైతే



ధర్నా చేపడతామని హామీ ఇచ్చారు. బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేపట్టి వినతిపత్రం అందజేయగా.. ఆయన సైతం అసెంబ్లీలో ప్రస్తావిస్తానని తెలిపారు. బాన్సువాడలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇంటి ఎదుట నిరసన చేపట్టి వినతిపత్రం అందజేశారు. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పీఏకు వినతిపత్రం అందజేశారు. నిజామాబాద్ రూరల్, ఆర్మూర్, కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్ ఎమ్మెల్యేల ఇంటి ఎదుట ధర్నాలు చేపట్టి వినతిపత్రాలు అందజేశారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు అంగన్‌వాడీలు భారీ ర్యాలీగా వెళ్లి ధర్నా చేశారు. అనంతరం ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందజేశారు.మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌కు ర్యాలీగా వెళ్లారు. ఎమ్మెల్యే యన్నెం శ్రీనివాస్ రెడ్డి అంగన్వాడీలతో మాట్లాడారు. న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రి సీతక్కతో చర్చిస్తానని హామీ ఇచ్చారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడించారు. నారాయపేట జిల్లా మక్తల్ నియోజకవర్గ కేంద్రంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇంటి వరకు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం ఇచ్చారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేల క్యాంపు కార్యాలయాల ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు నిరసనలు తెలిపారు.

మంత్రి సీతక్కకు వినతి..

మహబూబాబాద్ జిల్లాలో ఎమ్మెల్యే మురళినాయక్ క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ములుగు జిల్లాలో జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఎమ్మెల్యేల ఇంటి ముట్టడి చేపట్టారు. మంత్రి సీతక్క క్యాంపు కార్యాలయం ముందు ధర్నా చేయకుండా పోలీసులు ముందస్తుగా అంగన్వాడీలను ఎక్కడికక్కడా అరెస్టు చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్‌ను ఆదివారం రాత్రే అరెస్టు చేయాలని ప్రయత్నించగా.. రాజేందర్ మంత్రికి ఫోన్ చేసి మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ ప్రతినిధి బృందం మంత్రి సీతక్కను కలిసి సమస్యలు వివరించారు. దాంతో డీడబ్ల్యూఓకు మంత్రి ఫోన్ చేసి.. కొత్త జీవో వచ్చేవరకు ఎవరినీ రిటైర్మెంట్ చేయొద్దని, ప్రిన్సిపల్ సెక్రెటరీతో మాట్లాడతానని చెప్పారు. హన్మకొండలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను అంగన్‌వాడీలు కలిసి వినతిపత్రం అందించారు.

ఇంటర్నేషనల్ స్కూల్లో కీచక డ్యాన్స్ మాస్టర్ చిన్నారిపై లైంగికదాడి

- పోక్సో కేసు నమోదు



నవతెలంగాణ-బోడుప్పల్

ఇంటర్నేషనల్ స్కూల్లో కీచక మాస్టర్ బాగోతం బట్టబయలైంది.. ఐదేండ్ల చిన్నారిపై డ్యాన్స్ మాస్టర్ దారుణానికి ఒడిగట్టాడు. డ్యాన్స్ నేర్పించే క్రమంలో లైంగికదాడి చేశాడు. ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి పీఎస్ పరిధిలో జరిగింది. మేడిపల్లి సీఐ అర్.గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని కిరణ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో ఓ బాలిక చదువుతున్నది. అదే పాఠశాలలో పనిచేసే డ్యాన్స్ మాస్టర్ రవికుమార్ నాలుగు రోజుల కిందట డ్యాన్స్ నేర్పించే క్రమంలో బాలికపై లైంగికదాడి చేశాడు. జరిగిన విషయాన్ని చిన్నారి ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పింది. దాంతో ఆగ్రహించిన తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి డ్యాన్స్ మాస్టర్‌కు దేహశుద్ధి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు డ్యాన్స్ మాస్టర్‌ను, స్కూల్ ప్రిన్సిపాల్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు డ్యాన్స్ మాస్టర్‌పై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నూతన రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలి

- పౌరసరఫరాలశాఖ కమిషనర్‌కు వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పౌరసరఫరాలశాఖలోని హమాలీలకు ఈ ఏడాది జనవరి నుంచి నూతన రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని తెలంగాణ ఆల్ హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వంగూరు రాములు, సివిల్ సప్లైస్ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సుధాకర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు సివిల్ సప్లైస్ కమిషనర్ డీ.ఎస్.చౌహాన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వెంటనే సంఘ నాయకులతో చర్చలు జరపాలని వారు కోరారు. తెలంగాణ పౌరసరఫరాల సంస్థతో పాటు జీసీసీ హమాలీ దిగుమతి - ఎగుమతి నూతన రేట్ల ఒప్పందం కోసం హమాలీ కార్మిక సంఘాలతో చర్చలు జరిపి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. 3,260 మంది హమాలీ కార్మికులకు 2022 సంవత్సరంలో జరిగిన రేట్ల ఒప్పందం 2023 డిసెంబర్‌తో ముగిసిందని గుర్తుచేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఏడు నెలలుగా నూతన రేట్ల ఒప్పందం అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు ఒప్పందాల్లో ప్రభుత్వ అధికారులు అంగీకరించిన ఈఎస్ఐ సౌకర్యం, జీసీసీ హమాలీలకు పీఎఫ్ సౌకర్యం, మహిళా స్వీపర్లకు కనీస వేతనాలు నేటికీ అమలు కావడం లేదని తెలిపారు. కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్ పెట్టి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. "సివిల్ సప్లై, జీసీసీ హమాలీ కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి. హమాలీలకు బయోమెట్రిక్ విధానంతో పెరిగిన పని భారానికి అనుగుణంగా ఎగుమతి-దిగుమతి రేట్లను రూ.26 నుంచి రూ.35కు పెంచాలి. పౌరసరఫరాల సంస్థలో అమలవుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను జీసీసీ హమాలీలకు వర్తింపచేయాలి. తక్షణమే పీఎఫ్ అమలు చేయాలి. వివిధ జిల్లాల్లో ప్రయివేటు గోదాముల స్థానంలో ప్రభుత్వ గోదాములు నిర్మించి పని భద్రత కల్పించాలి. ప్రమాదాలు జరిగి మరణిస్తే రూ.10 లక్షలు చెల్లించాలి. గత వేతన ఒప్పందంలో అంగీకరించిన ఈఎస్ఐ సౌకర్యాన్ని అమలు చేయాలి. దసరా సందర్భంగా స్వీట్ బాక్సుకు ఇచ్చే మొత్తాన్ని రూ.800 నుంచి రూ.1,200కు, బోనస్‌ను రూ.10 వేలకు పెంచాలి. 60 ఏండ్లు పైబడిన హమాలీ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలి. పెన్షన్ సౌకర్యం కల్పించాలి..." అని వారు డిమాండ్ చేశారు.

బీసీ రిజర్వేషన్ల పెంపుపై కార్యాచరణ రూపొందించండి

మిగతా రాష్ట్రాల్లో అమలుపై అధ్యయనం చేయండి

- అవసరమైతే మాజీ మంత్రి జానారెడ్డి

సలహాలు తీసుకోండి : పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపునకు సంబంధించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని పంచాయతీరాజ్, బీసీసంక్షేమ శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశించారు. కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ఆగిపోకుండా త్వరగా ఎన్నికలు నిర్వహించడంపై కసరత్తు చేయాలని సూచించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్ల పెంపుపై సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలు, రాబోయే ఎన్నికల్లో వాటి పెంపునకు సంబంధించిన అంశాలను వెల్లడించాలని ఆయన అధికారులకు సూచించారు. గత పంచాయతీ ఎన్నికల్లో అనుసరించిన విధానం, రానున్న పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధమవుతున్న తీరును అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇప్పటికే కుల గణనకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో దాని ఆధారంగా పంచాయతీ ఎన్నికలకు వెళితే ఎలా ఉంటుందనీ, అందుకు ఎంత సమయం తీసుకుంటారని అధికారుల నుంచి సీఎం ఆరా తీశారు. కర్నాటకలో 2015లో, బీహార్‌లో 2023లో కుల గణన చేశారనీ, ఆంధ్రప్రదేశ్‌లో కుల గణన చేసినా వివరాలు ఇంకా బయటపెట్టలేదని అధికారులు వివరించారు. 2011లో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన కుల గణన ఫార్మాట్ 53 కాలమ్స్‌తో ఉందనీ, దానికి మరో మూడు కాలమ్స్ జోడించి కుల గణన చేపడితే కనీసం అయిదున్నర నెలల సమయం పడుతుందని అధికారులు వివరించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రాష్ట్ర మాజీ మంత్రి కె.జానారెడ్డి, బీసీ కమిషన్ ఛైర్మెన్ వకుళాభరణం కృష్ణమోహన్ రిజర్వేషన్ల పెంపు సాధ్యాసాధ్యాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రం నుంచి తెలంగాణలో జరిగిన పంచాయతీ ఎన్నికల వరకు అనుసరించిన విధానాలు, వివిధ రాష్ట్రాల స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసులు, వాటి తీర్పులు, పర్యవసానాలను మాజీ మంత్రి జానారెడ్డి వివరించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్ల అమలుకు ఇప్పటి వరకు అనుసరించిన విధానాలపై కాల క్రమ పట్టిక రూపొందించాలని ఆదేశించారు. ఏవైనా సందేహాలుంటే మాజీ మంత్రి జానారెడ్డితో పాటు పంచాయతీరాజ్ శాఖ నిపుణులు, మాజీ ఉన్నతాధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. చట్టపరమైన విషయాలను అడ్వకేట్ జనరల్‌తో చర్చించాలన్నారు. మిగతా రాష్ట్రాలు రిజర్వేషన్ల విషయంలో అనుసరిస్తున్న విషయాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆయా అంశాలపై త్వరగా నివేదిక రూపొందిస్తే శాసనసభ సమావేశాలకు ముందే మరోసారి సమావేశమై ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి డీఎస్.లోకేష్ కుమార్, న్యాయ శాఖ కార్యదర్శి ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌ఆప్షన్ల నమోదు గడువు రేపటి వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరానికిగాను 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎప్‌సెట్ కౌన్సెలింగ్ ప్రక్రియలో వెబ్‌ఆప్షన్ల నమోదు గడువును బుధవారం వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ఎప్‌సెట్ ప్రవేశాల కమిటీ కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 93,167 మంది అభ్యర్థులు 58,59,254 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. ఓ అభ్యర్థి అత్యధికంగా 1,025 ఆప్షన్ల నమోదు చేశారని వివరించారు. ఈనెల 19న తొలివిడత సీట్ల కేటాయింపు ఉంటుందని వివరించారు. అభ్యర్థులు ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

బడుల్లో సర్వీసు పర్సన్లను వెంటనే నియమించాలి

- ఉపాధ్యాయుల కొరత ఉంటే సర్దుబాటు చేయాలి : సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల నిర్వహణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. ప్రభుత్వ, మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పారిశుధ్యం, తాళాలు వేయడం, తీయడం, గంట కొట్టడం వంటి పనుల కోసం సర్వీసు పర్సన్లను వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వారినివ్వాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం ఆయన లేఖ రాశారు. గత ప్రభుత్వం మూడు విద్యాసంవత్సరాలుగా పనులను గ్రామపంచాయతీ/మున్సిపాల్టీ/మున్సిపల్ కార్పొరేషన్లు నిర్వహి స్తాయంటూ చేసిన సాగదీత వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో రెండు లక్షలకుపైగా విద్యార్థులు తగ్గిపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుల కొరత ఉండే పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. సర్దుబాటుకు సరిపోను ఉపాధ్యాయుల్లేకుంటే తాత్కాలిక పద్ధతిలో నియమించాలని సూచించారు. గతేడాదిలో ఈ సర్దుబాటు సవ్యంగా జరగలేదని తెలిపారు. విద్యార్థులు, పాఠశాలల అవసరాలకు అనుగుణంగా ఉపాధ్యాయుల సర్దుబాటు జరగాలని పేర్కొన్నారు. కానీ కొందరు ఉపాధ్యాయులకు డిప్యూటేషన్ ఇచ్చారని తెలిపారు. ఈ పద్ధతి ఈ ఏడాది పునరావృతం కాదని విజ్ఞప్తి చేశారు. పాఠశాలలు, కాలేజీల విద్యుత్ బిల్లుల చెల్లింపుపై తగు నిర్ణయం చేయాలని పేర్కొన్నారు. పాఠశాల/కళాశాల నిర్వహణ గ్రాంటు పెరుగుతున్న ధరలకనుగుణంగా పెంచాలని డిమాండ్ చేశారు. గ్రాంటులో సగాన్ని పాఠశాలలు/ కాలేజీలకు వెంటనే విడుదల చేయాలని తెలిపారు. మిగిలిన సగాన్ని నవంబర్ మొదటి వారంలో చెల్లించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థుల నుంచి వసూలు చేసే ఫీజును రద్దు చేసినందున ప్రయోగశాలలు, గ్రంథాలయ నిర్వహణకు అదనపు గ్రాంటును ప్రభుత్వమే ఇవ్వాలని సూచించారు. ఈ చర్యలు మంగళవారం కలెక్టర్ల సమావేశంలో చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

రేషన్ కార్డే ప్రామాణికం

(మొదటిపేజీ తరువాయి)

బకాయి ఉన్న అసలు, వర్తింపయ్యే వడ్డీ మొత్తం పథకానికి అర్హత కలిగి ఉంటుంది.

- రైతు కుటుంబాలను నిర్ధారించడానికి పౌరసరఫరాల శాఖ వారు నిర్వహించే ఆహార భద్రత కార్డు(రేషన్ కార్డు) డేటాబేస్ ప్రామాణికంగా పరిగణిస్తారు.
- అర్హత గల రుణమాఫీ మొత్తాన్ని డీబీటీ పద్ధతిలో నేరుగా లబ్దిదారుల రైతు రుణఖాతాలకు జమ చేస్తారు. పీఏసీఎస్ విషయంలో రుణమాఫీ మొత్తాన్ని డీసీసీబీ లేదా బ్యాంకు బ్రాంచికివిడుదల చేస్తారు. ఆ బ్యాంకు వారు రుణమాఫీ మొత్తాన్ని పీఏసీఎస్‌లో ఉన్న రైతు ఖాతాలో జమ చేస్తారు.
- ప్రతి రైతు కుటుంబానికి 09.12.2023 తేదీ నాటికి ఉన్న రుణ మొత్తం ఆధారంగా ఆరోహణ క్రమంలో రుణమాఫీ మొత్తాన్ని జమ చేయాలి.
- ప్రతి రైతు కుటుంబానికి 09.12.2023 నాటికి కలిగి ఉన్న మొత్తం రుణం కానీ లేక రూ. 2 లక్షల వరకు ఏది తక్కువ అయితే ఆ మొత్తాన్ని ఆ రైతు కుటుంబం పొందే అర్హత ఉంటుంది.
- ఏ కుటుంబానికి అయితే రూ. 2 లక్షలకు మించిన రుణం ఉంటుందో, ఆ రైతులు రూ. 2 లక్షలకు పైబడి ఉన్న రుణాన్ని మొదట బ్యాంకులకు చెల్లించాలి. ఆ తర్వాత అర్హత గల రూ. 2 లక్షల మొత్తాన్ని రైతు కుటుంబీకుల రుణ ఖాతాలకు బదిలీ చేస్తారు.
- రూ. 2 లక్షల కంటే ఎక్కువ రుణం ఉన్న పరిస్థితుల్లో కుటుంబంలో రుణం తీసుకున్న మహిళల రుణాన్ని మొదట మాఫీ చేస్తారు. మిగులు మొత్తాన్ని దామాషా పద్ధతిలో కుటుంబంలో పురుషుల పేరు మీద తీసుకున్న రుణాలను మాఫీ చేస్తారు.

వీరికి వర్తించదు

- .స్వయం సహాయక బృందాలు, తాకట్టు, ఉమ్మడిగా తీసుకున్న రుణాలు, కౌలు రైతుల కార్డులపై అప్పుల బకాయిలు ఈ పథకం పరిధిలోకి రావు.

2).పునర్‌వ్యవస్థీకరించిన లేదా రీ-షెడ్యూల్ చేసిన రుణాలకు మాఫీ వర్తించదు.

- .కంపెనీలు, ఫర్మ్ వంటి సంస్థలకు ఇచ్చిన రుణాలను పరిగణనలోకి తీసుకోరు.
- .కేంద్రం అమలు చేస్తున్న పీఎం కిసాన్ మినహాయింపులను రాష్ట్ర ప్రభుత్వం వద్దనున్న డేటా మేరకు పారదర్శకంగా అమలు చేయనున్నారు.

వ్యవసాయ శాఖకు బాధ్యతలు అప్పగింత

వ్యవసాయశాఖ కమిషనర్, సంచాలకులు (డీఓఏ) పంట రుణమాఫీ 2024 పథకాన్ని అమలు చేస్తారు. హైదరాబాద్‌లో గల నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ) ఈ పథకానికి భాగస్వామిగా ఉంటుంది. వ్యవసాయశాఖ సంచాలకులు, ఎన్ఐసీ కలిసి ఐటీ పోర్టల్ నిర్వహిస్తారు. ఆ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్ణయించడానికి సౌకర్యం ఉంటుంది. ఐటీ పోర్టల్ ఆర్థికశాఖ నిర్వహించే ఐఎఫ్ఎంఐఎస్ పోర్టల్‌కి బిల్లులు సమర్పించడంతో పాటు పథకానికి సంబంధించిన భాగస్వాములతో సమాచారం పంచుకుంటుంది. రైతులు ఇచ్చే ఫిర్యాదుల పరిష్కారానికి అందులో ప్రత్యేకమైన మాడ్యూల్స్ ఉంటాయి. రుణ మాఫీకి సంబంధించి వచ్చిన ఫిర్యాదులను 30 రోజుల్లో పరిష్కరిస్తారు.

అర్హత లేకుండా రుణమాఫీ పొందితే రికవరీ

అర్హత లేకుండా, మోసపూరితంగా రుణమాఫీ పొందితే రికవరీ చేసే అధికారాన్ని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు ప్రభుత్వం అప్పగించింది. రుణమాఫీ అర్హుల వివరాలను బ్యాంకులు ఎలాంటి పొరపాట్లు లేకుండా, సమగ్రంగా డిజిటల్ సంతకాలతో వ్యవసాయ శాఖకు పంపించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందు కోసం ప్రతి బ్యాంకులో ఒక అధికారి నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. వీరు బ్యాంకులకు, ఎన్ఐసీకి మధ్య సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఈ క్రమంలో బ్యాంకులు సైతం పారదర్శకంగా వ్యవహరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. నిబంధనలు ఉల్లంఘించిన బ్యాంకర్లపై సైతం చర్యలకు వెనుకాడబోమని స్పష్టం చేసింది.

20న తల్లిదండ్రులు, టీచర్ల సమావేశం

- పాఠశాల విద్యాశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 20న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈవి నరసింహారెడ్డి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని ఆర్జేడీలు, డీఈవోలు ఈనెల 20న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని అన్ని పాఠశాలల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తల్లిదండ్రులను ఈ సమావేశానికి ఆహ్వానించాలని కోరారు. వంద శాతం హాజరు ఉండేలా హెడ్మాస్టర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల విద్యాప్రమాణాల పెంపు గురించి వారితో చర్చించాలని వివరించారు. పాఠశాలలను సమాజంతో సంబంధం ఉండేలా చూడాలనీ, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలని తెలిపారు. విద్యార్థుల నమోదును పెంచేందుకు వారి సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. పాఠశాల అభివృద్ధి, కార్యక్రమాల నిర్వహణ, విద్యార్థుల అభివృద్ధి, పాఠశాల వృద్ధిలోనూ భాగస్వాములను చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులు, పట్టణ ప్రాంతాల్లో ఇతర పనులకు తల్లిదండ్రులు వెళ్తారనీ, వారికి అనువైన సమయాన్ని కేటాయించి సమావేశాన్ని నిర్వహించాలని తెలిపారు. తల్లిదండ్రుల అభిప్రాయాలను నమోదు చేయాలనీ, ఆ సమాచారాన్ని తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పాఠాలను ఇంటివద్ద చదివే విధంగా విద్యార్థులను ప్రోత్సహించేలా వారిలో అవగాహన కల్పించాలని తెలిపారు.

కాళ్లకు తిమ్మిర్లు వస్తున్నాయని వెళ్తే...

- ఆపరేషన్ అనంతరం మహిళ మృతి
- ఆస్పత్రి ముందు బంధువుల ఆందోళన

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



కాళ్ల నరాల సమస్యతో ఆస్పత్రికొచ్చిన మహిళ ఆపరేషన్ అనంతరం పరిస్థితి విషమించి మృతి చెందింది. ఈ ఘటన హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని వెల్‌నెస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో సోమవారం జరిగింది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మరికల్ మండలం కృష్ణాపూర్ నివాసి విష్ణువర్ధన్‌రెడ్డి భార్య జయశ్రీ(35) కాళ్లకు తిమ్మిరి వస్తుందని మహబూబ్‌నగర్‌లోని ఆస్పత్రిలో చూపించుకుంది. నరాల వ్యాధితో బాధపడుతుందని తెలియగా.. మొదట అపోలో ఆస్పత్రికి రిఫర్ చేశారు. అనంతరం ఇన్సూరెన్స్ ఏజెంట్లు, వెల్నెస్ సెంటర్ ఆస్పత్రి యాజమాన్యం అమీర్‌పేట్‌లోని వెల్నెస్ హాస్పిటల్‌కు తీసుకొని వెళ్లాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆమెను ఆస్పత్రిలో అడ్మిట్ చేయగా, ఆదివారం సాయంత్రం ఆపరేషన్ చేశారు. అనంతరం ఐసీయూకు తరలించారు. ఇదిలా ఉండగా, సోమవారం ఉదయం ఆమె మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. ఆరోగ్యంగా వచ్చిన మహిళను డాక్టర్ల నిర్లక్ష్యంతో చంపేశారని ఆరోపిస్తూ మృతురాలి బంధువులు, భర్త ఆస్పత్రి ముందు ఆందోళన చేపట్టారు. అయితే, యాజమాన్యం వారితో చర్చలు జరిపి, అంబులెన్స్ ఇచ్చి మృతదే హాన్ని స్వగ్రామానికి పంపించింది. బాధితులు ఎలాంటి ఫిర్యాదూ చేయలేదని ఎస్ఆర్ నగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ అఖిల తెలిపారు. జయశ్రీ మృతికి గల కారణాలు తెలియరాలేదు.

జీపీలకు రూ.150 కోట్ల నిధులు విడుదల

వేతన బకాయిలు చెల్లించాలని ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్‌కు పెండింగ్ వేతనాలు చెల్లించేందుకు రూ.150 కోట్ల 57 లక్షల 59వేల 500 నిధుల్ని విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 32 జిల్లాల్లో పనిచేస్తున్న 29,676 మందికి దాదాపు ఆరేడు నెలలుగా జీతాలు చెల్లించట్లేదు. దీనిపై పలుమార్లు పంచాయతీ కార్మికులు ఆందోళనలు చేశారు. ఈ నేపథ్యంలో నిధులు విడుదల చేస్తూ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఉత్తర్వులుజారీ చేశారు. ఈ నిధుల్ని మల్టీపర్పస్ కార్మికుల వేతనాలకే ఖర్చు చేయాలని తెలిపారు. జిల్లాల వారీగా కార్మికుల సంఖ్య, వారికి చెల్లించాల్సిన మొత్తాలను ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

టీజీజీపీఈడబ్ల్యూయూ హర్షం

గ్రామపంచాయతీ సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (టీజీజీపీఈడబ్ల్యూయూ) హర్షం వ్యక్తం చేసింది. పలు పోరాటాల తర్వాతే ప్రభుత్వం ఈ నిధులు విడుదలచేసిందంటూ, గతంలో చేసిన ఆందోళనలను వెల్లడిస్తూ యూనియన్ గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్యార పాండు, చాగంటి వెంకటయ్య, కార్యదర్శి పీ సుధాకర్ ఆదివారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గడచిన ఏడు నెలలుగా తమ సంఘం ఆధ్వర్యంలో పలు రూపాల్లో ఆందోళనలు నిర్వహించామనీ, అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పించామని పేర్కొన్నారు. వేతనాల సమస్యను పరిష్కరించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్కకు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం కేటాయించిన నిధుల్ని ఇతర పనులకు మళ్లించకుండా, కార్మికుల వేతనాల చెల్లింపు కోసమే ఉపయోగించాలని కోరారు. ఇకపై వేతనాలు పెండింగ్ పెట్టొద్దనీ, ప్రతినెలా క్రమం తప్పకుండా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

- రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

నవతెలంగాణ-మియాపూర్


గుర్తు తెలియని వాహనం వెనక నుంచి ఢీ కొట్టిన ఘటనలో ఓ చిరు వ్యాపారి మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని కాకినాడకు చెందిన సుబ్బారావు (38) రాయదుర్గం పరిసరాల్లో రోజు ఉదయం టీవీఎస్ ఎక్సల్‌పై తిరుగుతూ టిఫిన్స్ అమ్ము కుంటుంటాడు. సోమవారం సైతం టిఫిన్స్ అమ్ముకుని ఇంటికి వెళుతున్న క్రమంలో బయోడైవర్సిటీ ఫ్లైఓవర్‌పై వెనక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలి యని వాహనం అతని వాహనాన్ని ఢీకొట్టింది. దాంతో ఎక్సల్‌పై వెళ్తున్న వ్యక్తి ఫ్లైఓవర్‌పై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు రాయదుర్గం పోలీసులు తెలిపారు.

వచ్చే నాలుగు రోజులకూ భారీ వర్షసూచన

- అక్కడక్కడా అతి భారీ వర్షాలు కురిసే అవకాశం!
- పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలు జారీ
- 463 ప్రాంతాల్లో కురిసిన వర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే నాలుగు రోజుల పాటు పలు జిల్లాల్లో కొన్ని చోట్ల భారీ, అక్కడక్కడా అతి భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. ఈ మేరకు పలు జిల్లాలకు ఆరెంజ్, ఎల్లో హెచ్చరికలను జారీ చేశారు. దక్షిణ ఒడిశా తీరం వద్ద నుంచి వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సగటున సముద్ర మట్టం నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు అల్పపీడనం నెలకొని ఉంది. ఈనెల 19న పశ్చిమ- మధ్య, దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో మరొక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉంది. దీని ప్రభావం వల్ల వర్షాలు కురిసే అవకాశముంది. ఎక్కువ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయి.. అన్ని జిల్లాల్లోనూ 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముంది. జీహెచ్ఎంసీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులతో కూడిన తేలికపాటి జల్లులు, అక్కడక్కడా మోస్తరు వానలు పడే సూచనలున్నాయి. సోమవారం ఉదయం 8:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు రాష్ట్రంలో 463 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో పలుచోట్ల భారీ వర్షాలు పడ్డాయి.



ఆరెంజ్ హెచ్చరిక : 18న మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశముంది. 19న ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఖమ్మం జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. ఈ మేరకు ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది.

ఎల్లో హెచ్చరిక : వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసిన జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయి.

16.07.24 : ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల,

17.07.24 : ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ

18.7.24 : ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి

19.7.24 : నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, మెదక్, కామారెడ్డి, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం రాత్రి పది గంటల వరకు కురిసిన వర్షపాతం (సెంటీమీటర్లలో)		
గంగాధర (కరీంనగర్)	-	11.63
మల్యాల (జగిత్యాల)	-	10.36
పూడూరు (జగిత్యాల)	-	9.40
విశ్వనాథ్‌పేట (నిర్మల్)	-	8.53
బాసర (నిర్మల్)	-	8.33



గ్రంథాలయం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రియాజును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన తెలంగాణ విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్, రాష్ట్ర నాయకులు సలీం తదితరులు పాల్గొన్నారు.
నవతెలంగాణ-అంబర్‌పేట

రేషన్ కార్డులు నూతన పెన్షన్లను మంజూరు చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

రేషన్ కార్డులు లేని కుటుంబాలకు ప్రభుత్వం రేషన్ కార్డులను, 60 సంవత్సరాల నిండిన వృద్ధుల కు, వికలాంగు లకు, (మూగ, చెవిటి వారికి) నూతన పెన్షన్లను వెంటనే మంజూరు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు తెలంగాణ శేఖర్ చారి అన్నారు. అబిడ్స్‌లో ఆయన మాట్లాడుతూ.. అనేకమంది పేదలకు రేషన్ కార్డులు లేకపోవడం వల్ల రేషన్ బియ్యంతో పాటు వివిధ రకాల సంక్షేమ పథకాలకు వారు దూరమవుతున్నారన్నారు. మేము అధికారంలోకి రాగానే రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతవరకు అమలు చేయలేదని వెంటనే నూతన రేషన్ కార్డులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనేకమంది వృద్ధులు 60 సంవత్సరాలు నిండిన తమకు పెన్షన్ అందక ఎదురుచూపులు చూస్తున్నారని వారందరికీ వెంటనే నూతన పెన్షన్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. బోనాల పండుగ ఉత్సవాలను సందర్భంగా గోషామహల్ నియోజకవర్గంలోని రోడ్ల మరమ్మతులు, వీధిలైట్లు మరమ్మతు పనులు చేపట్టాలని అధికారులను కోరారు.

స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి..

● జోనల్ కమిషనర్ టీ. వెంకన్న..



నవతెలంగాణ-ధూల్‌పేట్

స్థానికంగా నెలకొన్న ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ. వెంకన్న తెలిపారు. ఆయన పర్యవేక్షణలో సోమవారం చాంద్రాయణ గుట్ట నర్కిపూల్‌బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్ర మంలో ప్రజలు స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలన్నారు. ఇప్పటి వరకు తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలకు పంపి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ శైలేజా, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అమీనా బీ, వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ జోనల్ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, ఏ యం సీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈ ఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన జెండాలో శ్రీచక్ర యంత్రాన్ని పెట్టడం అన్యాయం



నవతెలంగాణ-ముషీరాబాద్

పరబ్రహ్మ స్వరూపం అయినటువంటి ఆదిపరాశక్తి అమ్మవారి శ్రీచక్ర యంత్రాన్ని జనసేన పార్టీ తన జెండాకు ఉపయోగించడం అన్యాయం అని ఇది అమ్మవారిని హైందవ ధర్మాన్ని అవమానించడమేనని ప్రముఖ అధ్యాత్మికవేత్త కమల సంతోష్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరుల సమావేశంలో కమల సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాజకీయాలకు అమ్మవారి చిహ్నాన్ని ఉపయోగించడం హిందుధర్మాన్ని తుంగలో తొక్కడమేనన్నారు. ఈ చిహ్నాన్ని అనుమతించిన రాష్ట్ర, కేంద్ర ఎన్నికల కమిషన్ అధికారులు బాధ్యత వహించాలన్నారు. ఈ విషయంపై తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదేల పవన్ కళ్యాణ్ పునరాలోచించి అట్టి శ్రీ చక్ర యంత్రాన్ని తన జెండాను ఉపసంహరించుకోవాలని కోరారు. తన జెండాను తీసి వేయకుంటే ఈ విషయంపై కోర్టును ఆశ్రయించి న్యాయ పరమైన పోరాటానిన చేస్తానని హెచ్చరించారు. ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, హెూంశాఖ మంత్రులు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

మోహన్, ప్రణీత్ యాదవ్‌లకు ఎమ్మెల్యే సన్మానం



నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్‌లో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి నియోజకవర్గంలోని స్ట్రీట్ నెంబర్ 17లో వరద ఉధృతిలో ఓ కారు చిక్కుకుపోయింది. డోర్‌లు ఎంతకీ ఓపెన్ కాకపోవడంతో నలుగురు ప్రయాణికులు అందులోనే ఉండి పోయారు. స్థానిక యువకుడు ప్రణీత్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ లీడర్ నాగులు యాదవ్ కుమారుడు మోహన్ యాదవ్ రిస్క్ చేసి కారును గోడ పక్కకు తెచ్చారు. అద్దాలు పగలగొట్టి అందులో ఉన్న వారిని బయటకు తీసు కొచ్చారు. రాత్రి సమయంలో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా సకాలంలో స్పందించి సహాయం చేసిన యువకులను సోమవారం ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రాణాలు కాపాడిన చింటూ (మోహన్ యాదవ్) నాను (ప్రణీత్ యాదవ్) ను సన్మానించారు. యువత ప్రాణాలకు తెగించి కాపాడిన తీరు పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

రేషన్ కార్డులో మార్పులు చేర్పులకు దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నిత్యావసర వినియోదారులకు అత్యవసరమైన రేషన్ కార్డులో మార్పులు, చేర్పులకు దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని నాంపల్లి సర్కిల్ పౌరసరఫరాల శాఖ సహాయ అధికారి ఇర్ఫాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. సోమవారం నాంపల్లిలోని పౌరసరపరాల శాఖ సర్కిల్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. రేషన్ కార్డులో తప్పులు సరిచేసేందుకు, పెండ్లయిన యువతులు అత్తవారింటిరేషన్ కార్డులో పేరు యాడ్ చేసుకునేందుకు, రేషన్ కార్డు దారులు ఇల్లు మారినట్లయితే వారి అడ్రస్సులు యాడ్ చేసుకునేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. తమ పౌరసరపరాల ఇన్‌స్పెక్టర్‌లు రోహిత్, జగదీష్, శ్రీనివాస్, సుజాత, సాహిన్‌లు దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేస్తారని తెలిపారు. రేషన్ కార్డులో సవరణలు చేసేందుకు కుటుంబ యజమాని బ్యాంక్ పాస్ బుక్ లేదా ఓటర్ కార్డు, కుటుంబ సభ్యుల అందరి ఆధార్ కార్డులు, రేషన్ కార్డు జిరాక్స్ లు తీసుకుని అందుబాటులో ఉన్న మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నాంపల్లి సర్కిల్ పరిధిలోని రేషన్ కార్డు దారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ప్రగతి విద్యానికేతన్ స్కూల్‌లో డెంగ్యూ, మలేరియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎమ్‌హెచ్ఓ డాక్టర్ హేమలత, ప్రగతి విద్యానికేతన్ స్కూల్ చైర్మెన్ మధు, సూపర్‌వైజర్ పాషా తదితరులు
నవతెలంగాణ-అంబర్‌పేట



తెలంగాణ రాష్ట్ర విత్తన కార్పొరేషన్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన సోంకేట అన్వేష్ రెడ్డిని కలిసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు జి.సోలమన్ , ఆర్‌పి వినోద్ కుమార్, సుదర్శన్
నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



సీఎం రేవంత్ రెడ్డిని 'తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్' మెట్టు సాయి కుమార్ కుటుంబ సమేతంగా మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదలు తీసుకున్నారు. 'రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్‌గా ఎంతో నమ్మకంతో తనను నియమించి నందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాద'ములు తెలిపారు. వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి బలహీన వర్గాలు, మత్స్యకార పక్షపాతిగా చరిత్రలో మిగిలి పోతారని కొనియాడారు. క్రమశిక్షణ గల కాంగ్రెస్ కార్యకర్త లను సీఎం రేవంత్ రెడ్డి నాయకులను చేశారని తెలిపారు. నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాగోల్ ఎస్టీపీ ట్రయల్ రన్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

నాగోల్ ఎస్టీపీని ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్టీపీ ప్రాజెక్టుల్లో భాగంగా ప్యాకేజీ-2లో నిర్మిస్తున్న నాగోల్ ఎస్టీపీని సోమవారం ఆయన సందర్శించారు. వెట్ వెల్ దగ్గర ఇన్ లెట్ పంపులను స్విచ్ ఆన్ చేసి ట్రయల్ రన్ ప్రారంభించారు. ఎస్టీపీ ప్రాంగణంలో పర్యటించిన ఎండీ అశోక్ రెడ్డి సీసీ రోడ్లు, లైటింగ్ పనుల్ని పరిశీలించారు. అంతర్గత రహదారుల నిర్మాణంతోపాటు ముగింపు దశలో ఉన్న పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ నెలా ఖరులోగా ఎస్టీపీ ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎస్టీపీ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో ల్యాండ్ స్కేపింగ్, పూల మొక్కలతో సుందరీకరణ పనులు చేప ట్టాలని సూచించారు. అనంతరం ఎస్టీపీ ప్రాంగణంలో ఎండీ అశోక్ రెడ్డి మొక్క నాటి నీళ్ల పోశారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్-2 సుదర్శన్, సీజీఎం, జీఎం, ఎస్టీపీ ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్, కేటీఆర్‌లకు లేదు'

● మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గాలకు ఎందరో నిరుద్యోగులు, అమాయకులు బలైపోయారని, నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్, కేటీఆర్ లకు లేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. నిరుద్యోగుల ఉసురు పోసుకున్న బీఆర్ఎస్ నేడు కాంగ్రెస్ పార్టీని విమర్శించడం సిగ్గుచేటన్నారు. గత 10 ఏండ్లలో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. పదేండ్ల పాలనలో కనీసం డీఎస్సీ నోటిఫికేషన్, ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులను ఎందుకు ప్రకటించలేదని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. సుద్ధ పుసల్లా నేడు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు నిరుద్యోగులపై మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 6 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్నారని ఇది వారికి మంచిది కాదన్నారు. మీరే నిజాయితీగా ఉంటే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లోకి ఎందుకు వస్తారని, కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవితల అహంకారం వల్ల నేడు ఎమ్మెల్యేలందరూ కాంగ్రెస్‌లో చేరడం జరుగుతుందన్నారు. మీ అహంకారం వల్ల ప్రజలు ఎన్నికల్లో మంచి గుణపాఠం చెప్పారని విమర్శించారు. పదే పదే కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందంటూ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకోవాలని, లేకపోతే భవిష్యత్తులో ప్రజలు మిమ్ములను నమ్మారని ఆయన ఆరోపించారు.

పోటీ తత్వంతో సాహిత్య వికాసం



● ఉత్తమ గ్రంథ పురస్కార ప్రదానోత్సవంలో ఎల్లూరి శివారెడ్డి

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

రచయితల్లో పోటీ తత్వం వల్ల సాహిత్య వికాసానికి మేలు జరుగుతుందని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. పోటీలో గెలుపు ఒక పుస్తకానికే అయినా మిగతా పుస్తకాలను తక్కువగా చూడనవసరం లేదన్నారు. పోటీతత్వంతో సృజన శక్తిని పెంపొందించుకుంటూ ముందుకు సాగితే ఒకనాడు తప్పక బహుమతి మాత్రమే కాక పాఠకుల్లో ఆదరణ పెరుగుతుందని తెలిపారు. 2024 సంవత్సరానికి సారస్వత పరిషత్తువివిధ సాహిత్య ప్రక్రియల్లో నిర్వహించిన పోటీలో న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ గ్రంథాలకు సోమవారం పరిషత్తు లోని డాక్టర్ దేవులపల్లి రామారావు కళామందిరంలో జరిగిన కార్యక్రమంలోఆయన పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్యతో కలిసి పురస్కారాలు ప్రదానం చేశారు. పురస్కారాలు పొందిన గ్రంథాల ప్రమాణాలు చూస్తుంటే తెలంగాణ సృజనాత్మక ప్రతిభ ఉన్నత స్థాయిలో ఉన్నట్లు తెలుస్తుందని శివారెడ్డి తెలిపారు. ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య స్వాగతోపన్యాసం చేస్తూ 2022, 2023 సంవత్సరాల్లో మొదటిసారిగా వెలువడిన గ్రంథాలను పోటీకి స్వీకరించామని, ఒక్కో ప్రక్రియలో ముగ్గురు న్యాయ నిర్ణేతలు పుస్తకాలను పరిశీలించి వేసిన మార్కుల ఆధారంగా పురస్కారాలు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఇతర గ్రంథాల విభాగంలో'రచ్చబండ ఇతర నాటికలు' రచయిత రావుల పుల్లాచారికి 20 వేల రూపాయల నగదు, జ్ఞాపిక,ప్రశంసా పత్రం అందజేసి సత్కరించారు. 'స్వేచ్ఛకు సంకెళ్లు' అనే గ్రంథానికి ఈసారి యువ పురస్కారం లభించింది. రచయిత పోలీస్ ఉమేష్ కు పదివేల రూపాయల నగదు పురస్కారం అందించారు. ప్రముఖ సాహితీవేత్తలు డా.శ్రీరంగాచార్య, జింబో (మంగారి రాజేందర్), బి మురళీధర్ లకు వరిష్ఠ పురస్కారాలు ప్రదానం చేశారు. రూ.20 వేల నగదు, ప్రశంసా పత్రం, జ్ఞాపిక,శాలువాతో సత్కరించారు. పురస్కార గ్రహీతలు స్పందన తెలియజేశారు. పరిషత్తు కార్యవర్గ సభ్యుడు ఆర్. రామ్మూర్తి పురస్కార గ్రహీతలను పరిచయం చేశారు.

'యువత తిరుగుబాటే బీజేపీ ఓటమికి కారణం'

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టీ.నరసింహ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మోడీ మతతత్వ నీచ రాజకీయాలతో దేశంలో సామాజిక అశాంతి, ఉపాధి లేక పెరిగిన నిరుద్యోగం, తీవ్ర నిరాశలతో యువత చేసిన తిరుగుబాటే బీజేపీ ఓటమికి కారణమని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ తెలిపారు. మోడీ ప్రభుత్వ పాలనా సామాన్యుల కోసం కాకుండా కార్పొరేట్ సంస్థల కోసం నడుస్తుందని, దేశ ప్రజలు గుర్తించి బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో పూర్తి మెజార్టీ రాకుండా చేశారన్నారు. సోమవారం హిమాయత్ నగర్ లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్ లో సీపీఐ హైదరాబాద్ జిల్లా సమితి సమావేశం సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాటాడుతూ పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్, కూరగాయలు, పాలు, పప్పులు, నూనె, మసాలాలు, సబ్బులు, డిటర్జెంట్లు ఇలా అన్ని నిత్యావసరాల ధరలు గత పది సంవత్సరాల నుండి ఆకాశాన్నంటడంతో జనం చితికిపోతున్నారని ఆరోపించారు. మోడీ ప్రభుత్వ వైఫల్యాలను, రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉండాలని, అలాగే ఆర్ఎస్ఎస్, బీజేపీల మతపరమైన ఎజెండాపై స్థిరంగా బలమైన పోరాటాలు నిర్వహించాలని ఆయన సూచించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కరానికి కృషి చేయాలని ఆయన పార్టీ శ్రేణులను కోరారు. ఈ సమావేశంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్. ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, కార్యవర్గ సభ్యులు జి.చంద్రమోహన్, కంపల్లి శ్రీనివాస్, నెర్లకంటి శ్రీకాంత్, శంషుద్దీన్, పడాల నళిని, ఎండి.సలీమ్, ఒమర్ ఖాన్, మామిడిచెట్ల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారులపై కేసులను తొలగించాలి

● తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ యాదగిరి



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న పోలీస్ కేసులను వెంటనే తొలగించి వారిని ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్.యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షులు ఎస్.యాదగిరి, వెన్నెల గద్దర్, బాయపల్లి రంగారెడ్డి, తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులపై ఉన్న పోలీస్ కేసులను వెంటనే తొలగించి ప్రభుత్వపరంగా గుర్తించిన కుటుంబాలను ఆదుకున్నారు. గుర్తించిన మిగతా తెలంగాణ ఉద్యమంలో అమరులైన అమర వీరుల కుటుంబాలను వెంటనే ఆదుకోవాలని కోరారు. తెలంగాణ సమర యోధుల విస్తృత కమిటీని అధికారికంగా వెంటనే ఏర్పాటు చేయాలన్నారు తొలిదశ మలిదశ ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు పత్రాలు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చిన దాని ప్రకారం ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు నాలుగు గదుల ఇంటిని నిర్మించి ఇవ్వాలన్నారు. గౌరవ వేతనం రూ. 30 వేల పెన్షన్ అందిం చాలన్నారు. ఉచిత బస్సు సౌకర్యం ఆరోగ్య భీమా 20 లక్షల వరకు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా ఉద్యోగాల భర్తీలో ఉద్యమకారుల కుటుంబానికి 5% రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వ పథకాలలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు అమరవీరుల స్మృతి వనం 100 ఎకరాలలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు చంద్రశేఖర్ ప్రసాద్, భక్తుల సామయ్య, వెంకటస్వామి, వెంకటనారాయణ, కొండ స్వామి, నల్ల రాధాకృష్ణ ,సాయిలు , యాదగి, డప్పు స్వామి ,అశోక్ కుమార్ తదితర నాయకులు తదిరులున్నారు.

వైభవంగా బోనాలు నిర్వహిస్తాం

● ఎమ్మెల్యే ముఠా గోపాల్



నవతెలంగాణ-ముషీరాబాద్

ట్యాంక్ బోర్డుపై వెలిసిన కనకాల కట్ట మైసమ్మకు ఆషాఢం బోనాలను అత్యంత వైభవంగా సమర్పిస్తామని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆషాడ మాసం బోనాలు సందర్భంగా కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారి బోనాల జాతరకు సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. నియోజకవర్గంలో ట్యాంక్ బోర్డుపై వెలసిన కనకాల కట్ట మైసమ్మ దేవాలయం అత్యంత ప్రాచీనమైందన్నారు. ఈ దేవాలయానికి దూర ప్రాంతాల నుంచి ఎంతో వ్యయ ప్రయాసలతో వేలాది మంది భక్తులు తరలివచ్చి దర్శించుకుంటారని తెలిపారు. ఆషాడమాసం బోనాల జాతర ప్రతి ఏడు అత్యంత వైభవంగా జరుగుతుందని ఎప్పటి లాగానే ఈ సంవత్సరం ఆషాడ బోనాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. అందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక క్యూ లైన్లు మంచినీటి సౌకర్యం కల్పిస్తామన్నారు. బోనాలతో వచ్చే మహిళలకు ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేసి అమ్మ వారి దర్శనం సాఫీగా జరిగే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మవారి ఆషాడ బోనాల మహెూత్సవానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవాడిగూడ కార్పొరేటర్ రచన శ్రీ, ఆలయ చైర్మెన్ గౌతమ్ రాజు, దేవాదాయ శాఖ కార్య నిర్వాహక అధికారి సాంబశివరావు, యువ నాయకులు ముఠా జై సింహా, ముషీరాబాద్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ ఖాదర్ మొయినుద్దీన్, హిమైత్ నగర్ ఎమ్మార్వో సంధ్యారాణి, మెడికల్ ఆఫీసర్ మైత్రియి, స్ట్రీట్ లైట్ ఏఈ జ్యోతిర్మయి, చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరేశం, మీడి యా ఇన్‌చార్జి మచ్చకుర్తి ప్రభాకర్ నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

● పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాడపంగి నాగరాజు

● రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ముషీరాబాద్

పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్ ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో స్థానిక రామ్‌నగర్ చౌరస్తా వద్ద పీడీఎస్‌యు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మంద నవీన్ అధ్యక్షతన పెండింగ్ రియంబర్స్‌మెంట్ విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాడపంగి నాగరాజు మాట్లాడుతూ ఆరు సంవత్సరాలుగా విద్యార్థులకు ఫీజులను చెల్లించడం లేదన్నారు. ఏడాదికి నాలుగు లక్షల మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరికి ఏడాదికి మూడు వేల కోట్లు అవసరమవుతాయని తెలిపారు. 2019 నుంచి ఇప్పటివరకు మొత్తం రూ.8214.57 కోట్లు ఫీజుల రూపంలో బకాయిలు ఉన్నట్టు తెలిపారు. గత ప్రభుత్వాలు అవలంభించిన తీరుగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుసరిస్తుందన్నారు. అధికారంలోకి వచ్చి 7 నెలలు పూర్తయినప్పటికీ పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గమనించి తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలు మొత్తాన్ని చెల్లించి విద్యార్థుల భవిష్యత్తులను కాపాడాలని డిమాండ్ చేశారు. బకాయిలు చెల్లించని యెడల రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు జిల్లా నాయకుల యశ్వంత్,ప్రశాంత్, నరేష్, సురేష్, శ్రీరామ్, శ్రీను, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఎలాంటి విచారణకైనా సిద్ధం'

భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు ఎం.సత్యనారాయణ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

భాగ్యనగర్ ఎన్జీవో (గచ్చిబౌలి) మ్యూచువల్ ఎయిడెడ్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, ఈ విషయంలో తన వల్ల ఏవైనా అవకతవ కలు జరిగినట్లు నిరూపిస్తే ఎలాంటి విచారణకైనా తాను సిద్ధమని భాగ్యనగర్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షులు ఎం. సత్యనారాయణ గౌడ్ సవాల్ విసిరారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సొసైటీ డైరెక్టర్లతో కలిసి ఆయన మాట్లాడుతూ కొంత మంది పని గట్టుకుని చేస్తున్న దుష్ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. 2008 లో శేరిలింగంపల్లి మండలం, గోపన్నపల్లిలోని సర్వే నెంబర్ 36, 37లలో 189 ఎకరాల 11 గుంటల స్థలాన్ని ప్రభుత్వ ఉద్యోగుల ఇండ్ల స్థలాల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించిన భూమిని గత బీఆర్ఎస్ ప్రభు త్వం స్వాధీనం చేసుకుని 4 వేల మంది రిటైర్డ్, సర్వీస్ ఉద్యోగుల పొట్ట కొట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. 2008లో అప్పటి సీఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి సొసైటీలో శం కుస్థాపన చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.ప్రభుత్వ మెమోను విత్ డ్రా చేసుకుని సీఎం ఎ.రేవంత్ రెడ్డి ఆ భూములను తమకు తిరిగి కేటాయించి ఉద్యోగులను ఆదుకోవాలని ఆయన వేడుకున్నారు. ఈ సమావేశంలో సొసైటీ కార్యదర్శి మల్లారెడ్డి, వైస్-ప్రెసిడెంట్ రాజేష్, ట్రెజరర్ శ్రీనివాస్, డైరెక్టర్ ప్రభాకర్, సంధ్య, అమరజ్యోతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE, SANGAREDDY
I.A.No.1183 OF 2017
IN
O.S.No. 78 OF 2015

BETWEEN:
Bashetty Ashok.
...Petitioner/Plaintiff
AND
G.Sathaiah & Others
...Respondents/Defendants

To.
M.Nagabhadri Raju, S/o. M.Shiva rama Raju, Aged 60yrs, Occ: Business, R/o.H.No.8-3-215, Srinagar Colony, Ameerpet, Hyd
(Respondent No.7)

Take notice that, the above case vide IA.No.1183/2017 in OS.No.78/ 2015 stands posted **to 22-07-2024 at 10.30 A.M** for your appearance before the Hon'ble Senior Civil Judge, Sangareddy. In default of your appearance on that day the matter will be heard ex-parte and decided accordingly.

//BY ORDER OF THE COURT//
(B.ANIL REDDY),
Advocate, Sangareddy.

IN THE COURT OF THE HON'BLE X ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD
E.P.No.2807 of 2023
IN
O.S.No.652 of 2015

BETWEEN:
G.S Mallikarjun
...Plaintiff/DHR
And
Jai Prakash Gilda
...Defendant/JDR

NOTICE

To:
Jai Prakash Gilda,S/o. Satyanarayana Gilda, Aged about 51 yrs, Occ:Business, R/o. H.No.1-8-163, Chikkada Pally, Hyderabad
...Defendant/JDR

Please take notice that the above named plaintiff/DHR filed the above said EP filed for delivery of possession of the EP schedule property to the decree holder against the defendant/JDR, which is posted on 01.08.2024 for your appearance, therefore you are hereby advised to appear before the above said Hon'ble court **on 01.08.2024 at 10.30AM** either in person or through counsel, failing which the matter will be decided exparte.

(BY ORDER OF THE COURT)
N.Bojjaiah (Ganesh)
Advocates
H.No.11-3-253 Road No.6, Venkateshwara Colony, Saroornagar, Hyderabad-35
Ph.No.9440484059

నవతెలంగాణ
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
మంగళవారం | జులై 16, 2024 | www.navatelangana.com

తోటకూర అజయ్ యాదవ్‌కు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-మేడ్చల్

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌గా తోటకూర అజయ్ యాదవ్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా మేడ్చల్ మండల కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపల్ వైస్ చైర్మెన్ చీర్ల రమేష్, కౌన్సిలర్లు పెంజర్ల స్వామి యాదవ్, కౌడే మహేష్, బత్తుల మధుకర్ యాదవ్, సాయిపేట శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సత్యనారాయణ, మర్రి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్, సీనియర్ నాయకులు రవీందర్ గౌడ్, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'ప్రజావాణి' దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

- మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్
- ప్రజావాణికి 80 దరఖాస్తులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియతో కలిసి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ప్రజావాణికి 80 దరఖాస్తులు వచ్చినట్టు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పిల్లల పేర్లు అంగన్వాడీలో నమోదు చేయాలి



నవతెలంగాణ-జవహర్ నగర్

అంగన్వాడీలో పిల్లల పేర్లు నమోదు చేసి వారి బంగారు భవితకు పునాది వేయాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ ధనలక్ష్మి అన్నారు. సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని అంబేద్కర్ నగర్, దేవేందర్ నగర్‌లో అంగన్వాడీ పాఠశాలలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అమ్మమాట - అంగన్వాడీ బాట కార్యక్రమం పిల్లలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెల 15వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడేండ్ల నుంచి నాలుగేండ్ల పిల్లలు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మీ పిల్లలను అంగన్వాడీలో చేర్పించి వారి బంగారు భవిష్యత్తుకు పునాదులు వేయండని నినాదాలు చేశారు. పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలిసి ఫ్లగ్ కార్డులతో కాలనీలలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ స్కూల్ టీచర్స్ మనోహర, జయ, సరస్వతి, అనిత, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవ ప్రదమైనది



నవతెలంగాణ-కీసర

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవ ప్రదమైనదని దమ్మాయి గూడ మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్ గౌడ్ అన్నారు. బండ్లగూడ పాఠశాలలో పదవీ విరమణ, బదిలీ అయిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం అన్నారు. ఉద్యోగంలో ఉద్యోగ విరమణ, బదిలీలు సహజమని పేర్కొన్నారు. వారు పాఠశాలకు చేసిన సేవను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అశోక్, సుధాకర్ రెడ్డి, సత్యనారాయణ, శివ, రాజ్యలక్ష్మి, భాస్కర్ గౌడ్, మడ్డి పాండు రాజు, ఆనంద్ గౌడ్, లక్ష్మీనారాయణ, ఎల్లయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు ఉన్నారు.

ఐమాక్స్ లైట్‌ను ఏర్పాటు చేయాలని వినతి



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలోని మహంకాళి ఆలయం వద్ద రాత్రి వేళలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటున్నందున ఐమాక్స్ లైటును ఏర్పాటు చేయాలని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్ కుమార్‌కు మహంకాళి ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎలసాని భూమయ్య యాదవ్ ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఈనెల 21న రాంపల్లిలో బోనాల పండుగ ఉన్నందున భక్తులు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని, వారికి ఇబ్బందులు లేకుండా లైట్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను కోరారు. మున్సిపల్ పాలకవర్గంతో తీర్మానం చేసి ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేసేలా చూస్తానని ఆలయ కమిటీ సభ్యులకు మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహంకాళి ఆలయ కమిటీ సభ్యులు గండి ఓం ప్రకాష్ గౌడ్, ఏనుగు మహేందర్ రెడ్డి, మీసాల శ్రీశైలం, దొడ్డి బాలనర్సింహ్మా పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహా స్వామి కాలనీ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని శ్రీలక్ష్మీనరసింహా స్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని కాలనీ పెద్దలు, ముకుంద భరత్ సాగర్ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా సీహెచ్ నరసింహ, జనరల్ సెక్రటరీగా జె. సుధాకర్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ చారి, కనకయ్య, శ్రీధర్, కోశాధికారిగా శ్రీనివాస్ చారి, దామోదర్, మల్లేష్, గోపాల్ రెడ్డి, రాజయ్య ఎస్. కృష్ణ, పాండు, జాయింట్ సెక్రటరీస్‌గా ఎం. సంతోష్, లింగస్వామి, తిరుమలరావు, పరమేష్ చారి, కమిటీ మెంబర్స్‌గా పి. రవి, టి. ప్రవీణ్, బి. లక్ష్మీనారాయణ, ఎస్. సురేష్, సురేష్ సాగర్, రామచందర్, శివ, సత్యనారాయణ, కిరణ్ కుమార్ యాదవ్, డాక్టర్ శ్రీను, అరుణ్ కుమార్, శ్రీనివాస్, తిరుమలేష్, మాదేశ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ.. ఎల్లవేళలా కాలనీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లక్ష్మీ నరసింహా స్వామి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, కమిటీ సభ్యులు, పెద్దలు, పాల్గొన్నారు.

వారాహి పూజలో పాల్గొన్న బొంతు శ్రీదేవి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని న్యూ వాసవీ శివానగర్ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వారాహి మాత నవరాత్రి ముగింపు ఉత్సవాల్లో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజ చేశారు. అనంతరం ఆలయ చైర్మెన్ అశోక్ గుప్తా ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమానికి చర్లపల్లి డివిజన్‌లోని వివిధ కాలనీల మహిళలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

రాంపల్లిలో ఆలయాల కమిటీలు ఎన్నిక



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లి గ్రామంలోని ఎల్లమ్మ, మైసమ్మ, పోచమ్మ ఆలయాల నూతన కమిటీని సోమవారం గ్రామ పెద్దల సమక్షంలో ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా మీసాల మల్లేష్, ఉపాధ్యక్షుడిగా పొడువల్ల శ్రీహరి, ప్రధాన కార్యదర్శి గా మీసాల సురేష్, కోశాధికారిగా నల్లోల బాలకృష్ణ, కార్యవర్గ సభ్యులుగా మీసాల భాస్కర్, ఎంకిరాల స్వామి, పొడువల్ల ఈశ్వర్, మంచాల నర్సింగ్ రావు, పొడువల్ల రవి, సలహదారులుగా మంచాల కృష్ణ, మంచాల శ్రీనివాస్, బందెలా వెంకటేష్, మంచాల మహేందర్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నేడు బోడుప్పల్..రేపు పీర్జాదిగూడ

- పీర్జాదిగూడలో ఆకర్ష్ హస్తం
- ఒకే రోజు నలుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్ల చేరిక
- మేయర్‌పై అవిశ్వాసం పెట్టి దించేందుకు సన్నాహాలు



నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి రోజుకో దెబ్బ తలుగుతోంది. సోమవారం జరిగిన మేయర్ ఎన్నికల లో బోడుప్పల్ మేయర్ పీఠం హస్తం ఖాతాలో చేరగా ఇక కాంగ్రెస్ నేతల టార్గెట్ పీర్జాదిగూడ కార్పొరేషన్‌పై పడింది. అందులో భాగంగానే బీఆర్ఎస్ పార్టీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి శిబిరానికి చెందిన నలుగురు కార్పొరేటర్లు సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. దీంతో అవిశ్వాసానికి కావాల్సిన కార్పొరేటర్ల సంఖ్య సరిపోయింది. ఇంకా మేయర్ శిబిరంలో ఉన్న ఒకరిద్దరు కార్పొరేటర్లు హస్తం గూటికి చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు సమాచారం.

మేయర్ పీఠంపై హస్తం కన్ను..

మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ పీఠంపై కాంగ్రెస్ నేతలు కన్నేశారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డిపై అవిశ్వాస తీర్మానం పెట్టి పీర్జాదిగూడ మేయర్ స్థానాన్ని కాంగ్రెస్ హస్తగతం చేసుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో భాగంగానే మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మలిపెద్ది సుధీర్ రెడ్డి, టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌లు పీర్జాదిగూడకు చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు బండి రమ్య సతీష్ గౌడ్, అలువాల సరితా దేవేందర్ గౌడ్, కౌడే పోచయ్య, బచ్చ రాజులను పార్టీలోకి చేర్చుకున్నారు.

ఇక మేయర్ పీఠం హస్తగతమే..

పీర్జాదిగూడ మేయర్ సీటు హస్తం గతం చేసుకునేందుకు కాంగ్రెస్ అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోంది. పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో 26 మంది కార్పొరేటర్లకుగాను ప్రస్తుతం కాంగ్రెస్‌కు 18 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ప్రస్తుత మేయర్ వెంకట్ రెడ్డి వర్గంలో ఎనిమిది మంది మాత్రమే ఉన్నారు. మేయర్‌పై అవిశ్వాసం పెట్టేందుకు కాంగ్రెస్‌కు సంఖ్య సరిపోయింది. గతంలో వాయిదా పడిన అవిశ్వాస తేదీని త్వరలో ఖరారయ్యే అవకాశం ఉంది.

లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ రాథోడ్



నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్ జిల్లా బోడుప్పల్‌లో కిరణ్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్న చిన్నారిపై డాన్స్ టీచర్ లైంగిక దాడి తీవ్రంగా ఖండిస్తున్నా మని, లైంగిక దాడిపై సమగ్ర విచారణ జరిపించి కఠినంగా శిక్షించి కిరణ్ ఇంటర్నేషనల్ పాఠశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. విద్యాబుద్ధులు నేర్పాల్సిన టీచర్లే చిన్నారిపై లైంగిక దాడి చేయడం సిగ్గుచేటన్నారు. కిరణ్ ఇంటర్నేషల్ స్కూల్ గుర్తింపు రద్దు చేసి విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం చేయాలన్నా రు. పాఠశాలలో చాలా కాలం నుంచి విద్యార్థులు వేధింపులకు గురవుతున్నారని అనుమానాలు వ్యక్తం చేశారు. స్కూల్ యజమాన్యాన్ని శిక్షించాలని డిమాండ్ చేశారు. డ్రగ్స్, మందు మత్తులో ఉంటూ చిన్న పెద్ద తేడా లేకుండా పసిపాప నుంచి పండు ముసలమ్మలపై లైంగిక దాడులు రాష్ట్రంలో జరుగుతున్నా యని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళలకు, అమ్మాయిలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

హరిత జవహర్ నగర్‌గా మారుద్దాం

- ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలి
- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



నవతెలంగాణ-జవహర్ నగర్

ప్రజల భాగస్వామ్యంతో జవహర్ నగర్‌ను హరిత జవహర్ నగర్‌గా మారుస్తామని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వం చేపట్టిన తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో భాగంగా సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు గండి రామచందర్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, జమాల్పూర్ నవీన్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆజామ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సుష్మా, ఆశ వర్కర్లు, మహిళా సంఘాలు, విద్యార్థుల పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



నవతెలంగాణ-జవహర్ నగర్

ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు తమ ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను, ఇంట్లోని పాత్రలను శుభ్రం చేసుకోవాలని, తద్వారా హాని కలిగించే క్రిమి కీటకాలను నివారించడం సాధ్యమవుతుందని జవహర్ నగర్ మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీలలో పరిసరాలను క్లీన్ చేసి, నీటి నిల్వలను ఖాళీ చేయాలని మున్సిపల్ అధికారులతో కలిసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు, వాటర్ ట్యాంకులలో నీరు నిల్వ ఉండకుండా ప్రతి శుక్రవారం మార్చాలని, మన చుట్టు పక్కల ప్రాంతాలలో చెత్తా చెదారం లేకుండా శుభ్రపరచి వాటిని మున్సిపల్ చెత్త బండిలో వేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ విషయంలో పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి రోడ్లపై మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని, వర్షాకాల సీజన్ కాబట్టి దోమలు ఉండకుండా మందులు పిచికారి చేయాలన్నారు. ప్రజలు మలేరియా, డెంగ్యూ, వ్యాధి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ సుష్మ, కార్పొరేటర్లు రామచందర్, జమాల్ పూర్ నవీన్, ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, పల్లపు రవి, నాయకులు మనోదర్‌రెడ్డి, శ్రీనాథ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్ప, ఆరోగ్య విస్తరణాధికారి షౌకత్ అలీ, మున్సిపల్ సిబ్బంది, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేషనల్ మార్ట్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

- అత్వెల్లి గ్రామస్తులు

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లి గ్రామస్తుల మనోభావాలను కించపరిచిన నేషనల్ మార్ట్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కమిషనర్ నాగిరెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ అత్వెల్లి గ్రామ పరిధిలోని జాతీయ రహదారి 44 పక్కన ఏర్పాటు చేసిన నేషనల్ మార్ట్ హైపర్ మార్కెట్ షాప్‌కు అత్వెల్లి గ్రామం పేరు పెట్టకుండా మేడ్చల్ పేరు పెట్టుకుని ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. అత్వెల్లిలో మార్ట్ ఏర్పాటుకు గ్రామ ఆస్తులను వినియోగించుకొని వ్యాపారం చేసుకుంటూ గ్రామం పేరు పెట్టకపోవడం శోచనీయమని అన్నారు. నేషనల్ మార్ట్ యజమాన్యానికి అత్వెల్లి పేరును ఉపయోగించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు వీరమల్ల మానస శ్రవణ్ గుప్తా, రొయ్యపల్లి సరిత మల్లేష్ గౌడ్, జాకట దేవ, జర్నలిస్టు మండల మురళీధర్ ఉన్నారు.

మేడ్చల్ ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు

నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ ఆర్టీసీ బస్ డిపో నుంచి తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలానికి వెళ్లేందుకు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్టు డిపో మేనేజర్ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మేడ్చల్ నుంచి గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలానికి సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యాన్ని ఈనెల 19వ తేదీన సాయంత్రం 7గంటల నుంచి ప్రారంభించనున్నట్టు పేర్కొన్నారు. టికెట్ ధర రూ.3900 ఉంటుందని ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లోతట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటన



నవతెలంగాణ-కాప్రా

నాచారం డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లో నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్‌శేఖర్ సోమవారం పర్యటించారు. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పోలీస్ స్టేషన్ వెనుక ఉన్న ప్రహరీ గోడ కూలిపోయింది. గోడ పక్కనే 12 ఏండ్లుగా వీఎస్టీ కాలనీకి చెందిన సుజాత తోపుడు బండి పెట్టుకుని పూలు అమ్ముతున్న బండిపై గోడ కూలి పడడంతో పూర్తిగా ధ్వంసమైంది. ఈ విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత మహిళతో మాట్లాడి కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని కొత్త తోపుడు బండి కొనిస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు ప్రతి ఏడాది బోనాల నిర్వహణకు ప్రభుత్వం ఇచ్చే చెక్కులను ఎమ్మెల్సీ మల్లేశం, నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయి జన్‌శేఖర్‌తో కలిసి పలు ఆలయ కమిటీ సభ్యులు అందజేశారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన అధికారులు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లో కొద్దిపాటి వర్షానికే రోడ్లు మొత్తం గుంతలుగా ఏర్పడి వాహనదారులు తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉప్పల్ ట్రాఫిక్ సీఐ లక్ష్మిమాధవి, ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు, ఈఈ నాగేందర్‌తో కలిసి రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరూ సమన్వయతో సమస్యల పరిష్కారం కోసం కృషి చేసి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

విద్యార్థి దశ నుంచే అన్ని రంగాల్లో రాణించాలి : జేఈవో



- భాష్యం స్కూల్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే

నవతెలంగాణ-బోడుప్పల్

విద్యార్థి దశ నుండే అన్ని రంగాల్లో రాణించాలని జేఈవో అంకమరావు అన్నారు. సోమవారం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని భాష్యం స్కూల్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అంకమరావు మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఇలాంటి కార్యక్రమలలో పాల్గొనడం వల్ల భయం తగ్గి ఏ కార్యక్రమమైనా విజయవంతం చేయగల నైపుణ్యాలు వస్తాయన్నారు. ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణ కుమారి మాట్లాడుతూ నూతనంగా చేరిన విద్యార్థులకు విద్య అనేది ఎంత విలువైన సంపదనో వివరించారు. అనంతరం వివిధ కార్యక్రమాల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

'డబుల్' ఇండ్లను కేటాయించాలి



- మేడ్చల్ కలెక్టర్ గౌతమ్‌కు నాగారం మున్సిపల్ చైర్మెన్ చంద్రారెడ్డి వినతి

నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ రాంపల్లి గ్రామంలోని సర్వే నెం. 258లో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లల్లో స్థానికులకు 10శాతం కేటాయించాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నందున కుల వృత్తులు చేసుకునే వారికి డబుల్ బెడ్‌ద్రూం ఇండ్లు కేటాయించాలని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి కులవృత్తులు చేసుకునేవారితో కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. గ్రామంలోని చాకలి, మంగళి, కుమ్మరి, కమ్మరి, వడ్డెర, మాల, మాదిగ, వడ్రంగి కుల వృత్తుల వారు వారి తాత ముత్తాతల కాలం నుంచి సర్వే నెం. 258లోని భూమిలో పంటలు వేసుకొని జీవనం కొనసాగించేవారని కలెక్టర్‌కు వివరించారు. ఆ భమి సాగు చేస్తున్నందుకు ప్రభుత్వానికి శిస్తు చెల్లించేవారని తెలిపారు. ఆ భూమిలో గత ప్రభుత్వం 2017లో డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మాణం చేసిందన్నారు. ఇండ్ల నిర్మాణ సమయంలో రాంపల్లిలోని పేదలకు, స్థానికులకు 10శాతం ఇండ్లు కేటాయిస్తామని మంత్రులు హామీ ఇచ్చారని కలెక్టర్‌కు తెలిపారు. కానీ ఇండ్లను స్థానికేతరులకు కేటాయించారని పేర్కొన్నారు. 'పని-పాటలోళ్ళు' (కులవృత్తిదారులు) హైకోర్టును ఆశ్రయిస్తే స్థానికులకు 10శాతం ఇండ్లు ఇవ్వాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 'పని-పాటలోళ్ళు'కు ఇండ్లను కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మునుగంటి సురేష్, మాజీ ఎంపీటీసీ తరిగొప్పుల బలరాం, నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు వేణు, అక్కల సురేష్ ,కిషోర్ గౌడ్ ,కులవృత్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమక్షంలో ఫారుఖ్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ - జవహర్‌నగర్

పాఠశాల విద్యార్థుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఫారుఖ్ అన్నారు. సోమవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కో ఆప్షన్ సభ్యులు, మల్కారం వ్యవస్థాపకులు మహమ్మద్ నూరుద్దీన్ ఫారుఖ్ జన్మదిన వేడుకలు మల్కారంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కను నాటారు. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో చర్లపల్లి విద్యార్థులకు కాంస్యం



నవతెలంగాణ-కాప్రా

రాష్ట్రస్థాయిలో జరిగిన తైక్వాండో పోటీల్లో చర్లపల్లి సిల్వర్ ఓపు బంగ్లాకు చెందిన విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి కాంస్య పతకాలు సాధించారు. అండర్ 24 కేజీ లెవెల్‌లో బబ్బురి ఆదిత్య, అశ్వత్ వర్మ అంబటి, అండర్ 50 కేజీ లెవెల్‌లో బబ్బురి లక్ష్మీ ప్రసన్న, మానస వర్మ అంబటి కాంస్య పతకాలు సాధించారు. అనంతరం వారికి నిర్వాకులు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు బబ్బురి బాలరాజ్ గౌడ్ దంపతులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన బండి రమేష్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం మొక్కను బహుకరించి శాలువాతో సీఎంను సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలు అభివృద్ధి పైన ఇరువురు నేతలు చర్చించారు. నియోజకవర్గం అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్ రెడ్డికి సూచించినట్లు రమేష్ పేర్కొన్నారు.

నరేందర్ రెడ్డిని కలిసిన బండి రమేష్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్ పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్ జన్మదినం సందర్భంగా సోమవారం ప్రభుత్వ సలహాదారులు నరేందర్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్‌ను ఆయన సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

జీవో నెంబర్ 10ని రద్దు చేయాలి



- ఎమ్మెల్యేకి వినతి పత్రం అందజేసిన అంగన్ వాడీ టీచర్లు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జీవో నెంబర్ 10 ని రద్దు చేయాలని అంగన్ వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కవిత కోరుతూ..సోమవారం శేరిలింగంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే అరికపూడి గాంధీని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టీచర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెన్షన్ పెంచుతూ వీఆర్ఎస్ సౌకర్యం కల్పించి, కొత్త జీవోలు ఇవ్వాలన్నారు. పాత పద్ధతిలోనే ప్రమోషన్ ఇవ్వాలన్నారు. 24 రోజుల సమ్మె సందర్భంగా హామీలన్నీటిని అమలు చేయాలన్నారు. ఆనాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు 24 రోజుల్లో నిరవధిక సమ్మె చేశామన్నారు. ఆనాటి ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు, ఐసీడీఎస్ మంత్రి సత్యవతి రాథోడ్‌లతో చర్చలు జరిగాయన్నారు. మంత్రులు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఐసీడీఎస్ మంత్రి, అధికారులకు యూనియన్ ఆధ్వర్యంలో అనేకసార్లు వినతి పత్రాలు ఇచ్చామని, అనేక ఆందోళన రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలలో చేసామన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మినీ టీచర్లను, మెయిన్ టీచర్లుగా చేస్తూ అప్గ్రేడ్ చేస్తూ జియోని విడుదల చేయడం జరిగిందన్నారు. అంగన్ వాడీ టీచర్ రిటైర్మెంట్‌కి లక్ష రూపాయలు, ఆయాకు రూ.50 వేలు వృద్ధాప్య పెన్షన్ మాత్రమే ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రాక ముందు మ్యానిఫెస్టోలో రూ.18 వేలు వేతనాలు పెంచుతామని, పిఎఫ్ సౌకర్యాలు కల్పిస్తామని హామీలు ఇవ్వడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాల హామీలు నెరవేర్చకపోగా వ్యతిరేక విధానాలను వేగవంతం చేయడం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ తీవ్ర ఆందోళన గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు కొంగరి కృష్ణ, రంగారెడ్డి జిల్లా అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్ యూనియన్ కార్యదర్శి కవిత, సీఐటీయూ జిల్లా నాయకులు సి.శోభన్, శేరిలింగంపల్లి సీఐటీయూ కార్యదర్శి కొంగరి కృష్ణ, జనప్రియ, టీచర్లు పాల్గొన్నారు.

మంచినీటి పైపులైన్ తక్షణమే వెయ్యాలి

- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్
- జలమండలి మేనేజర్‌కు సీపీఐ నేతల వినతి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దూం నగర్, పొలాలబస్తీలో కొన్ని వీధులలో మంచినీటి పైపులైను త్వరగా వేయాలని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమా మహేష్ కోరారు. ఈ మేరకు సోమవారం గాజుల రామారం సర్కిల్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో జలమండలి అధికారి ఝాన్సీకి సీపీఐ శ్రేణులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని గల్లీలలో మంచినీటి పైపులైన్ వేయలేదని, ఆ గల్లీ వాసులు ప్రధాన రహదారి పై ఉన్న పైపులైన్ నుంచి కనెక్షన్ తీసుకోవడం వల్ల నీళ్లు ఎక్కువగా రావట్లేదని వినతిలో వివరించారు. దానివల్ల గల్లీ వాసులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని తక్షణమే గల్లీలలో మంచినీటి పైప్ లైన్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు వంగాల శ్రీనివాస్, కృష్ణ, సీపీఐ నాయకులు ఇమామ్, ప్రభాకర్, శంకర్, అశోక్, వీరారెడ్డి పాల్గొన్నారు.

టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేతకు సన్మానం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

'కీర్తి రత్న ఉగాది పురస్కార్' అవార్డు గ్రహీత టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అధినేతను ఘనంగా సన్మానించారు. టి.కోటి రెడ్డి సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, విద్యా కుసుమంగా ఎదిగి ఉపాధ్యాయ వృత్తిని చేపట్టి 'అటామిక్ ఎనర్జీ సీబీఎస్ఈ' స్కూల్ నందు ఉపాధ్యాయుడుగా చేసి, 1989లో సత్యవాణి విద్యానికేతన్ ప్రారంభించారు. అబ్దుల్ కలాం వంటి వారి గొప్ప ఆశయాలను అనుకరిస్తూ విద్యావేత్త డాక్టర్.చుక్కా రామయ్యకి అత్యంత సన్నిహితంగా ఉంటూ 'ధర్మో రక్షతి రక్షితః' ధర్మాన్ని మనం కాపాడితే మనలని ధర్మం కాపాడుతుంది.. అనే సిద్ధాంతానికి కట్టుబడి, చిన్న పాఠశాల నుంచి పలు విద్యాసంస్థలు స్థాపించి, ఎంతో మంది ఉత్తమ విద్యార్థులను తీర్చిదిద్ది, వందలాది మంది ఉపాధ్యాయులకు ఇతర ఉద్యోగులకు ఉద్యోగ భృతిని కలిగిస్తు ఆదర్శమూర్తిగా టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టి కోటిరెడ్డి ఎదిగారు. అలాంటి వారికి తెలంగాణ ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయుడిగా, వారి యొక్క అత్యుత్తమ సేవలను గుర్తించి జూన్ 29న 'ఫెడరేషన్ ఆఫ్ ఎన్ఆర్ఐ తెలంగాణ అసోసియేషన్ మలేషియా' వారు చే 'కీర్తి రత్న ఉగాది పురస్కార్' అవార్డును ఆదర్శమూర్తి కోటిరెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా కోటిరెడ్డిని విద్యా సంస్థల ఉపాధ్యాయ బృందం వారిని సోమవారం ఘనంగా సన్మానించుకున్నారు. ఈ సందర్భంగా సెమ్స్ ఒలంపియాడ్ రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు మెడల్స్ గుర్తింపు పత్రాలు క్యాష్ అవార్డులు అందజేశారు.

యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యునిగా చంద్రకాంత్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

యుఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని 52 మందితో ఎన్నుకున్నారు. 18 మంది ఆఫీస్ బేరర్స్, 32 మంది కమిటీ సభ్యులుగా ఈ సమావేశాలలో ఎన్నుకున్నారు. యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడిగా తాటికొండ రవి, కార్యదర్శిగా తిరుపతిని, ఉపాధ్యక్షుడిగా బ్యాగ్యారి వెంకటేష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నికైన ఎం.చంద్రకాంత్ ఒక ప్రకటన విడుదల చేశారు. పది సంవత్సరాలు ఎస్ఎఫ్ఐలో పనిచేసి, కొన్ని అనివార్య కారణాలవల్ల ఎస్ఎఫ్ఐకి రాజీనామా చేసి, యూఎస్ఎఫ్ఐలో రావడం జరిగిందన్నారు. యుఎస్ఎఫ్ఐలోకి సాగతించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు. తన మీద ఎంతో నమ్మకంతో రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నుకోవడం జరిగిందని, ఆ నమ్మకంతో పూర్తి స్థాయిలో విద్యారంగ సమస్యల పరిష్కారానికై పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తానని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేసి, కార్పొరేట్ ధీటుగా ప్రభుత్వ స్కూళ్లను మెరుగుపరచాల్సిన బాధ్యత నూతన రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విద్యారంగాన్ని అభివృద్ధి చేసి, పేద మధ్యతరగతి విద్యార్థులకు పూర్తిస్థాయిలో విద్యను అందించే విధంగా నూతన రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. ఇప్పటికైనా కేంద్రంలో ఉన్న మోడీ ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను మానుకోవాలని లేనిపక్షంలో... రాబోయే రోజులలో మోడీని గద్దె దించే ఉద్యమాలు చేపడతామని పేర్కొన్నారు. పేద మధ్యతరగతి విద్యార్థు లకు విద్యను దూరం చేసే విధంగా మోడీ ప్రభుత్వం వివరిస్తుందని ఆరోపించారు. ఇలాంటి విద్యార్థి వ్యతిరేక విధానాలు మానుకొని విద్యార్థులకు పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్య అందే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ప్రతి ఒక్క విద్యార్థికి న్యాయమైన విద్య అందించాలని ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

పొదుపు మహిళా సమాఖ్యలకు గౌరవ వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్




నవతెలంగాణ-బాలానగర్

కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ మండల పరిధిలోని చెరబండరాజు నగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన పొదుపు మహిళ సమాఖ్య లీడర్ల సమావేశంలో సీఐటీయూ యూనియన్‌లో చేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ మాట్లాడుతూ మహిళ సమాఖ్య లీడర్‌లకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత 20సం॥గా పొదుపు సంఘాలు పెడుతూ వడ్డీలను వసూళ్లు చేసి జీహెచ్ఎంసీ ఇస్తున్నారు. ప్రతి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోతున్నారు. 20 సం॥ నుంచి రూపాయి లేకుండా వెట్టిచాకిరి చేస్తున్నారు. ప్రభుత్వాలు, జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి, తమకు గౌరవ వేతనాలు ఇస్తారని వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నారు. వారి ఆశలు నిరాశాలుగానే మిగిలాయని, మా శ్రమను గుర్తించి తక్షణమే మాకు గౌరవ వేతనం ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకురాలు ఏ. విజయ మహిళ సమాఖ్య లీడర్‌లు గణిక, దేవి, సంతోషి, స్వరూప, లావణ్య, ఆనంతలక్ష్మీ, సరస్వతి, యోగేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫర్ టెన్షన్..!

- ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆందోళన
- బదిలీ ఎక్కడికో అని గుబులు
- జిల్లా వ్యాప్తంగా ఇదే చర్చ
- ముగిసిన ఆప్షన్ల ప్రక్రియ



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీల బెంగ పట్టుకుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఉద్యోగులెవరిని కదిలించినా.. ఇదే మాట వినిపిస్తోంది. ఎవరెవరు సీనియర్లు, ఎక్కడికి బదిలీ అయ్యే అవకాశం ఉంది..? ఇతరత్రా విషయాలపైనే ప్రధానంగా చర్చించుకుంటున్నారు. ఎక్కడికి బదిలీ అవుతుందో అని పలువురు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బదిలీలపై ఉన్న నిషేధాన్ని ఎత్తేయడంతో ఉద్యోగులు ఆప్షన్లు ఇచ్చుకునే గడువు ఈ నెల 12వ తేదీతో ముగిసింది.

సాధారణ బదిలీలు జరిగి దాదాపు ఆరేండ్లు కావస్తోంది. ఉద్యోగుల బదిలీలు 40 శాతానికి మించి చేయవద్దని ప్రభుత్వం నిబంధనలు విధించింది. దీంతో జూనియర్ ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇప్పటికే పలు శాఖల్లో సీనియారిటీ జాబితాను ప్రకటించగా, మరికొన్ని శాఖల్లో ఒకటి, రెండు రోజుల్లో ప్రకటించే అవకాశం ఉంది. బదిలీ ఉంటుందా..? ఉండదా..? అని చర్చించుకుంటున్నారు. కొందరు ఉద్యోగులు జిల్లా ఆవిర్భావం నుంచి ఇక్కడే తిష్ట వేశారు. కొన్ని శాఖల్లో చిన్న స్థాయి నుంచి పెద్ద స్థాయి వరకు ఒకే ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న వారూ లేకపోలేదు. వీరందరికీ ఇప్పుడు స్థాన చలనం కలుగనుంది.

అటెండర్ నుంచి జిల్లా స్థాయి వరకు..

ఈ బదిలీలు నాలుగు స్థాయిల ఉద్యోగులకు జరగనున్నాయి. జిల్లా స్థాయిలో అటెండర్ నుంచి రికార్డు అసిస్టెంట్ టైపిస్టు, జూనియర్ అసిస్టెంట్లు బదిలీలు కానున్నారు. సీనియర్ అసిస్టెంట్లు, సూపరింటెండెంట్, డిప్యూటీ తహసీల్దార్లు, గ్రేడ్-1, 2, 3 పంచాయతీ కార్యదర్శులు, హెచ్ఐడబ్ల్యూవో, ఎంపీహెచ్ఎ (ఏఎన్ఎం), స్టాఫ్‌నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగులు ఈ బదిలీల్లో ఉండనున్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంపీవో, వ్యవసాయాధికారి, ఏఈలు, ఏఎస్‌డబ్ల్యూఓ, ఏటీఓ, మున్సిపల్ కమిషనర్లు, అసిస్టెంట్ సివిల్ సర్జన్లతో పాటు జిల్లా అధికారులు మల్టీజోన్ల పరిధిలో బదిలీలు కానున్నారు.

వీరికి బదిలీ తప్పనిసరి..

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ విభాగాల్లో వేల మంది ఉద్యోగులు ఉండగా.. అందులో గెజిటెడ్, నాన్ గెజిటెడ్, నాలుగో తరగతి ఉద్యోగులుఉన్నారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు కోరుకున్న చోటుకు ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశం కల్పించారు. నాలుగేండ్లు ఒకే చోట విధులు నిర్వర్తించిన వారికి బదిలీ తప్పనిసరి చేసింది. రెండేండ్లు సర్వీస్ పూర్తయిన వారు బదిలీ కోసం దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా ప్రకటించారు.

శాఖల వారీగా కమిటీలు

బదిలీలు నిర్వహించేందుకు ప్రతి శాఖలో ప్రత్యేకంగా కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. మల్టీజోన్, జోనల్ స్థాయి ఉద్యోగుల కోసం కమిషనర్, అదనపు కార్యదర్శి, జాయింట్ డైరెక్టర్లుగా సభ్యులుగా కమిటీ ఏర్పడనుంది. జిల్లా స్థాయికి కలెక్టర్, అదనపు కలెక్టర్, సంబంధిత శాఖ అధికారి సభ్యులుగా ఉండనున్నారు.



మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి..

గత ప్రభుత్వం అమలు చేసిన జీఓ 317 కారణంగా పలువురు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ కమిటీని నియమించింది. జీఓ 317తో జోన్, జిల్లా మారి ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల నుంచి ఆన్‌లైన్ ద్వారా వినతులను జూన్ 30వ తేదీ వరకు స్వీకరించారు. రెండేండ్ల నుంచి కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ విధులు నిర్వహిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత ప్రాంతం ఆధారంగా ఆయా జిల్లాలకు బదిలీలు చేపట్టి తర్వాత సాధారణ బదిలీలు చేయాలని జీవో 317 బాధితులు కోరుతున్నారు.

సంక్షేమ సంఘాలు అభివృద్ధికి వారధులు



- కార్పొరేటర్ రావుల శేషగిరి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సంక్షేమ సంఘాల సభ్యులు అభివృద్ధికి వారదులు గా పని చేయాలని గాజులరామారం డివిజన్ కార్పొరే టర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి సూచించారు. నూతనంగా ఏర్పాటైన న్యూ లాల్ బహదూర్ నగర్ సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం గాజులరామారం కార్పొరేటర్, రావుల శేషగిరి, తెలంగాణ దేవాలయ అర్చక, ఉద్యోగ సంఘాల అధ్యక్షులు గంధం కర్ణాకర్ నాయుడులను వారు కలిశారు. తన వంతు సహాయ సహకారాలు అందజేస్తామని నూతనంగా ఎన్నికైన సభ్యులకు కార్పొరేటర్ తెలిపారు. ఎన్ఎల్‌బి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్ గుప్తా, శ్రీనివాసరెడ్డి, కోశాధికారి బాలస్వామి గౌడ్, ఉపాధ్యక్షులు భరత్ మహేష్, కమిటీ సభ్యులు దుబాయ్ వెంకటేష్, యాదవ రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

రావుల రాఘవయ్యకు ఘనంగా నివాళ్ళులు...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ కార్పొరేటర్, గ్రేటర్ స్టాండింగ్ కమిటీ సభ్యులు రావుల శేషగిరి తండ్రి కీర్తిశేషులు రావుల రాఘవయ్య ఏడవ వర్ధంతి సందర్భంగా.. సోమవారం తన స్వగ్రామం నాగార్జునసాగర్ నియోజకవర్గం పెద్ద దేవులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విగ్రహ స్తూపం వద్ద ఆయనతోపాటు వారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి రావుల రాఘవయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఎంపీటీసీ అంబటి రాము, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు లక్ష్మయ్య, సోదరులు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రావుల వరప్రసాద్, సంఘ సేవకులు రావుల రాజు గ్రామస్తులు నివాళులు అర్పించారు.



పనిచేసిన వారికి కాంగ్రెస్‌లో పదవులు వస్తాయి



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కాంగ్రెస్‌లో పనిచేసిన వారికి విడుతల వారీగా పదవులు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం.నరేందర్ రెడ్డి అన్నారు. కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ సూచనలతో కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో.. ప్రభుత్వ సలహాదారులు వేం.నరేందర్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల గురించి ఆయనకు వివరించారు. అనంతరం కాంగ్రెస్ నాయకులతో వేం.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలను చూసి ఇతర పార్టీల చెందిన ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. ఇతర పార్టీ నేతలు చేరినంత మాత్రాన ఎప్పటి నుండో ఉన్న కాంగ్రెస్ నేతలకు పదవులు రావని అపోహ ఉండకూడదని ఈ సందర్భంగా తేల్చి చెప్పారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో నెలకొన్న సమస్యల గురించి సంబంధిత అధికారులకు సమాచారం అందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు ప్రభుత్వానికి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు వారధిగా ఉండి రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, తూము వేణు, సంజీవరావు, మేకల మైకల్, లక్ష్మణ్ వైస్ చైర్మెన్ మాజీ, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సునీల్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

'సిల్క్ ఆఫ్ ఇండియా హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్' పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

బెంగాల్ హ్యాండ్లూమ్ ఆర్ట్ ఆధ్వర్యంలో, సిల్క్ ఆఫ్ ఇండియా బై క్లాసిక్ మిసెస్ ఇండియా రత్న మెహెరాలి అధికారిక పోస్టర్‌ను ఆర్గనైజర్ సోమనాథ్, అభిజిత్, మోడల్స్‌తో కలిసి పోస్టర్‌ను సిల్వాన్ డ్రైవ్ ఇన్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోడళ్లు ఫ్యాషన్ వాక్‌తో ఆకట్టుకున్నారు. ' మన దేశానికి వస్త్ర ఉత్పత్తిలో సుదీర్ఘమైన, విశిష్టమైన చరిత్ర ఉంది. మన సాంస్కృతిక ఫాబ్రిక్‌లో చేనేత నేత ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉంది. మన కళాకారులు నేసిన ప్రతి దారం సంప్రదాయం, నైపుణ్యం, అంకితభావాన్ని చెబుతుంది. తరతరాలుగా ఈ పురాతన పద్ధతులను భద్రపరిచిన మన హస్తకళాకారుల శాశ్వత వారసత్వానికి ఇది నిదర్శనం. 50 మాస్టర్ వీవర్స్ నుంచి చేతితో నేసిన వస్త్రాలు, సాంప్రదాయ చేతిపనుల అసాధారణ ప్రదర్శనతో సందర్శకులను అబ్బురపరిచేలా ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్ శ్రీ సత్య నిగమాగమం, శ్రీనగర్ కాలనీలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు చేనేత కార్మికుల సుసంపన్నమైన వారసత్వం, క్లిష్టమైన హస్తకళను తెలియజేస్తూ నిర్వహిస్తున్నాం' అని రత్న మెహెరాలి అన్నారు. 'మా ప్రతిభావంతులైన నేత కార్మికులను ప్రోత్సహించడానికి, మద్దతు ఇవ్వడానికి ఉద్దేశించిన ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశాం. ఇక్కడ చేనేత వస్త్రాల అందం, ప్రాముఖ్యతను అభినందించడానికి, వారి వారసత్వం కొనసాగుతుందని నిర్ధారించుకోవడానికి సమాజానికి ఒక అవకాశం' అని అభిజిత్ అన్నారు.

చిన్నారులను అంగన్వాడీలో చేర్పించాలి



నవతెలంగాణ-దుండిగల్

ప్రతీ కుటుంబంలోని చిన్నారులను అంగ న్వాడీ కేంద్రంలో చేర్పించాలని స్థానిక కాన్సిలర్ కొల సాయి యాదవ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచం పల్లి పరిధిలోని 8వ వార్డులో సోమవారం అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట - అంగన్వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడారు. అంగన్వాడీ కేంద్రంలో ప్రతి చిన్నారుల పేరు నమోదు చేయాలని, తప్పకుండ పంపిచాలని వారికీ విద్య గురించి తెలుసుకునేందుకు దోహద పడుతుందని తెలిపారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాయి యాదవ్, అంగన్వాడీ టీచర్ ఎం.మీనాదేవి, వీఓ.సుకన్య ఏఎల్ఎంఎస్‌సి సభ్యులు, బస్తీ ధవాకాన మేడం, సిస్టర్, పిల్లలు, వారి తల్లులు పాల్గొన్నారు.

శ్రీ మల్లికార్జున స్వామి ఆలయాన్ని సందర్శించిన కార్పొరేటర్ దంపతులు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు జన్మదినం సందర్భంగా.. పగుడాల శిరీష బాబురావు దంపతులు సోమవారం శ్రీ శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారిని దర్శించుకొని, ఏక వార రుద్రాభిషేకం, స్పర్శ దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామి వారి అనుగ్రహం పొందారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సిహెచ్. ప్రభాకర్ గౌడ్, శ్రీనివాస్ రావు, ఉమాకాంత్, అశోక్ రెడ్డి, భాస్కర్ రావు, సుశీల్ కుమార్, సంతు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దేవాలయంలో ముగిసిన వారాహి నవ రాత్రులు



నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కనక దుర్గ ఆలయంలో గత వారం రోజులుగా ప్రత్యేక పూజలు అందుకుంటున్న ఆషాడమాస వారాహి నవరాత్రులు ముగిశాయి. చివరి రోజు పూజలో భాగంగా ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్ రెడ్డి శ్రీ కనక దుర్గమ్మ అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనుగ్రహం పొంది నవ రాత్రులను ఎలాంటి ఆటంకం లేకుండా విజయ వంతంగా పూర్తి చేయడం జరిగిందన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
మంగళవారం | జూలై 16, 2024 | www.navatelangana.com

బోనాల చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఆషాఢమాస బోనాల సందర్భంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఆలయాల కమిటీలకు బోనాల ఉత్సవాల చెక్కులను రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మిలు శ్రీనగర్ కాలనీ లోని వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రహ్మత్ నగర్ కార్పొరేటర్లు సి.ఎన్. రెడ్డి, వనం సంగీత, కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ సతిమణి హబీబా సుల్తాన, మమతా గుప్త, ఖైరతాబాదు ఎమ్మార్వో నయీముద్దీన్, జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి మొహమ్మద్ అజరుద్దీన్, కిరణ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాకాగూడాలో పర్యటించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కంటోన్మెంట్

బస్తీ పర్యటనలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సోమవారం కాకాగూడ అప్ బస్తీలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలువలు, మంచి నీటి సమస్యలు స్థానికులు చేప్పగా సత్వరమే సమస్య పరిష్కారి స్తామని స్థానికుల కు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం మహి ళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలందరూ ఆశీర్వదించి తనకు సహకరించి గెలిపించారని.. వారికి కతజ్ఞతలు చెప్పారు. కార్యక్రమంలో శ్యామల, తిరుమల, రజిని, పద్మరేపల్లె వెంకటేశ్వర్లు, బస్తీ మహిళలు పాల్గొన్నారు.





బీఆర్ఎస్‌వీ నేతల అరెస్ట్

- అక్రమ అరెస్టులతో విద్యార్థుల ఉద్యమాన్ని ఆపలేరు : బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు

నవతెలంగాణ-ఓయూ

ఈ నెల 8 నుంచి 11వరకు న్యూ ఢిల్లీ ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన జాతీయ స్థాయి ఇంటర్ సాయి ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన భాష్యం ఉన్నత పాఠశాల సంతోష్ నగర్ శాఖ విద్యార్థి షైక్ అఫ్తాబ్ పాల్గొని తన సామర్థ్యాన్ని కనపరిచి జయకేతనం ఎగుర వేశాడు. ఒక స్వర్ణపతకం, ఒక రజత పతకం, రెండు కాంస్య పతకాలు కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ప్రోత్సాహకాలు తనను ముందుకు నడిపించాయన్నారు. భాష్యం విద్యా సంస్థలు ఎల్లప్పుడూ విద్యార్థుల ఉన్నతికి కృషి చేస్తుందని పాఠశాల జెడ్ఈఓ అంకమ్మ రావు తెలిపారు. ప్రతిభ గల విద్యార్థులను గుర్తించి ప్రోత్సహించేందుకు తాము తమ ఉపాధ్యాయులు ఎల్లప్పుడు ముందుంటామని, షైక్ అఫ్తాబ్‌ను చూసి గర్విస్తున్నామని పాఠశాల ప్రధానో పాధ్యాయులు దేవదాసు అన్నారు. విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా భాష్యంలో ఫ్రెషర్స్ డే



నవతెలంగాణ-సంతోష్‌నగర్

చంపాపేట్ డివిజన్ కర్మన్ ఘట్‌లోని వంగ శంకరమ్మ గార్డెన్ లో భాష్యం ఉన్నత పాఠశాల సంతోష్‌నగర్ శాఖ విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలో చేరిన నూతన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. విద్యార్థులతో మమేకమైనా ఉపాధ్యాయులు కూడా సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన భాష్యం ఉన్నత పాఠశాల జెడ్ఈఓ అంకమ్మరావు మాట్లాడుతూ తమ భాష్యం విద్యా సంస్థలు విద్యార్థులను ఉన్నత విద్యతో పాటు ఆటపాట, సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా భాగస్వామ్యం చేసి విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసానికి పెద్దపీట వేస్తున్నామని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో స్థానికంగా అత్యద్భుతమైన రీతిలో ఉత్తీర్ణత సాధించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో పాధ్యాయులు దేవదాస్ ,ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్వాడ్ రెస్టారెంట్ అండ్ స్వాడ్ మినీ థియేటర్ ప్రారంభోత్సవం



నవతెలంగాణ-వనస్థలిపురం

బి.యస్.రెడ్డి నగర్ డివిజన్ వైదేహి నగర్‌లో నూతన స్వాడ్ రెస్టారెంట్, మండి హౌస్ అండ్ స్వాడ్ మినీ థియేటర్‌ను బి.యస్ రెడ్డి నగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలకు నాణ్యత, రుచికరమైన ఆహారం అందించే విధంగా చూడాలని సూచించారు. ప్రజల మనలను పొందినప్పుడే వ్యాపారం దిన దినాభివృద్ధి చెందుతుందని చెప్పారు. రెస్టారెంట్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన అతిథులను రెస్టారెంట్ యజమాన్యం శాలువాలతో సన్మానించారు. కార్యక్రమానికి విచ్చేసిన కాలనీవాసులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యజమానులు శ్రీశైలం, నజీర్, వెంకట్ రెడ్డి, తులసి రావు, కాలనీ అధ్యక్షులు దామోదర్ రెడ్డి, కాలనీ సభ్యులు నరసింహా రెడ్డి, కోటేశ్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, డివిజన్ కార్యవర్గ సభ్యులు మహేందర్ రెడ్డి, నాయకులు ముత్యాలు, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

'మధ్యాహ్న భోజనం' అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకు ఇవ్వొద్దు



నవతెలంగాణ-హాయత్‌నగర్

అక్షయపాత్ర స్వచ్ఛంద సంస్థకు మధ్యాహ్న భోజనం పథకాన్ని ఇవ్వొద్దని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ అన్నారు. సోమవారం హాయత్‌నగర్‌లోని అంబెడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో హయత్ నగర్, అబ్దుల్లాపూర్ మెట్ మండలాల మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకాన్ని తీసుకొచ్చినప్పుడు, వంట చేసే వాళ్ళకు ఎటువంటి బడ్జెట్ లేకుండా, వేతనం లేకుండా, స్కూల్ పిల్లలకి వండి పెట్టాలని అన్నప్పుడు గ్రామాలలో డ్వాక్రా గ్రూపుల నుంచి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎటువంటి లాభాన్ని ఆశించకుండా వండి పెడతామని ఒప్పుకొని దాదాపు 23 సంవత్సరాలుగా వంట చేసి పెడుతున్నారని తెలిపారు. వీరిని ఇప్పటి ప్రభుత్వం తొలగించి స్వచ్ఛంద సంస్థలైన అక్షయపాత్రకి ఇవ్వాలని కుట్ర చేస్తున్నదన్నారు. కార్మికులు కాకుండా స్వచ్ఛంద సంస్థలకు ఇస్తే ఊరుకునేలేదని, ఎంతటికైనా తెగించి పోరాటం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నవనీత, మంజుల, స్వరూప, లక్ష్మమ్మ రమాదేవి రంగమ్మ నిర్మలమ్మ రాజమణి, రాములమ్మ వెంకటమ్మ, మంగమ్మ ,వనజ పాల్గొన్నారు.

ఆరోగ్యాలకు ముప్పుగా నాగోల్ డివిజన్..!

- పేరుకుపోతున్న చెత్త కుప్పలు









నవతెలంగాణ-నాగోల్

నాగోలు డివిజన్‌లోని పలు కాలనీలలో రోడ్లపై చెత్తకుప్పలు డంపు యార్డులు గా మారుతున్నాయి. ఏరోజుకా రోజు సకాలంలో చెత్త తరలింపుకు నోచుకోక పోవడంతో తమ ఆరోగ్యాలకు ముప్పుగా మారుతున్నాయని నాగోలు డివిజన్ ప్రజ లు ఆందోళన చెందుతున్నారు. డివిజన్ లోని జయపూర్ కాలనీ, సాయి నగర్, నాగోల్ గ్రామం, మమతా నగర్ తదితర కాలనీలలో కొంతమంది ఇండ్లల్లో మిగిలి పోయిన ఆహార పదార్థాలను, ఇతర పనికిరాని వస్తువులను సంచులలో నింపి రోడ్లపై అక్కడక్కడ వేయడంతో అవి కుప్పలు తెప్పలుగా మారుతున్నాయి. పేరుకుపోయిన చెత్తకుప్పల పై పందులు, కుక్కలు, పశువులు స్వైర్య విహారం చేస్తూ చెత్తను చెల్లా చెదురు చేస్తూ రోడ్లపైకి తెస్తున్నాయి. దీంతో రోడ్లపై చెత్త పై నుంచి వాహనాల రాకపోకలు సాగడంతో అవి మరింత కుళ్లి దుర్గంధమైన దుర్వాసన వెదజల్లుతోంది. దాంతో ఈగలు, దోమలు పుట్టగొడుగుల పుట్టుకొస్తున్నాయి.

జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో డివిజన్‌లోని ప్రతి కాలనీలో తిరుగుతూ చెత్తను సేకరించాలని ప్రత్యేక ఆటోలను ఏర్పాటు చేసినా కొంతమంది డబ్బులు చెల్లించకుండా చెత్తను కవర్లలో కట్టుకొని ఆయా కాలనీలలో వేయడంతో అక్కడక్కడ చెత్త కుప్పలు వెలుస్తున్నాయి.

వర్షాలతో చెత్త మరింత కుళ్లిపోయి దుర్వాసన..

నాగోల్ డివిజన్‌లో చెత్తకుప్పలు పెరిగిపోతున్నా వాటి గురించి పట్టించుకునే వారే కరువయ్యారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. దీంతో డివిజన్‌లో పెరిగిపోతున్న చెత్త కుప్పలను సంబంధిత సిబ్బంది ఎప్పటికప్పుడు తరలించక పోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు అవి మరింతగా కుళ్లిపోయి దుర్వా సన వెదజల్లుతున్నాయి. అటు వైపుగా వెళ్లాలంటే జనం జంకుతు న్నారు. సకాలంలో తరలింపునకు నోచుకోక పేరుకుపోతున్న చెత్తతో దుర్వాసనతో పాటు విపరీత మైన ఈగలు, దోమలు పుట్టుకొస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. దీంతో తాము డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా తదితర వ్యాధుల బారిన పడే ప్రమాదం లేకపోలే దని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు వర్షాకాలన్ని దృష్టిలో పెట్టుకొని చెత్త కుప్పలను ఎప్పటికప్పుడు తలలించాలని, డివిజన్‌లో ప్రతి కాలనీ సంక్షేమ సంఘాల ద్వారా ఇంటి ముందరకే వచ్చే ఆటోలకు తప్ప ఎక్కడ కూడా చెత్తను వేయకుండా పరిశుభ్రతకు సహకరించాలని కాలనీల ప్రజలకు అవగాహన కల్పించి వారి ఆరోగ్యాలను కాపాడాలని నాగోలు డివిజన్ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ చెత్త కుప్పల సమస్యపై శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి స్పందిస్తూ నాగోలు డివిజన్‌లో చెత్తను తరలిం చేందుకు ఆరు టిప్పర్ వాహనాలు ఉన్నాయని తెలిపారు. జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు చెత్తను తరలిస్తున్నామని, ఎక్కడైనా మిగిలిపోయి ఉంటే తమ దృష్టికి తెస్తే తప్పకుండా తరలిస్తామని చెప్పారు. కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని చెత్త తరలింపులో ఎక్కడా నిర్లక్ష్య వైఖరి అవలంభించొద్దని సిబ్బందిని కూడా ఆదేశించి నట్టు తెలిపారు. డివిజన్ ప్రజలు కూడా తమ ఇండ్లలోని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ఇంటి ముందరకు వచ్చే ఆటో వాహనాలకు వేసి డివిజన్ పరిశుభ్రతకు సహకరించాలని ఆయన కోరారు.

ప్రణాళిక లోపంతో కాలనీలో మరిన్ని సమస్యలు

- రోడ్డులు తవ్వి వదిలెయ్యడంతో పలు ఇబ్బందులు



నవతెలంగాణ-హస్తినాపురం

అభివృద్ధి పేరిట హస్తినాపురం డివిజన్ పరిధిలోని డి.ఆర్.డి.ఎల్. కాలనీలో చేపడుతున్న నిర్మాణ పనులలో నిర్లక్ష్యం వహించడం వల్ల, డ్రయినేజీ పైప్ లైన్ పగిలి పోవడంతో ట్రంక్ లైన్‌కు కలపవలసిన డ్రయినేజీ లైన్ ను కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పాత లైన్‌కు కల్పడంతో సమస్యలు తలెత్తాయని డి.ఆర్.డి.ఎల్. కాలనీ సంక్షేమ సంఘం కార్యదర్శి ఎన్. కరుణాకర్ రెడ్డి అన్నారు. సోమ వారం వారు మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారులు అల సత్వం వహించడం మూలంగా కాలనీ రోడ్లన్ని అధ్వాన్నం గా మారాయని, కాంట్రాక్టర్ కాలనీ రోడ్లను తవ్వి భారీ అండర్ గ్రౌండ్ పైప్ లైన్ వేసి రోడ్ల నిర్మాణాలను తిరిగి చేపట్టక పోవడంతో వర్ష కాల నేపథ్యంలో కాలనీ వాసుల రాకపోకలకు తీవ్ర ఇబ్బంధులు పడుతున్నారని తెలిపారు. ఎలాంటి నిర్దిష్ట ప్రణాళిక లేకుండా ఇష్టానుసారంగా కాంట్రాక్టర్ రోడ్లన్నీ తవ్వి వదిలేయడం దుర్మార్గమైన చర్య అని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనులు పనులు ప్రారంభించే ముందు కాలనీ ప్రతి నిధులకు ముందస్తు సమాచారం ఇచ్చి ఉంటే ఇలాంటి దుస్థితి వచ్చేది కాదన్నారు. సంబంధిత అధికారులు కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనం ఇలాంటి ఘటనలు అని వారు దుయ్య బట్టారు. అగ్రికల్చర్ కాలనీ నుంచి డి.ఆర్.డి.ఎల్ కాలనీ రోడ్ నెం.2 వరకు వేసిన భారీ పైప్ లైన్ ఇక్కడి నుంచి ఎటు మరలించాలనే సంధిగ్ధంలో అదికారులున్నారని, ప్రణాళిక లోపంతోనే మరిన్ని సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటికైనా అభివృద్ధి పనుల విషయం లో నిర్దిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని, ఇప్పటికైనా ప్రభుత్వ ఉన్నతాధికారులు కలుగజేసుకొని సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కరుణాకర్ రెడ్డి తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తులను పరిష్కరించాలి

- ప్రజావాణిలో 150 దరఖాస్తులు స్వీకరణ
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన దరఖాస్తుల ను త్వరగా పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 150 మంది దరఖాస్తు చేసుకున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 150 అర్జీలు రాగా గృహ నిర్మాణ శాఖకు 122, హైదరాబాద్ పెన్షన్08, భూ సమస్యలకు సంబంధించినవి 09 ఇతర శాఖలకు సంబంధించినవి 11 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వెంట వెంటనే పరిష్కారం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కదిరి వన్, అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటాచారి, ఆర్డీవోలు మహిపాల్, దశరథ్ సింగ్, జిల్లా అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఏదైనా ఐపసీఈతోనే ఫలితం సాధ్యం

- చైర్మెన్ వినయ్ కుమార్ రెడ్డి
- కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో ఐపసీఈ సంస్థ విజయకేతనం



నవతెలంగాణ-చైతన్యపురి

పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగాన్వేషణలో ఉన్న విద్యార్థులకు ఐపసీఈ సంస్థ దిక్సూచిగా నిలుస్తున్నదని, పరీక్ష ఏదైనా ఫలితం ఐపసీఈతోనే సాధ్యం అని సంస్థ చైర్మెన్ వినయ్ కుమార్ రెడ్డి అన్నారు. ఐపసీఈ సంస్థల విజయోత్సవ వేడుకలు శ్రీ సత్యసాయి మండపంలో వేలాది మంది విద్యార్థుల సమక్షంలో కన్నుల పండుగగా జరిగింది. ముఖ్య అతిథులుగా సంస్థ చైర్మెన్ వినయ్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాసరావులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. వినయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పరీక్ష ఏదైనా ఫలితం ఐపసీఈతోనే సాధ్యమని తమ విద్యార్థులు నిరూపించారన్నారు. ఉద్యోగ సాధనలో విద్యార్థులు వేసే ప్రతి అడుగులో చివరి వరకు సంస్థ తోడుగా ఉంటూ ప్రోత్సహిస్తుందని తెలిపారు. సంస్థ డైరెక్టర్ శ్రీనివాస్ మాటాడుతూ తమ బ్రాంచ్‌లు అమీర్ పేట, కేపీహెచ్‌బీ విద్యార్థులు సాధించిన పలు ప్రభుత్వ ఉద్యోగాలు ఎంతో సంతోషాన్నిచ్చాయని తెలిపారు. రానున్న రోజుల్లోనూ రైల్వే, ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్, వంటి రంగాలలో వేలాది ఉద్యోగాలకు నోటిఫికేషన్లు రానున్నాయని విద్యార్థులు శిక్షణ పొంది ఈ ఉద్యోగాలు సాధించవచ్చు అని తెలిపారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఉద్యోగాలు సాధించిన తమ పిల్లలు ఈ వేదికగా తల్లిదండ్రులను సత్కరించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని ,కొద్దిపాటి ఫీజులతోనే జాబ్ వచ్చేంతవరకు శిక్షణ ఇవ్వడం అన్నది ఐపసీఈకే సాధ్యమని కొనియాడారు. ఉన్నత ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను చైర్మెన్ ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో టీచింగ్ , నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్



నవతెలంగాణ-వనస్థలిపురం

కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రమోహన్ డిమాండ్ చేశారు. వనస్థలిపురం భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జనరల్ బాడీ సమావేశం ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథులుగా ఎం చంద్రమోహన్ హాజరై మాట్లాడుతూ 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం, 1996 భవన, ఇతర నిర్మాణ కార్మికుల సమగ్ర కేంద్ర చట్టాలను రక్షించాలని, వాటిని పకడ్బందీగా అమలు చేయాలని కోరారు. కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ కనీస వేతనం రూ. 26,000/-లు, కనీస పెన్షన్ రూ. 10,000/-లు ఇవ్వాలన్నారు. ఆఫీస్ సుందరీకరణ ఆధునీకరణ పేరుతో బోర్డు నిధులు దుర్వినియోగం చేయరాదని, భవన నిర్మాణంలో వాడే ఇసుక, ఇటుక, సిమెంట్, స్టీల్, పెయింట్ వంటి ముడి సరుకుల ధరలను నియంత్రించాలన్నారు. సెస్సు నిధులను సమర్ధవతంగా వసూలు చేయాలని, కొత్త సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు. వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని కార్మిక సంఘాల ప్రతినిధులతో నియమించాలని, గుర్తింపు కార్డులు, రేషన్ కార్డులు ఇవ్వాలని, వెల్ఫేర్ బోర్డు నుండి అక్రమంగా దారి మళ్ళించిన రూ.1, 005 కోట్లను తిరిగి బోర్డులో జమ చేయాలని, ఉమ్మడి రాష్ట్రం నుండి రావాల్సిన తెలంగాణ వాటా రూ 450 కోట్లు జమ చేయాలని, వెల్ఫేర్ బోర్డులో పేరు నమోదుకు రేషన్ కార్డులో పేరు తప్పకుండా ఉండాలనే నిబంధనను ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షులుగా ఆలేటి ఎల్లయ్య, ఉపాధ్యక్షులుగా బూసరాజు కాశయ్య, కుశనపల్లి వీరన్న, కుక్కమూడి వెంకటయ్య, కార్యదర్శి పొట్టిపాక రామస్వామి, కోశాధికారి సంసాన్, సహాయ కార్యదర్శిలు చుక్క రాములు, ఐతరాజు అంజయ్య, బాపనపల్లి నాగరాజు, ఆర్గనైజర్ అంజి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆటోల హాజరుపై దృష్టి పెట్టాలి

- కమిషనర్ ఆమ్రపాలి కాట



నవతెలంగాణ-సిటీబ్యూరో

స్వచ్ఛ ఆటోల హాజరుపై దృష్టి పెట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట అధికారులను ఆదేశించారు. సోమవారం అడిషనల్, జోనల్ కమిషనర్లు, ఎంటమాలజీ చీఫ్‌లతో ఆమె టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తరచు విధులకు హాజరు కాని స్వచ్ఛ ఆటోల వివరాలు సేకరించి వారి పై తగిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్‌లను ఆదేశించారు. కమర్షియల్ ప్రాంతాల్లో స్వచ్ఛ ఆటోలు రాత్రి సమయంలోనే చెత్త సేకరించాలని తెలిపారు. సినిమా థియేటర్లలో పార్కింగ్ రేట్లపై పరిశీలన చేయాలని అడిషనల్ కమిషనర్ యూ.సీ.డీకి తెలిపారు. అక్రమ భవన నిర్మాణాలపై ఫోకస్ పెట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్‌లో శానిటేషన్‌ను రోల్ మోడల్‌గా చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద పెద్ద సంపుల నిర్మాణాలను చేపట్టేందుకు టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధి ప్రబలిన వ్యక్తుల సమాచారం రోజు వారీగా జోన్ల నుండి మధ్యాహ్నం వరకు హెడ్ ఆఫీస్ కు తప్పని సరిగా పంపాలని తెలిపారు.

28న వధూవరుల వివాహ పరిచయ వేదిక

నవతెలంగాణ-హిమాయత్ నగర్

వీరశైవ లింగాయత్, జంగమ మహేశ్వర వధూవరుల వివాహ పరిచయ వేదికను విశ్వ లింగాయత్ మ్యారేజ్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 28న మలక్ పేట్ లోని శుభకరి ఏసీ ఫంక్షన్ హాల్ (డీ-మార్ట్ పక్కన) నిర్వహించ నున్నట్లు మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు పసారం శ్రీనివాస్ సోమవారం తెలిపారు. ఈ వివాహ పరిచయ వేదిక గత 20 ఏండ్లుగా తెలంగాణ, ఏపీ, కర్ణాటక రాష్ట్రాలలో నిర్వహి స్తున్నామని చెప్పారు. వివాహం కావలసిన వీరశైవ లింగా యత్, జంగమ మహేశ్వర వధూవరులు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ వేదికలో వివాహం కావల సిన వీరశైవ లింగాయత్, జంగమ మహేశ్వరుల కమ్యూనిటీలోని డాక్టర్లు, ఇంజనీర్స్, పీజీ, విదేశీ సంబ ంధాలు అన్వేషించే వారితో పాటు అన్ని విద్యార్హతలు ఉన్న వారు, రెండవ మ్యారేజ్ చేసుకునే వారు కూడా ఈ వివాహ పరిచయ వేదికలో పాల్గొనవచ్చునని తెలిపారు.

గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సిత్ల పండుగ



- మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతిరూపంగా భావించి సిత్లా పండుగ ఉత్సవాలను ఎంతో ఘనంగా జరుపుకోవడం జరుగుతుందని బడంగ్ పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు.ఆదివారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని అల్మాస్ గూడ పరిధిలో ఉన్న తిరుమల నగర్ కాలనీలో బంజారా సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ తల్లి దేవాలయం వద్ద జరిగిన సిత్ల పండుగలో స్థానిక కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి, గిరిజన సంక్షేమ సంఘం నాయకులతో కలిసి మేయర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, నాయకులు నవ్వారు మల్లారెడ్డి, ఎదుల్ల ప్రతాప్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామిడి కృష్ణ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, వెంకటేష్ గౌడ్, వినోద్ నాయక్, ధన్సిన్ నాయక్, రమేష్ చౌహాన్, బాలాజీ, రవిసింగ్ నాయక్, గిరిజన సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ జై ధన్సింగ్ నాయక్, జనరల్ సెక్రెటరీ ఏ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలతో ముస్లిం మైనార్టీలకు తీవ్ర అన్యాయం

నవతెలంగాణ-ధూల్‌పేట్

కేంద్ర ప్రభుత్వం ఇటీవల కొత్తగా తీసుకువచ్చిన క్రిమినల్ చట్టాల వల్ల బడుగు, బలహీన వర్గాలకు ముఖ్యంగా మైనార్టీలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశముందని మూవ్మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ అభిప్రాయపడ్డారు. దారుల్ షిఫా కార్యా లయంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ.. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్ల మెంట్‌లో ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఎంపీలను కుట్ర పూరితంగా సస్పెండ్ చేసి హడావిడిగా క్రిమినల్ చట్టాలకు సంబంధించిన మూడు బిల్లులను ప్రవేశపెట్టిందన్నారు. ఆ చట్టాలు ప్రస్తుతం అమలులోకి వచ్చాయని, దీంతో వెనుకబడిన ప్రజల అన్యాయం జరుగుతుంద న్నారు. ఈ చట్టాల వల్ల సమాజంపై పడే వినాశకర ప్రభావం పట్ల ప్రముఖ న్యాయ వాదులు, మేధావులు, సామాజిక కార్యకర్త లు ఆందోళన వ్యక్తపరిచారని గుర్తు చేశారు. వారిపై ఆధారపడిన కుటుంబీ కులకు పూట గడవటమే కష్టంగా ఉందన్నారు. ప్రభుత్వం ఈ కొత్త చట్టాలపై పునః పరిశీలన చేసి, సముచితమైన సవరణలతో వాటిని తిరిగి పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

రోడ్లను ఆక్రమిస్తే కఠిన చర్యలు



నవతెలంగాణ-చైతన్యపురి

రోడ్డును ఆక్రమించి పాదాచారులకు ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎల్బీనగర్ ఏసీపీ కృష్ణయ్య అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ దిల్‌సుఖ్‌నగర్‌లోని కోణార్క్ థియేటర్ లైన్, సాయిబాబా టెంపుల్ లైన్‌లో అక్రమంగా రోడ్డున ఆక్రమించి వ్యాపారం నిర్వహిస్తున్న పండ్ల విక్రయదారులు, షాపులను తీయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి , డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ యాదిగిరి, ఎస్ఐ మారయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ కాఫీ గుండెకు ఎంతో మేలు..

ఉదయం లేవగానే గొంతులో కాఫీ పడనిదే బెడ్ కూడా దిగరు చాలా మంది. ఎక్కువ మంది టీ కంటే కాఫీనే ఇష్ట పడతారు. సరైన మోతాదులో తాగితే కాఫీతో ఎన్నో రకాల ఉపయోగాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజూ కాఫీ తాగడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిదని పలు అధ్యయనాలు చెబు తున్నాయి.



బ్లాక్ కాఫీలో ఎన్నో రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. కాబట్టి ఒత్తిడి, ఆందోళన వంటివి దరి చేరకుండా ఉంటాయి. ఒత్తిడిగా అనిపించినప్పుడు, టెన్షన్‌గా ఉన్నప్పుడు ఒక కప్పు బ్లాక్ కాఫీని తీసుకుంటే చాలా మంచిది. కాఫీ తాగితే కేంద్ర నాడీ వ్యవస్థ యాక్టీవ్ అవు తుంది. దీంతో రీఫ్రెష్‌గా ఉంటుంది.

బ్లాక్ కాఫీ.. లివర్ ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో హెల్ప్ చేస్తుంది. ఫ్యాటీ లివర్, హైపటైటిస్, కాలేయ క్యాన్సర్, ఆల్కహాలిక్ సిర్రోసిస్ ప్రమాదాన్ని కూడా నివారిస్తుంది. బ్లాక్ కాఫీ తాగడం వల్ల పొట్ట ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. చక్కెర లేని కాఫీ శరీరంలో ఉండే టాక్సిన్స్, బ్యాక్టీరియాను సులభంగా బయటకు పంపిస్తుంది.

జ్యూరీ మెంబర్‌గా మొదటి మహిళ



బిల్కిస్ మీర్... కాశ్మీరీ వాటర్ స్పోర్ట్స్ అథ్లెట్. ఎన్నో పోరాటాలు చేసి గొప్ప అనుభవమున్న క్రీడాకారిణిగా, కోచ్ గుర్తింపు తెచ్చుకుంది. కాశ్మీర్ లోయ నుండి మొదటి మహిళా వాటర్ స్పోర్ట్స్ అథ్లెట్‌గా చరిత్ర సృష్టించింది. ఇప్పుడు చరిత్ర పుటల్లో తన పేరు లిఖించుకునేందుకు మరో పేజీని సిద్ధం చేసుకుంది. జూలై 26 నుండి ఆగస్టు 11 వరకు పారిస్‌లో జరగనున్న సమ్మర్ ఒలింపిక్స్‌కు ఆమె జ్యూరీ మెంబర్‌గా ఎంపికయ్యారు. దాంతో ఈ ఒలింపిక్స్‌కు జ్యూరీ మెంబర్‌గా వ్యవహరించే మొదటి భారతీయ మహిళగా నిలిచిన ఆమె పరిచయం నేటి మానవిలో...



'నేను చాలా సంతోషంగా ఉన్నాను. కానీ ఎంతో కష్టపడి ఇక్కడికి చేరుకున్నాను. ఇప్పుడు నేను పోషించబోయే పాత్ర అంత్యంత బాధ్యతతో కూడుకున్నది. పోటీల్లో నాయాన్యాయాలను బేరీజు వేయడం అంటే అంత తేలికైన విషయం కాదు. అయితే నా దేశానికి నేను ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు గర్వపడుతున్నాను. ఓ అథ్లెట్‌గా ఒలింపిక్స్‌లో ఆడాలనే నా కలను నేను నెరవేర్చుకోలేకపోయాను. కానీ ఇప్పుడు న్యాయనిర్ణేతగా ఉండబోతున్నాను' అంటూ మీర్ తన ఆనందాన్ని పంచుకుంది.

అపచారంగా భావించేవారు

పాఠశాల నుండి తడి బట్టలతో ఇంటికి తిరిగి వస్తుండగా చుట్టుపక్కల వారి నుండి ఎన్నో అవమానాలు ఎదుర్కొంది. అప్పట్లో ఆడపిల్లలు క్రీడల్లో పాల్గొనడం అపచారంగా భావించే సమాజం వారిది. అందుకే తల్లిదండ్రులు ఆమెను తిట్టారు. అవేవీ ఆమె లెక్క చేయలేదు. వాటర్ స్పోర్ట్స్ క్లాసులకు హాజరు కావడానికి పాఠశాలను సైతం కోల్పోతుంది. తాను ఏం చేయాలనుకుంటుందో దానికే కట్టుబడి ఉంది. ఇక ఆమె ఆగలేదు. 1997లో దేశవాళీ టోర్నీలో పాల్గొని పతకం సాధించింది. 'మహిళల పోరాటం వారి ఇంటి గుమ్మం నుండే ప్రారంభమవుతుంది. నా తల్లిదండ్రులు సంతోషంగా ఉన్నారు, కానీ చాలా కోపంగా ఉన్నారు' ఆమె జతచేస్తుంది.

ప్రధాన కోచ్‌గా

2009లో హంగేరిలోని స్జెడ్‌లో కయాకింగ్, కానోయింగ్‌లో జరిగిన ఐసీఎఫ్ స్ప్రింట్ రేసింగ్ ప్రపంచ కప్‌లో పోటీ పడింది. 2007, 2008లో ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో కూడా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించింది. 2007 నుండి ఇండియన్ క్యాంప్‌లో మీర్ కోచింగ్ ప్రారంభించింది. ఒక్క ఏడాదిలోనే దేశంలోని వివిధ ప్రాంతాల్లో కానోయింగ్, కయాకింగ్ శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆమె 2013 వరకు కోచింగ్‌లో కొనసాగింది. తర్వాత జమ్మూ-కాశ్మీర్‌కు తిరిగి వచ్చింది.



2011లో కయాకింగ్, కానోయింగ్ క్రీడాకారులతో కూడిన భారత మహిళల జట్టుకు ప్రధాన కోచ్‌గా ఎంపికయ్యింది.

మద్దతు ఇచ్చేందుకు

2020లో ఇండోనేషియాలో జరిగే 18వ ఆసియా క్రీడల కానో స్ప్రింట్‌కు మీర్‌ను ఏషియన్ కానో ఫెడరేషన్ న్యాయనిర్ణేతగా ఎంపిక చేసింది. సెప్టెంబర్ 2023లో చైనాలోని హాంగ్‌జౌలో జరిగిన 19వ ఆసియా క్రీడలకు ఆమె జ్యూరీ సభ్యురాలు. యువ క్రీడాకారులు తన కెరీర్‌లో తాను చూసిన సవాళ్లను ఎదుర్కోకూడదని మీర్ అభిప్రాయపడ్డారు. అందుకే కాశ్మీర్‌కు తిరిగి వచ్చిన తర్వాత ఆమె స్థానిక యువ క్రీడాకారులకు కయాకింగ్, కానోయింగ్ పాఠాలను అందించడం ప్రారంభించింది. ఆమె మార్గదర్శకత్వంలో దాదాపు 110 మంది విద్యార్థులు రాష్ట్రం నుండి జాతీయ పోటీలలో గెలుపొందారు. 'ఒక ఆటగాడికి మార్గదర్శకత్వం, మద్దతు ఎంత ముఖ్యమో నేను గ్రహించాను. ప్రోత్సాహం, చేయూత ఇచ్చే వారి అవసరం ఉంటుంది. అటువంటి సహకారం నాకు అందలేదు. కాబట్టి అలాంటి మద్దతు నేను యువ క్రీడాకారులకు అందించాలనుకుంటున్నాను' ఆమె జతచేస్తుంది.

పోరాడుతూనే ఉంది

మీర్ క్రీడా ప్రయాణమంతా పోరాటాలతో నిండిపోయింది. ఓ కాశ్మీరీ అమ్మాయిగా క్రీడలను కెరీర్‌గా ఎంచుకోవడం ఆమె చేసిన అత్యంత సాహసవంతమైన పని. 'ఆమె ఇతర అమ్మాయిలను చెడగొడుతుంది', 'నువ్వు ఆడపిల్లవి, నువ్వు ఎలా ఆడగలవు?' వంటి మాటలతో ఆమెను ఇబ్బంది పెట్టిన వ్యక్తులను ఆమె గుర్తుచేసుకుంది. అలాగే తను కోచ్‌గా మారిన తర్వాత పురుషుల జట్టుకు ఆమెను కేటాయించిన రోజును మీర్ ఇలా గుర్తు చేసుకుంది.. 'నేను వారికి శిక్షణ ఇవ్వగలనా అని ప్రజలు ఎగతాళిగా నవ్వారు, సందేహించారు. కానీ మన గురించి మనకు తెలిస్తే చాలు. మనల్ని ఎవ్వరూ ఓడించలేరు అనేది నేను నమ్ముతున్నాను'. మీర్ తల్లి కూడా అనేక బాధలు భరించింది. 'మీర్ కాశ్మీర్ పేరును చెడగొడుతుందని అందరూ అనేవారు. ఇలాంటి ఎన్నో మాటలు నేను వినాల్సి వచ్చింది' అంటూ ఆమె తల్లి పంచుకుంది. ఇన్ని నిరుత్సాహపరిచే వ్యాఖ్యల మధ్య మీర్ పోరాటం చేస్తూనే ఉంది. కానీ ఆమె తల్లి ఆమెను విడిచిపెట్టకుండా ప్రోత్సహించింది.

దేశం గర్వించేలా...

తన కెరీర్‌ను ప్రారంభించినప్పుడు అవసరమైన వనరులు, మద్దతు, రోల్ మోడల్ అంటూ ఎవ్వరూ లేరని ఆమె నొక్కి చెప్పింది. ఇవన్నీ ఆమెను ఒలింపిక్స్‌కు చేరుకోకుండా నిరోధించాయని అంటున్నారు. ఇప్పుడు కాలం మారుతోంది. మహిళలు క్రీడల్లో ముందుకు వస్తున్నారు. వివిధ ఆటల్లో భారతదేశం గర్వించేలా చేస్తున్నారు.

నిజానికి జ్యూరీ సభ్యురాలిగా పురుషాధిపత్య రంగంలో నిర్ణయం తీసుకునే పాత్రలలో పెరుగుతున్న మహిళా ప్రాతినిధ్యానికి ఇప్పుడు మీర్ ఓ నిదర్శనం. 'మహిళలు తమ మనసును నిర్దేశిస్తే ఏదైనా చేయగలరు. అయితే ఉజ్వల భవిష్యత్తును సృష్టించుకోవడానికి వారు వదలకుండా పోరాడాలి. కంఫర్ట్ జోన్‌ల నుండి బయటపడాలి' ఆమె చెప్పింది.

చిన్ననాటి కల

మీర్ తన చిన్నతనం నుండి బాక్సర్ కావాలనుకుంది. తన ఇంటి ముందరి చెట్టును ఎప్పుడూ గుద్దుతూ ఉండేదని ఆమె తల్లిదండ్రులు గుర్తు చేసుకున్నారు. అయితే ఏడేండ్ల వయసులో ఆమె తన స్నేహితురాలితో కలిసి దాల్ లేక్‌లోని వాటర్ స్పోర్ట్స్ క్లాస్‌ని చూసేందుకు వెళ్ళింది. అంతే అంతా మారిపోయింది. కోచ్ ఆమెను సమీపంలోని పార్క్‌లో కూర్చోమని లేదా ఇతర విద్యార్థులతో పాటు ప్రాక్టీస్ చేయవల్సిందిగా కోరారు. ఇక ఒక్క నిమిషం కూడా వృథా చేయకుండా విద్యార్థులతో చేరాలని నిర్ణయించుకుంది. 'ఆ రోజు నా జీవితాన్ని మార్చేసింది. పడవను బ్యాలెన్స్ చేయడం చాలా కష్టంగా ఉన్నప్పటికీ మళ్లీ మళ్లీ ప్రయత్నించేందుకు నిర్ణయించుకున్నాను' ఆమె పంచుకుంది.

అవగాహన లేకనే...

వాటర్ స్పోర్ట్స్ కోసం తల్లిదండ్రులను ఒప్పించేందుకు తనకు 15 రోజులు పట్టిందని ఆమె గుర్తుచేసుకుంది. 'అప్పట్లో క్రీడల గురించి ఎటువంటి అవగాహన లేదు. కానోయింగ్, కయాకింగ్ తప్ప మహిళలు ఆడటం, క్రీడలను వృత్తిగా కొనసాగించడం అనేది లేదు. అందుకే నా తల్లిదండ్రులు అర్థం చేసుకోవడానికి సమయం పట్టింది. కానీ వారు చివరికి నా ఇష్టాన్ని అంగీకరించారు' ఆమె చెబుతుంది. అతి తక్కువ కాలంలోనే ఆమె వివిధ కానోయింగ్ పోటీలలో పాల్గొనడం మొదలుపెట్టింది. మొత్తం 12 జాతీయ పోటీల్లో జమ్మూ కాశ్మీర్‌కు ప్రాతినిధ్యం వహించింది.

మోడీ నాయకత్వంలో బీజేపీ మునిగిపోతుంది

(మొదటిపేజీ తరువాయి)

హోం మంత్రి అమిత్ షా వంటి బీజేపీ సీనియర్ నేతలకు వ్యతిరేకంగా ధ్వజమెత్తుతున్నారు. జూన్ 25వ తేదీని మోడీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని హత్య చేసిన రోజుగా అభివర్ణించడంపై ఆయన స్పందిస్తూ 'ఎమర్జెన్సీని వ్యతిరేకించేందుకు మోడీ, అమిష్ షా నిర్వహించిన పాత్ర ఏమిటి?' అని ప్రశ్నించారు. క్రెడిట్‌ను లాక్కోవడం ఓ పెద్ద వ్యాధి అని ఎత్తిపొడిచారు. రష్యాలో ఇటీవల మోడీ జరిపిన పర్యటనపై కూడా ఆయన మాట్లాడారు. ఈ పర్యటన భారత్-అమెరికా సంబంధాలపై ప్రభావం చూపుతుందని చెప్పారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత మోడీపై సుబ్రమణ్య స్వామి విరుచుకుపడ్డారు. 'ఎన్నికల ప్రచార సమయంలో ఆయన తన ఎదుట హాజరైన ప్రజలను చూసి నమస్తే అని అభివాదం చేయకముందే ఆ జనసమూహం అదృశ్యమైపోయింది' అని ఎద్దేవా చేశారు.

ఉప ఎన్నికల్లో ఇండియా కూటమికి 10 స్థానాలు లభించగా ఎన్డీఏ కేవలం రెండు సీట్లతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బద్రీనాథ్‌లో కూడా కాంగ్రెస్ గెలవడాన్ని కమలదళం జీర్ణించుకోలేకపోతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో సైతం ఆ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. హిందువుల ప్రార్థనా స్థలాల్లో సైతం కాషాయ పార్టీ మట్టికరవడంతో దాని హిందూత్వ భావజాలానికి, సిద్ధాంతానికి కాలం చెల్లిందని చెప్పవచ్చు.

భగ్గుమన్న నిత్యావసరాల ధరలు

(మొదటిపేజీ తరువాయి)

మేలో టోకు ధరల ద్రవ్యోల్బణం పెరిగిందని మంత్రిత్వ శాఖ తెలియజేసింది.ఆహార వస్తువులు, ఆహార పదార్థాల తయారీ, ముడి పెట్రోలియం, సహజ వాయువు, ఖనిజ చమురులు, ఇతర ఉత్పత్తి వస్తువుల ధరలు పెరగడంతో టోకు ద్రవ్యోల్బణంలో పెరుగుదల కన్పించింది. ఆహార ధరల ద్రవ్యోల్బణ రేటు ఏప్రిల్‌లో 5.52 శాతం, మేలో 7.40 శాతం ఉండగా జూన్‌లో 8.7 శాతానికి పెరిగింది. అన్ని ప్రధాన వస్తువులతో పోలిస్తే ఇదే అత్యధికం. ఉత్పత్తి చేసిన వస్తువుల ధరలు కూడా మేతో పోలిస్తే జూన్‌లో రెట్టింపు అయ్యాయి. మేలో వీటి ధరలు 0.64 శాతం ఉంటే జూన్‌లో 1.43 శాతానికి చేరాయి. ఆహారధాన్యాలు, వరి, గోధుమ, పప్పులు, కూరగాయలు, పండ్లు, పాలు, గుడ్లు, మాంసం, చేపలు వంటి ఆహార వస్తువులు సహా ప్రజలకు అవసరమైన వస్తువుల ద్రవ్యోల్బణ రేటు మేలో 7.20 శాతం ఉండగా జూన్ నాటికి 8.80 శాతానికి పెరిగింది.

ఇదే సమయంలో కూరగాయల టోకు ధరల్లో ద్రవ్యోల్బణం కూడా 32.42 శాతం నుంచి 38.76 శాతానికి పెరిగింది. పండ్ల ధరల్లో ద్రవ్యోల్బణం 5.81 శాతం నుంచి 10.14 శాతానికి పెరిగిపోయింది. అయితే ఇంధనం, విద్యుత్‌కు సంబంధించిన ద్రవ్యోల్బణ రేటు 1.35 శాతం నుంచి 1.03 శాతానికి తగ్గింది.

ఎస్‌బీఐ రుణాలు భారం

(మొదటిపేజీ తరువాయి)



ఖాతాదారులు రిటైల్, వాహన, గృహ రుణాల వాయిదాలపై అదనంగా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. వాహన రుణాలు ఒక సంవత్సరం, పర్సనల్ రుణాలు రెండు సంవత్సరాల ఎంసీఎల్ఆర్‌కు అనుసంధానించి ఉంటాయి. ఒక్క రోజు నుంచి మూడేళ్ల వరకు వివిధ కాలపరిమితులకు ఎంసీఎల్ఆర్ వేర్వేరుగా ఉంటుంది. ఆ తర్వాత ఒకే వడ్డీ రేటు ఉంటుంది. సిబిల్ స్కోర్ ఆధారంగా ప్రస్తుతం ఎస్‌బీఐ గృహ రుణాల వడ్డీ రేటు శ్రేణి 8.50 శాతం నుంచి 9.65 శాతంగా ఉంది.

మాకు తెలిసింది మీకు చెబుతాం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యంపై న్యాయ కమిషన్ విచారణ కీలకమలుపు తిరిగింది. సోమవారం పలువురు సీనియర్ ఐఏఎస్‌లతోపాటు రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు సైతం కమిషన్ ముందు హాజరయ్యారు. విచారణలో న్యాయ కమిషన్ చైర్మెన్ పీసీ ఘోష్ అడిగిన ప్రశ్నలకు 'మాకు తెలిసిందంతా.. మీకు చెబుతామని.. ఇందులో దాచాల్సింది ఏమీ లేదని' సమాధాన మిచ్చినట్టు తెలిసింది. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, కేసీఆర్ పేషీలో కీలకంగా వ్యవహరించిన స్మితాసబర్వాల్, సాగునీటి శాఖ మాజీ కార్యదర్శులు వికాస్‌రాజ్, మాజీ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ తదితరులు కమిషన్‌తో భేటీ అయ్యారు. ఈసందర్భంగా కమిషన్ చైర్మెన్ ఘోష్ ఒక్కో అధికారిని పది నుంచి 15 నిమిషాల పాటు విచారించారు. సాగునీటి శాఖ, కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారాల్లో సంబంధమున్న ప్రతిఒక్కరినీ విచారిస్తామని గతంలోనే కమిషన్ ప్రకటించిన సంగతి తెలిసిందే. సాంకేతిక, ఆర్థిక, పరిపాలనా పరమైన అంశాల ఆధారంగా కమిషన్ విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో ఐఏఎస్‌ల విచారణ సందర్భంగా కీలక సమాచారాన్ని ఘోష్ కమిషన్ రాబట్టినట్టు తెలిసింది. రామకృష్ణారావు దీర్ఘకాలికంగా ఆర్థిక శాఖను పర్యవేక్షిస్తున్న సంగతి తెలిసిందే. ప్రాజెక్టులకు ఈయన కాలంలోనే అధికంగా నిధులు విడుదల చేశారు. రజత్‌కుమార్ రాష్ట్ర ఎలక్టోరల్ సీఈవోగా పనిచేసిన అనంతరం సాగునీటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. మెగా కంపెనీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు అప్పట్లో వచ్చాయి. ఆయన కూతురు పెండ్లి నిమిత్తం మెగా కంపెనీ నుంచి ఆర్థికంగా లాభపడ్డారనే విమర్శలు వెల్లువెత్తిన విషయం విదితమే. పాత బీఆర్ఎస్ సర్కారు మాత్రం ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ అంశాలపై జస్టిస్ ఘోష్ ఆయా అధికారులను ప్రశ్నించారని తెలిసింది. డీపీఆర్ ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టుకు నిధులిచ్చామని రామకృష్ణారావు, తాము ఏ కంపెనీ నుంచి ఎలాంటి ఆర్థిక సహకారం తీసుకోలేదని రజత్‌కుమార్ చెప్పినట్టు సమాచారం. అలాగే మాజీ సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్‌ను సైతం కమిషన్ దాదాపు గంటసేపు ప్రశ్నించింది. 'నేను సీఎంవో కార్యదర్శిగా ఉన్న మాట వాస్తవమేనని.. తమకు కాళేశ్వరం ప్రాజెక్టుతో సంబంధం లేదనీ, పరిపాలన పరమైన వ్యవహారాలు మినహా ఇతర విషయాలతో తనకు లింక్ లేదని' సమాధానమిచ్చినట్టు తెలిసింది. ఇతర అధికారుల కంటే స్మితా సబర్వాల్ ఎక్కువ సేపు కమిషన్ చైర్మెన్ చాంబర్‌లో ఉన్నారు. దీంతో ఆమెను విచారించడానికి సమయం ఎక్కువ పట్టినట్టు తెలిసింది. తొలుత వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరవుతానని చెప్పిన మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ చివరకు సాయంత్రం నాలుగు గంటలకు కమిషన్ ముందుకు ప్రత్యక్షంగానే వచ్చారు. ఆయన హయాంలో జరిగిన పరిపాలనాపరమైన అంశాలపై ఘోష్ కమిషన్ ఆయన్ను ప్రశ్నించినట్టు సమాచారం. మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , సాగునీటి శాఖ ప్రత్యేక ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ అనంతరం సలహాదారుగా పనిచేసిన ఎస్కే జోషి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విచారణకు హాజరయ్యారు. అనారోగ్యం మూలంగా వీసీ ద్వారా హాజరయ్యేందుకు కమిషన్ అనుమతించింది. అలాగే ఆయా అధికారుల హయాంలో జరిగిన కీలక నిర్ణయాలు, అందుకు గల కారణాలు, అమలుచేసిన విధానం తదితర అంశాలపై కామన్‌గా అందరిని ప్రశ్నించినట్టు సమాచారం. విచారణలో చెప్పిన అంశాలను అఫిడవిట్ల రూపంలో సమర్పించాలని కమిషన్ చైర్మెన్ ఘోష్ ఐఏఎస్‌లకు సూచించినట్టు తెలిసింది. వీరందరికీ ఈనెలాఖరు వరకు గడువిచ్చారు. ఒక్క ఆర్థిక శాఖ రామకృష్ణారావుకు మాత్రం ఆగస్టు ఐదు వరకు సమయమిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ రూపకల్పనలో ఆర్థిక శాఖ ప్రధానాధికారిగా రామకృష్ణారావు తీరికలేకుండా ఉండటంతో ఆయనకు అదనపు సమయం కేటాయించినట్టు కమిషన్ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలావుండగా మాజీ ఆర్థిక శాఖ అధికారి నాగిరెడ్డి కమిషన్ నోటీసులకు స్పందించ లేదు. నోటీసులు అందగానే ఐఏఎస్‌లు అంతా స్పందించడం పట్ల కమిషన్ వర్గాలు హర్షం వ్యక్తం చేసినట్టు తెలిసింది.

పీపీటీ ఇచ్చిన రఘు

కాళేశ్వరం విచారణకు హాజరైన ఇంజినీర్, జేఏసీ నేత రఘు సోమవారం కమిషన్‌కు కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దాదాపు అరగంటకుపైగా ఆయన్ను కమిషన్ విచారించింది. ఈసందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు డీపీఆర్ దగ్గర నుంచి పూర్తయ్యేవరకు చోటుచేసుకున్న లోపాలను చెప్పాలని చైర్మెన్ ఘోష్, రఘును అడిగినట్టు సమాచారం. అనంతరం రఘు బీఆర్‌కేఆర్ భవన్ దగ్గర మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్పుపై సమాచారం అందజేసినట్టు చెప్పారు. పంపుహౌజ్‌లపై చర్చ వచ్చిందనీ, పీపీటీ ద్వారా విషయాలు చెప్పానని అన్నారు. నీళ్లు లేకనే తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మార్చామని గత ప్రభుత్వం చెప్పిందని అన్నారు. కాగా తాను తుమ్మిడిహెట్టి వద్ద నీళ్లు ఉన్నాయనే సమాచారాన్ని తాము కమిషన్‌కు అందజేసినట్టు చెప్పారు. మేడిగడ్డ వద్ద బ్యారేజీ నిర్మాణం ఇంజినీరింగ్ వైఫల్యంగానే తాను భావిస్తున్నట్టు కమిషన్‌కు చెప్పామన్నారు. బ్యారేజీలు, పంపుహౌజ్‌ల నిర్మాణం కోసం ఖర్చును అధికంగా చూపారని తెలిపారు. తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు బ్యారేజీ తరలించడమనేది అశాస్త్రీయమని, దానికి సంబంధించిన ఆధారాలను కమిషన్‌కు సమర్పించినట్టు చెప్పారు. సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారు కాకముందే బ్యారేజీల నిర్మాణం చేపట్టారనీ, అంతేగాక నిర్మాణంలోనూ తప్పిదాలు జరిగాయని కమిషన్‌కు తెలియజేసినట్టు రఘు మీడియాకు చెప్పారు.

డీఎస్సీ నిర్వహణకు సర్వంసిద్ధం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లా నియామక కమిటీ (డీఎస్సీ) రాతపరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభమవనున్నాయి. వచ్చేనెల ఐదో తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా కంప్యూటర్ ఆధారిత విభాగం (సీబీఆర్టీ) విధానంలో పాఠశాల విద్యాశాఖ నిర్వహిస్తుంది. ఈ పరీక్షల నిర్వహణకు అధికారులు సర్వంసిద్ధం చేశారు. మొదటి సారిగా డీఎస్సీ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు అన్ని జాగ్రత్తలూ చేపట్టారు. పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. డీఎస్సీ రాతపరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 56 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఒఒఒ. ంఎష్ట్రశీశ్రీవంబ్.వశ్రీఖఅస్త్రుఅఖ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా డీఎస్సీకి దరఖాస్తు చేసిన అభ్యర్థులు ఈనెల 11 నుంచే హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు 2,24,851 మంది అభ్యర్థులు ఈ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

డీఎస్సీకి 2,79,957 దరఖాస్తులొచ్చిన విషయం తెలిసిందే. ఇంకా డౌన్‌లోడ్ చేసుకోని అభ్యర్థులు వెంటనే చేసుకోవాలని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవి నరసింహారెడ్డి సూచించారు. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఫిబ్రవరి 29న రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఈనెల 18 నుంచి వచ్చేనెల ఐదో తేదీ వరకు రోజూ రెండు విడతల్లో రాతపరీక్షలను నిర్వహిస్తారు. మొదటి విడత ఉదయం తొమ్మిది నుంచి 11.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు జరుగుతుంది. రెండో విడత మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 (స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మినహా) గంటల వరకు నిర్వహిస్తారు. మొదటి విడతకు ఉదయం 7.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. ఉదయం 8.45 గంటలకు గేట్లను మూసేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. మధ్యాహ్నం 1.45 గంటలకు గేట్లను మూసేస్తారు. పరీక్ష ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్లను మూసేస్తామని అధికారులు స్పష్టం చేశారు. మొదటి విడతలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో విడతలో మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంటుంది. డీఎస్సీ అభ్యర్థులకు బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తారు. అందుకే పరీక్ష ప్రారంభానికి గంటన్నర ముందు నుంచే అభ్యర్థులకు అనుమతి ఉంటుంది. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఫొటో గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని అధికారులు సూచించారు. కాలిక్యులేటర్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, లాగరిథమ్ టేబుళ్లు, పేజర్లు, సెల్‌ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను పరీక్షా కేంద్రాల్లోకి తెచ్చుకోవడం నిషేధమని స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హక్కులను కాపాడాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ పార్టీ ఎమ్మెల్యేల హక్కులను కాలరాస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రొటోకాల్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం శాసన సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారపూరితంగా ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్నదని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాదని కాంగ్రెస్ నేతలకు సంక్షేమ పథకాల పంపిణీ బాధ్యతలు అప్పగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల హక్కులు, ప్రొటోకాల్ ఉల్లంఘనలు జరగకుండా అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకోసం సీఎస్, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలివ్వాలని కోరారు. అవసరమైతే ఈ అంశాన్ని అసెంబ్లీ సమావేశాలు లేవనెత్తుతామని తెలిపారు.

ప్రాజెక్టులకు చేరుతున్న వరద



(మొదటిపేజీ తరువాయి)

ప్యారడైజ్, చిలకలగూడ, ప్యాట్నీ, మారేడుపల్లి, అడ్డగుట్ట తదితర ప్రాంతాల్లో రోడ్లపై పెద్దఎత్తున వర్షపు నీరు చేరింది. దాంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇదిలావుండగా వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరిక నేపథ్యంలో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి అధికారులను అప్రమత్తం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే, అత్యవసర అయితేనే ప్రజలు ఇంటి నుంచి బయటకు రావాలని సూచించారు. నగరంలో 140 వాటర్ లాగింగ్ పాయింట్స్ వద్ద నీరు నిలువకుండా ఎప్పటికప్పుడూ తొలగించేందుకు స్టాటిక్ బృందాలు, మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలతోపాటు సీఆర్ఎంపీ, ఈవీడీఎం బృందాలను రంగంలోకి దించారు.

హుస్సేన్ సాగర్ రెండు గేట్లు ఎత్తివేత

గ్రేటర్‌లో కురుస్తున్న వర్షాలతో హుస్సేన్‌సాగర్ నిండు కుండలా మారింది. హుస్సేన్‌సాగర్ ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జీహెచ్ఎంసీ అధికారులు రెండు గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ట్యాంక్‌బండ్ పూర్తిస్థాయి సామర్థ్యం 514.75 అడుగులుకాగా, ప్రస్తుతం 513.43 అడుగుల మేర నీరు ఉంది.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఓ మోస్తారు వర్షం పడింది. వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని కురిసన వర్షానికి విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మండలంలోని ప్రభుదాస్ వాటిక ఆశ్రమంలో భారీ వృక్షాలు విరిగిపడి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దాంతో పలు గ్రామాలకు ఆదివారం అర్ధరాత్రి 12గంటల నుంచి సోమవారం సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్‌శాఖ డీఈ సంజీవ్ ఆధ్వర్యంలో సిబ్బంది ఎంతో శ్రమించి చెట్ల కొమ్మలు తొలగించి, రెండు స్తంభాలు వేసి విద్యుత్‌ను పునరుద్ధరించారు. విద్యుత్ లేకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు నిలిచిపోయాయి.

జూరాలకు వరద

జూరాల ప్రాజెక్టుకు సోమవారం ఎగువ నుంచి 2,894 క్యూసెక్కుల వరద వస్తుండగా.. 1,806 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. నెట్టెంపాడు లిఫ్ట్‌కు 656, భీమా లిఫ్ట్-1కు 650, ఎడమ కాల్వకు 390, భీమా లిఫ్ట్-2కు 766 క్యూసెక్కులను వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ 9.657 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 4.014 టీఎంసీలు ఉన్నది. అలాగే, కర్నాటకలోని టీబీ డ్యాంకు 15,500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 211 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. డ్యాం గరిష్ఠ స్థాయి నీటి నిల్వ 105.855 టీఎంసీలకుగానూ ప్రస్తుతం 33.074 టీఎంసీల నిల్వ ఉన్నది.



చాంపియన్‌ అర్జెంటీనా

కోపా అమెరికా టైటిల్‌ సొంతం
ఫైనల్లో కొలంబియాపై గెలుపు

ఫ్లోరిడా : లియోనల్‌ మెస్సీ మళ్లీ మాయ చేశాడు. ఫిఫా ప్రపంచకప్‌తో చిరకాల స్వప్నం సాకారం చేసుకున్న సాకర్‌ సూపర్‌ స్టార్‌.. కోపా అమెరికాలో అర్జెంటీనాకు రికార్డు టైటిల్‌ అందించాడు. ఆదివారం జరిగిన (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం) టైటిల్‌ పోరులో కొలంబియాపై 1-0తో విజయం సాధించిన అర్జెంటీనా.. రికార్డు 16వ కోపా టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆద్యంతం ఉత్కంఠగా సాగిన టైటిల్‌ పోరులో కొలంబియా గట్టి పోటీ ఇచ్చింది. అదనపు సమయంలో గోల్‌ కొట్టిన మార్టినెజ్‌ అర్జెంటీనాకు చిరస్మరణీయ విజయాన్ని కట్టబెట్టాడు.

కొలంబియా, అర్జెంటీనా నడుమ కోపా అమెరికా టైటిల్‌ పోరు ఆద్యంతం ఉత్కంఠ రేపింది. అభిమానుల గోల, భద్రతా కారణాలకు పూర్తి సమయం మ్యాచ్‌లో గోల్‌ నమోదు కాలేదు. దీంతో ఫ్లోరిడాలోని మియామి గ్రౌండ్స్‌లో హైటెన్షన్‌ వాతావరణం నెలకొంది. మ్యాచ్‌లో 66వ నిమిషంలో లియోనల్‌ మెస్సీ గాయంతో మైదానం వీడాడు. దీంతో మైదానం లోపల, బయట ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంది. 90 నిమిషాల అనంతరం.. అదనపు సమయంలో 112వ నిమిషంలో గోల్‌ కొట్టిన లాటారో మార్టినెజ్‌.. అర్జెంటీనాలో సంబురాలకు తెరతీశాడు. కోపా అమెరికా టోర్నీలో మార్టినెజ్‌కు ఇది ఐదో గోల్‌ కావటం విశేషం. కెప్టెన్‌ లియోనల్‌ మెస్సి మ్యాజిక్‌తో అర్జెంటీనా గోల్‌ అవకాశాలను సృష్టించినా.. కొలంబియా డిఫెన్స్‌ను ఛేదించలేదు. 2021లో కోపా అమెరికా టైటిల్‌తో మొదలైన లియోనల్‌ మెస్సీ మాయ.. 2022 ఫిఫా ప్రపంచకప్‌, 2024 కోపా అమెరికా టైటిల్‌తో అప్రతిహతంగా సాగుతోంది.

ఆ బెంగ తీరినట్టే!

- **దూబె, అభిషేక్‌ ఆల్‌రౌండ్‌ నైపుణ్యం**
- **ఆల్‌రౌండ్‌ విభాగం సమస్యలకు చెక్‌**


ఐదుగురు స్పెషలిస్ట్‌ బ్యాటర్లు, ఓ వికెట్‌ కీపర్‌, ఓ ఆల్‌రౌండర్‌ సహా నలుగురు స్పెషలిస్ట్‌ బౌలర్లు. కొంతకాలంగా టీమ్‌ ఇండియా తుది జట్టు కూర్పు ఇదే. బ్యాట్‌తో, బంతితో స్పెషలిస్ట్‌ ఆటగాళ్లతో ఐసీసీ ఈవెంట్లలో దండయాత్ర చేసినా ఫలితం దక్కలేదు.

నలుగురు బ్యాటర్లు, నలుగురు ఆల్‌రౌండర్లు, ముగ్గురు బౌలర్లు.. ఈ కూర్పుతో ఓ సారి ప్రయత్నించిన టీమ్‌ ఇండియా.. ఐసీసీ టైటిల్‌ వేటలో సుదీర్ఘ నిరీక్షణకు తెరదించింది. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ విజయంలో భారత జట్టులోని ఆల్‌రౌండర్ల ఘనత వెలకట్టలేనిది.

అత్యంత వేగంగా దూసుకెళ్తోన్న ఆధునిక టీ20 క్రికెట్‌లో అవసరాలకు తగినట్టు మార్పు చెందకుంటే పోటీలో ఉండలేం. నలుగురు ఆల్‌రౌండర్ల ఫార్ములాతో హిట్‌ కొట్టిన టీమ్‌ ఇండియా.. భవిష్యత్‌లోనూ అదే విజయ సూత్రం పాటించేందుకు అడుగులు వేస్తోంది. జింబాబ్వేతో టీ20 సిరీస్‌లో భారత్‌ ఆల్‌రౌండర్ల సమస్యకు చెక్‌ పడింది.

నవతెలంగాణ క్రీడావిభాగం

నాణ్యమైన బౌలింగ్‌ నైపుణ్యం కలిగిన బ్యాటర్లు.. నమ్మదగిన బ్యాటింగ్‌ నైపుణ్యం కలిగిన బౌలర్లు.. భారత క్రికెట్‌ ఎంతోకాలంగా అన్వేషిస్తున్న అంశం. హార్దిక్‌ పాండ్య ఒక్కడే ఆల్‌రౌండర్‌గా జాతీయ జట్టులో ఇంతకాలం కొనసాగాడు. అతడు ఫిట్‌నెస్‌ కోల్పోతే తుది జట్టు సమతూకం కోల్పోయే ప్రమాదకర పరిస్థితి టీమ్‌ ఇండియాది. వర్థమాన క్రికెటర్లు వెలుగులోకి వస్తున్న తరుణంలో భారత క్రికెట్‌ సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న ఆల్‌రౌండర్ల సమస్యకు చెక్‌ పడినట్టే కనిపిస్తుంది. ఇటీవల భారత్‌ చాంపియన్‌గా నిలిచిన ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ నలుగురు ఆల్‌రౌండర్లతో బరిలోకి దిగింది. స్పెషలిస్ట్‌ బ్యాటర్లు తడబడిన చోట.. ఆల్‌రౌండర్ల అండతో రోహిత్‌సేన మెరుపు విజయాలు నమోదు చేసిన సంగతి తెలిసిందే. పొట్టి ఫార్మాట్‌లో విజయవంతం కావడానికి ఏ జట్టుకు అయినా లోతైన బ్యాటింగ్‌ లైనప్‌ అవసరం. టీ20 వరల్డ్‌కప్‌ జట్టులో టాప్‌-8 బ్యాటర్లు.. బ్యాట్‌తో ధనాధన్‌ దంచికొట్టేవాళ్లే కావటం గమనార్హం. సీనియర్‌ క్రికెటర్లు వీడ్కోలు పలుకటంతో టీ20 జట్టు సరికొత్త రూపం సంతరించుకోనుంది. కొత్త జట్టులోనూ ఆల్‌రౌండర్లకు కొదవ లేకపోవటం శుభపరిణామం.



> బంతితోనూ నాపై నమ్మకం ఉంచటం సంతోషం. జట్టు కోసం నేను బౌలింగ్‌ చేయడానికి సైతం కఠోరంగా సాధన చేస్తున్నాను. మరింత మెరుగ్గా మాయ చేసేందుకు కష్టపడుతున్నాను
> \- అభిషేక్‌ శర్మ

దూబె, అభిషేక్‌ అదుర్స్‌ : శివం దూబె టీ20 ప్రపంచకప్‌ జట్టులోనూ నిలిచినా.. అక్కడ ఆల్‌రౌండర్‌గా రాణించేందుకు అవకాశం, అవసరం ఏర్పడలేదు. జింబాబ్వే పర్యటనలో శివం దూబె తనలోని ఆల్‌రౌండర్‌ను బయటపెట్టాడు. ఆఖరు టీ20లో జింబాబ్వే 168 పరుగుల ఛేదనలో మెప్పించాడు. సహకారం లభించని హరారే పిచ్‌ నుంచి పేస్‌ రాబట్టాడు. కీలక వికెట్లు పడగొట్టడంతో పాటు పరుగుల నియంత్రణ పాటించాడు. అంతకుముందు బ్యాట్‌తోనూ 12 బంతుల్లోనే 26 పరుగుల ధనాధన్‌ ఇన్నింగ్స్‌తో దంచికొట్టాడు. శివం దూబె ఆల్‌రౌండర్‌ ప్రదర్శనతో భారత్‌ ఘన విజయం సాధించింది.

యువ ఆటగాడు అభిషేక్‌ శర్మ ఐపీఎల్‌ క్వాలిఫయర్‌2లో చెపాక్‌పై స్పిన్‌ మ్యాజిక్‌ చూపించాడు. జింబాబ్వేతో ఆరంభంలో బంతితో అంచనాలు అందుకోలేదు. కానీ ఆఖరు మ్యాచ్‌లో అభిషేక్‌ లయ అందుకున్నాడు. మూడు ఓవర్లలో 20 పరుగులకు ఓ వికెట్‌ పడగొట్టాడు. మిడిల్‌ ఓవర్లలో జింబాబ్వే బ్యాటర్లను కట్టడి చేశాడు. ఇక రెండో టీ20లో అభిషేక్‌ శర్మ బ్యాట్‌తో చేసిన శతక భీభత్సం అభిమానులు ఎప్పటికీ మరువలేరు. టాప్‌ ఆర్డర్‌లో ధనాధన్‌ బ్యాటర్‌గా, నాణ్యమైన స్పిన్నర్‌గా అభిషేక్‌ శర్మ సత్తా చాటాడు. అంతర్జాతీయ స్థాయిలో సవాల్‌కు సిద్ధమని నిరూపించుకున్నాడు. జింబాబ్వేతో టీ20 సిరీస్‌లో ప్లేయర్‌ ఆఫ్‌ ది సిరీస్‌గా సైతం స్పిన్‌ ఆల్‌రౌండర్‌ వాషింగ్టన్‌ సుందర్‌ నిలువటం భారత్‌కు అదనపు అనుకూలత.

భవితకు భరోసా : భారత టీ20 జట్టు భవిష్యత్‌ ఉజ్వలంగా కనిపిస్తుంది. విరాట్‌ కోహ్లి, రోహిత్‌ శర్మ, రవీంద్ర జడేజాలు వీడ్కోలు పలికినా.. యువ క్రికెటర్లు మెగా సవాల్‌కు సిద్ధమవుతున్నారు. యశస్వి జైస్వాల్‌, శుభ్‌మన్‌ గిల్‌ బ్యాటింగ్‌ లైనప్‌లో ప్రధానం కానున్నారు. అభిషేక్‌ శర్మ రూపంలో టాప్‌ ఆర్డర్‌లో బలమైన పోటీదారుడు వచ్చాడు. రుతురాజ్‌ గైక్వాడ్‌, సంజు శాంసన్‌, రియాన్‌ పరాగ్‌లు జట్టులో చోటు కోసం చెమటోడ్చక తప్పదు. హార్దిక్‌ పాండ్య, అక్షర్‌ పటేల్‌ ఆల్‌రౌండర్లుగా టీ20 ప్రపంచకప్‌లో చిరస్మరణీయ ప్రదర్శన చేశారు. టీ20 జట్టులో ఈ ఇద్దరికి తోడు యువ ఆల్‌రౌండర్లు శివం దూబె, అభిషేక్‌ శర్మలు సిద్ధమయ్యారు. శివం దూబె తనదైన ఆఫ్‌ కట్టర్‌కు తోడుగా స్లో బాల్‌ వైవిధ్యం అందుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు. అభిషేక్‌ వర్మ పవర్‌ప్లే, మిడిల్‌ ఓవర్లలో మాయ చేయగలనని ముందుకొస్తున్నాడు. ప్రపంచ క్రికెట్‌లో అన్ని జట్లు ఆల్‌రౌండర్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. కాస్త ఆలస్యమైనా.. భారత జట్టులోనూ ఆల్‌రౌండర్లు వస్తున్నారు. భారత క్రికెట్‌కు ఇది శుభ సూచకం.



> ఆల్‌రౌండర్‌గా రాణించటం ప్రత్యేక అనుభూతి. బ్యాట్‌తో, బంతితో జట్టుకు ఉపయుక్తంగా ఉండటం గొప్పగా ఉంటుంది. పరుగులు చేస్తూ వికెట్లు పడగొట్టడం మంచిగా అనిపిస్తుంది
> \- శివం దూబె




యూరో స్పెయిన్‌దే

- **టైటిల్‌ పోరులో ఇంగ్లాండ్‌ ఓటమి**
- **చాంపియన్‌గా నిలిచిన స్పెయిన్‌**

యుఈఎఫ్‌ఏ యూరో కప్‌ 2024

బెర్లిన్‌ (జర్మనీ) : ఇంగ్లాండ్‌ అర్థ శతాబ్దపు నిరీక్షణకు తెరపడలేదు. ప్రతిష్టాత్మక యూరో కప్‌ వేటలో త్రీ లయన్స్‌కు వరుసగా రెండోసారి భంగపాటు తప్పలేదు. యూరో కప్‌ ఫైనల్లో ఇంగ్లాండ్‌ 1-2తో పరాజయం పాలైంది. టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచిన స్పెయిన్‌ 2-1తో యూరో చాంపియన్‌గా అవతరించింది. నాల్గోసారి యూరోపియన్‌ చాంపియన్‌షిప్‌ టైటిల్‌ సొంతం చేసుకున్న స్పెయిన్‌ ఉత్తమ ప్రదర్శనకు అద్భుత ముగింపు పలికింది. ఆదివారం (భారత కాలమానం ప్రకారం సోమవారం ఉదయం) జరిగిన యూరో కప్‌ 2024 ఫైనల్లో స్పెయిన్‌ మెరుపు విజయం సాధించింది. నికో విలియమ్స్‌ (47వ నిమిషం), మైకల్‌ ఒయర్‌జాబల్‌ (86వ నిమిషం) స్పెయిన్‌కు టైటిల్‌ విన్నింగ్స్‌ గోల్స్‌ కొట్టగా.. ఇంగ్లాండ్‌ తరఫున కోలె పాల్మెర్‌ 73వ నిమిషంలో ఊరట గోల్‌ సాధించాడు.

బెర్లిన్‌ ఒలింపియ స్టేడియంలో స్పెయిన్‌ ఫేవరేట్‌గా బరిలోకి దిగినా.. ఓ మెగా టైటిల్‌ కోసం 50 ఏండ్లకు పైగా ఎదురుచూస్తున్న ఇంగ్లాండ్‌పై ఆశలు ఉన్నాయి. కానీ మైదానంలో ఇంగ్లాండ్‌ తేలిపోయింది. 66 శాతం బంతిని నియంత్రణలో ఉంచుకున్న స్పెయిన్‌ 16 సార్లు ఇంగ్లాండ్‌ గోల్‌పోస్ట్‌పై దాడి చేసింది. ఇంగ్లాండ్‌ కేవలం 9 సార్లు మాత్రమే స్పెయిన్‌ గోల్‌పోస్ట్‌పైకి దూసుకెళ్లింది. 89 శాతం పాస్‌ కచ్చితత్వంతో స్పెయిన్‌ ఆటగాళ్లు వేగంగా అవకాశాలు సృష్టించుకున్నారు. నికో విలియమ్స్‌ 47వ నిమిషంలోనే గోల్‌ కొట్టి.. స్పెయిన్‌ను 1-0తో ఆధిక్యంలో నిలిపాడు. కానీ ఇంగ్లాండ్‌ 73వ నిమిషంలో గోల్‌ కొట్టి స్కోరు సమం చేసింది. కోలె పాల్మెర్‌ మెరుపు గోల్‌తో ఇంగ్లాండ్‌ ఆశలను సజీవంగా నిలిపాడు. 86వ నిమిషంలో స్పెయిన్‌ ఆనందం రెట్టింపు అయ్యింది. మైకల్‌ మరో గోల్‌తో స్పెయిన్‌ను 2-1తో మళ్లీ ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. పూర్తి సమయంలోపు ఇంగ్లాండ్‌ను సమర్థవంతంగా నిలువరించి ఆధిక్యం నిలుపుకున్న స్పెయిన్‌.. నాల్గోసారి యూరో కప్‌ను సొంతం చేసుకుంది.



'భారతీయుడు 2'లో కమల్‌హాసన్‌

వరమా? శాపమా..?

అప్పుడు 'పుష్ప', ఇప్పుడు 'కల్కి', 'భారతీయుడు 2' సినిమాలను చూసిన తర్వాత అసలు రెండు భాగాలుగా సినిమాలు చేయాల్సిన అవసరం ఏముందని అనిపించక మానదు. విషయం లేకుండా సాగతీత ధోరణితో బోర్‌ కొట్టిస్తున్న ఈ రెండు భాగాల సినిమాల విషయంలో ప్రేక్షకులు చాలా అసంతృప్తితో ఉన్నారు. ఇదే తీరు కొనసాగితే వారి నిరాదరణతో తెలుగు సినిమా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

కంటెంట్‌ లేకుండా సహనానికి పరీక్ష పెడితే ప్రేక్షకులు ఎలాంటి తీర్పు ఇస్తారో ఇటీవల విడుదలైన 'భారతీయుడు 2' చిత్రం చెప్పకనే చెప్పింది.

అవినీతిపై పోరాటం నేపథ్యంలో కమల్‌హాసన్‌, శంకర్‌ కాంబినేషన్‌లో వచ్చిన 'భారతీయుడు' సినిమా అప్పట్లో ఒక సంచలన చిత్రం. దీనికి కొనసాగింపుగా ఇటీవల 'భారతీయుడు 2' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు.

కమల్‌, శంకర్‌ కాంబినేషన్‌ కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే ఆ అంచనాలకు తగ్గట్టుగా సినిమా లేకపోగా, ప్రతి సన్నివేశంలో విపరీతమైన సాగతీత ధోరణి ఉండటంతో ప్రేక్షకులను మరింత చిరాకు పెట్టింది. దీంతో అసలు ఎందుకు రెండో పార్ట్‌గా సినిమా తీశారు?, పైగా దీనికి కొనసాగింపుగా పార్ట్‌ 3 అవసరమా.. అని తీవ్ర అసంతృప్తిని సైతం వ్యక్తం చేశారు. ఈ అసంతృప్తి సెగ మేకర్స్‌కి అర్థం అవటంతో దాదాపు మూడు గంటల నిడివి ఉన్న ఈ రెండో భాగంలో ఏకంగా 20 నిమిషాల సన్నివేశాలను కట్‌ చేశారు.

విందు భోజనానికి పిలిచి సగం భోజనం పెట్టి పంపిస్తే ఎలా ఉంటుందో, సగం సగం కథలతో వస్తున్న సినిమాల విషయంలోనూ ప్రేక్షకుల పరిస్థితి అలాగే ఉంది. జయాపజయాల విషయం పక్కన పెడితే ఈ సినిమాల కోసం ప్రేక్షకులు ఒక సినిమానే రెండు టిక్కెట్లు పెట్టి చూశారు. పైగా అధిక ధరలతో టిక్కెట్లను కొనుగోలు చేసి మరీ చూశారు.

మొదటి భాగంలో జస్ట్‌ కథని, పాత్రల తీరుని పరిచయం చేసి, రెండో భాగంలో అసలు కథని చెబుతున్నారు. కానీ అప్పటి వరకు ప్రేక్షకుడి సహనాన్ని పరీక్షిస్తున్నారు. అల్లు అర్జున్‌ హీరోగా నటించిన 'పుష్ప' సినిమా మూడేళ్ల క్రితం వచ్చి పెద్ద విజయం సాధించింది. సుకుమార్‌ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సగం కథనే చెప్పారు. అసలు కథ స్టార్ట్‌ అవుతుందనే సమయంలోనే, విలన్‌తో హీరోకి ఉన్న రివేంజ్‌ని పరిచయం చేసి మొదటి భాగాన్ని ముగించారు. ఇక రెండో భాగం 'పుష్ప2' చిత్రాన్ని అదిగో రిలీజ్‌, ఇదిగో రిలీజ్‌ అంటూ రకరకాల రిలీజ్‌ డేట్స్‌ని మారుస్తూ చివరకు డిసెంబర్‌ 6న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

ప్రభాస్‌ హీరోగా ప్రశాంత్‌ నీల్‌ రూపొందించిన 'సలార్‌' విషయంలోనూ అదే జరిగింది. ఈ మూవీ గతేడాది డిసెంబర్‌లో వచ్చింది. ఇందులోనూ అసలు కథ చెప్పలేదు. పాత్రల పరిచయం చేసి, కథ ఊపందుకునే లోపు మొదటి భాగాన్ని ముగించారు. అసలు కథని రెండో భాగానికి దాచి పెట్టారు. ప్రభాస్‌ ఎలివేషన్లు, పాత్రల పరిచయానికే మూడు గంటలు తీసుకోవడం గమనార్హం. ఇక 'సలార్‌ 2' ఎప్పుడొస్తుందో మేకర్స్‌కే ఎరుక. ఇక తాజాగా వచ్చిన 'కల్కి2898ఏడీ' సినిమా విషయంలో ఇదే తీరు జరిగింది. ప్రభాస్‌ హీరోగా నాగ్‌ అశ్విన్‌ రూపొందించిన ఈ చిత్రం ఇటీవల విడుదలైంది. ఇప్పటికే రూ.1000కోట్లకుపైగా కలెక్షన్లని సాధించింది. అయితే ఈ సినిమా ఫస్టాఫ్‌లో అసలు కథే ఉండదు, పాత్రల పరిచయంతో పాటు కథేంటో సింగిల్‌ లైన్‌లో చెప్పినట్టు చేశారు. సెకండాఫ్‌లో అసలు కథ స్టార్ట్‌ అవుతుంది. కథ ఊపందుకునే లోపే ఎండ్‌ కార్డ్‌ పడుతుంది. పైగా సినిమా ఎండ్‌ వరకు స్లో నెరేషన్‌తో లాక్కుంటూ వచ్చి, ఎండ్‌లో మహాభారతం ఎలిమెంట్లు, ప్రభాస్‌ ఎలివేషన్లు ఇచ్చి ముగించారు.

ఇక అసలు కథ ఏంటో తెలియాలంటే 'కల్కి 2' రిలీజ్‌ వరకు వేచి చూడాల్సిన పరిస్థితి వచ్చింది. అయితే 'కల్కి' సినిమా ఫస్టాఫ్‌ స్లోగా ఉండటాన్ని దర్శకుడు నాగ్‌ అశ్విన్‌ అంగీకరించడం, కావాలనే చేశామని చెప్పడం గమనార్హం. కానీ ఈ సినిమాలోని విజువల్స్‌ హాలీవుడ్‌ స్థాయిని మించి ఉన్నాయని అందరూ మెచ్చుకోవడం విశేషం.

సినిమా అనేది వ్యాపారం. సినిమాని రెండు భాగాలుగా తీసుకురావడం వెనుక భారీ వాణిజ్య కోణం ఉంది. దీన్ని మేకర్స్‌ బాగానే క్యాష్‌ చేసుకుంటున్నారు.

కానీ ఈ సినిమాలను తీసుకున్న బయ్యర్లు నష్టపోతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 'కల్కి' సినిమా వెయ్యి కోట్లని సాధించింది. అయితే రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాని తీసుకున్న బయ్యర్లకు ఇంతవరకు బ్రేక్‌ ఈవెన్‌ రాలేదని వినిపిస్తోంది.

బలమైన కథ ఉన్నప్పుడు రెండు భాగాలుగా చెప్పడంలో తప్పులేదు. కానీ అవసరం లేని, పెద్దగా కథలేని సినిమాల విషయంలోనూ అదే ఫార్ములాని ఫాలో అవుతుండటం తెలుగు చిత్ర సీమకు క్షేమదాయకం కాదని మేకర్స్‌ తెలుసుకోవాలి.

\- అయితగోని రాజు



దేవి శ్రీ ప్రసాద్‌

హైదరాబాద్‌లో తొలిసారి లైవ్‌ షో..

హైదరాబాద్‌ మహానగరంలో సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్‌ తొలి లైవ్‌ షో పర్ఫార్మెన్స్‌ ఇవ్వబోతున్నారు. డిఎస్‌పి లైవ్‌ ఇండియా టూర్‌లో భాగంగా ఆయన హైదరాబాద్‌లో ప్రదర్శన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. 25 ఏండ్లుగా సంగీత ప్రపంచంలో ఎన్నో విజయాలు సాధించిన దేవీశ్రీ ప్రసాద్‌ మొదటి సారి హైదరాబాద్‌లో లైవ్‌ షోతో సంగీత ప్రియుల్ని పలకరించబోతున్నారు.

ఈ కార్యక్రమాన్ని ఏసీటీసీ ఈవెంట్‌ సంస్థ నిర్వహిస్తోంది. ఈ హై వోల్టేజ్‌ డీఎస్‌పీ కాన్సర్ట్‌ని చూడాలనే ఆసక్తి ఉన్నవారు ఏసీటీసీ ఈవెంట్‌లు, డిఎస్‌పి సోషల్‌ మీడియా ఖాతాలను గమనిస్తూ ఉండండి. అలాగే అక్టోబర్‌ 19న హైదరాబాద్‌లో జరగబోయే ఈ ఈవెంట్‌ వివరాలను ఏసీటీసీ ఈవెంట్‌ అధికారిక వెబ్‌ సైట్‌లో అందుబాటులో ఉంచారు.

హైదరాబాద్‌ కాన్సర్ట్‌ కోసం టిక్కెట్లు పొందాలంటే ఏసీటీసీ అధికారిక వైబ్‌ సైట్‌, పేటీఎమ్‌ ఇన్‌సైడర్‌లో టిక్కెట్స్‌ కొనుగోలు చేయవచ్చు. ఈనెల 14 నుంచి టికెట్లు అందు బాటులో ఉంటాయి.

నవచిత్రం

వైవిధ్యమైన కంటెంట్‌తో రేవు



వంశీ రామ్‌ పెండ్యాల, అజయ్‌, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సినిమా 'రేవు'. ఈ చిత్రాన్ని సంహిత్‌ ఎంటర్‌టైన్‌మెంట్స్‌ బ్యానర్‌, పారుపల్లి ప్రొడక్షన్‌ పై నిర్మాత డా. మురళీ గింజుపల్లి, నవీన్‌ పారుపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. నిర్మాణ సూపర్‌ విజన్‌ ఫిల్మ్‌ జర్నలిస్ట్‌ ప్రభు, ఎగ్జిక్యూటివ్‌ నిర్మాతగా ఫిల్మ్‌ జర్నలిస్ట్‌ పర్వతనేని రాంబాబు వ్యవహరిస్తున్నారు. హరినాథ్‌ పులి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్‌ థియేట్రికల్‌ రిలీజ్‌కు రెడీ అవుతోంది.

తాజాగా ఈ మూవీ ఫస్ట్‌ లుక్‌ పోస్టర్‌ను డైరెక్టర్‌ బాబీ చేతుల మీదుగా రిలీజ్‌ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమా విజువల్స్‌ చూశాను. చాలా బాగున్నాయి. సినిమాటోగ్రాఫర్‌ ప్రతిభ చూపించారు. ఈ సినిమాకు ఆర్టిస్టులు, టెక్నీషియన్స్‌ అంతా కొత్త వారు చేశారు. ఇంతమంది కొత్త వాళ్లకు ఈ సినిమాలో అవకాశం ఇవ్వడం నాకు ఆనందంగా ఉంది' అని చెప్పారు. నిర్మాణ పర్యవేక్షకుడు ప్రభు, ఎగ్జిక్యూటివ్‌ ప్రొడ్యూసర్‌ రాంబాబు మాట్లాడతూ, 'ప్రస్తుతం పోస్ట్‌ ప్రొడక్షన్‌ కార్యక్రమాలు కూడా తుది దశకు వచ్చాయి. ఆగస్టు రెండో వారంలో ఈ సినిమాను థియేటర్స్‌ లోకి తీసుకొస్తున్నాం' అని తెలిపారు.

ఘనంగా 'క' టీజర్‌ విడుదల



కిరణ్‌ అబ్బవరం

హీరో కిరణ్‌ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్‌ థ్రిల్లర్‌ సినిమా 'క'. నయన్‌ సారిక, తన్వీ రామ్‌ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాను శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్‌ ఎంటర్‌టైన్‌మెంట్స్‌ బ్యానర్‌ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్‌, సందీప్‌ విలేజ్‌ బ్యాక్‌డ్రాప్‌ యాక్షన్‌ థ్రిల్లర్‌ కథతో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాని త్వరలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్‌ థియేట్రికల్‌ రిలీజ్‌కు తీసుకురాబోతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం ఈ చిత్ర టీజర్‌ రిలీజ్‌ లాంచ్‌ వేడుకను హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు.

నిర్మాత చింతా గోపాలకృష్ణ రెడ్డి మాట్లాడుతూ, 'మూడు 'క' లను నమ్ముకుని ఈ సినిమా నిర్మించాను. అందులో మొదటి క.. కథ. చాలా కథలు విన్న తర్వాత ఈ సినిమా కథలో డిఫరెన్స్‌, కంటెంట్‌ ఉన్నాయని బలంగా అనిపించింది. రెండో క.. కథానాయకుడు కిరణ్‌ అబ్బవరం. మూడో క.. కల. ఇండస్ట్రీలో ఒక మంచి సినిమా నిర్మించి పది మందికి తోడుగా ఉండాలని, ఇండస్ట్రీకి ఉపయోగపడాలని సంకల్పించుకున్నాను. ఈ సినిమాతో పరిచయం అవుతున్న దర్శకులు సందీప్‌, సుజీత్‌ మొదటి చిత్రంతోనే మంచి పేరు తెచ్చుకుంటారు' అని తెలిపారు.

'మా ప్రొడ్యూసర్‌ సపోర్ట్‌ మరువలేనిది. ఏ కథనైనా తెరపైకి తీసుకొచ్చేందుకు ధైర్యం కావాలి. ఆ ధైర్యాన్ని ఇచ్చింది కిరణ్‌. టీజర్‌ మీకు నచ్చిందని ఆశిస్తున్నాం' అని దర్శకులు అన్నారు. హీరో కిరణ్‌ అబ్బవరం మాట్లాడుతూ, "క" సినిమా తెలుగు నుంచి వచ్చిన ఒక మంచి సినిమా అని మీరంతా చెప్పుకుంటారు. ఇప్పుడున్న టికెట్‌ రేట్స్‌, పోటీలో ఎంతమంచి సినిమా ఇస్తే ఆడియెన్స్‌ థియేటర్స్‌కు వస్తారు అనేది మా డైరెక్టర్స్‌ బాగా ఆలోచించారు. ఇవాళ మా టీమ్‌ అంతా హ్యాపీగా మాట్లాడుతున్నాం అంటే కారణం మా ప్రొడ్యూసర్‌ గోపాలకృష్ణ రెడ్డి' అని చెప్పారు.

సారంగదరియాకు విశేష ఆదరణ



రాజా రవీంద్ర ప్రధాన పాత్రలో సాయిజా క్రియేషన్స్‌ పతాకంపై చల్లపల్లి చలపతిరావు దివ్య ఆశీస్సులతో ఉమాదేవి, శరత్‌ చంద్ర నిర్మాతలుగా పద్మారావు అబ్బిశెట్టి (అలియాస్‌ పండు) దర్శకుడిగా పరిచయమైన చిత్రం 'సారంగ దరియా'. ఈ సినిమా ఈనెల 12న విడుదలై, ప్రేక్షకుల నుంచి మంచి స్పందనని రాబట్టుకుంది.

ఈ చిత్రానికి ఆడియెన్స్‌ నుంచి మంచి రెస్పాన్స్‌ రావడంతో చిత్ర యూనిట్‌ సక్సెస్‌ మీట్‌ నిర్వహించింది.

రాజా రవీంద్ర మాట్లాడుతూ, 'మాకు మంచి థియేటర్లు దొరికాయి. ఆడియెన్స్‌ నుంచి మంచి రెస్పాన్స్‌ వస్తోంది. టెక్నికల్‌ టీమ్‌ చాలా కష్టపడింది. మోయిన్‌, మోహిత్‌, యశస్విని నా కంటే చాలా బాగా నటించారు. అందరి పాత్రలకు అద్భుతమైన రెస్పాన్స్‌ వస్తోంది. ఇండస్ట్రీలోకి వచ్చిన తరువాత ఇదే నాకు హ్యాపియెస్ట్‌ మూమెంట్‌. నా కెరీర్‌లో ఇదొక మంచి చిత్రంగా నిలిచింది. నాకు ఇంత మంచి అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్‌' అని అన్నారు.

'విడుదలైన అన్ని థియేటర్లలో బాగా ఆడుతోంది. ఇంత రెస్పాన్స్‌ చూస్తూ ఉంటే నాకు సంతోషంగా ఉంది. మొదటి రోజు తక్కువ మంది చూశారు. మౌత్‌ టాక్‌ వల్ల మెల్లి మెల్లిగా కలెక్షన్లు పెరుగుతున్నాయి. మంచి కథతో సినిమా తీశాం. మంచి కాన్సెప్ట్‌ అనే నమ్మకం ఉంది. ముందుముందు ఇంకా కలెక్షన్లు పెరుగుతాయన్న నమ్మకం ఉంది' అని నిర్మాత శరత్‌ చెప్పారు.

దర్శకుడు పద్మారావు అబ్బిశెట్టి మాట్లాడుతూ, 'థియేటర్‌ కోసమే ఈ సినిమాను తీశాం. మా నిర్మాత చాలా సపోర్ట్‌ చేశారు. మ్యూజిక్‌కు మంచి రెస్పాన్స్‌ వస్తోంది. రాజా రవీంద్రతో పాటు మిగిలిన నటీనటులు అద్భుతంగా నటించారు. మా సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్‌' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

తెలుగు రాష్ట్రాలో ప్రీమియం బైకులకు డిమాండ్

- అపాచీ ఆర్‌టిఆర్ 160 కొత్త ఎడిషన్ ఆవిష్కరణ



హైదరాబాద్ : తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియం బైకులకు డిమాండ్ పెరుగుతుందని టివిఎస్ మోటార్ కంపెనీ ప్రీమియం బిజినెస్ హెడ్ విమల్ సంబ్లి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో ఆ కంపెనీ సెల్స్ వైస్ ప్రెసిడెంట్ యుబి పండేతో కలిసి విమల్ తెలుగు రాష్ట్రాల మార్కెట్లోకి కొత్త టివిఎస్ అపాచీ ఆర్‌టిఆర్160 సిరీస్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా పాండే మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నెలకు 9,000 పైగా ప్రీమియం బైకుల అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. దేశ వ్యాప్తంగా ఈ సంఖ్య 1.40 లక్షలుగా ఉందన్నారు. ఎపి, టిజిలో ప్రీమియం బైకులపై యువతకు ఎక్కువ మక్కువ ఉందన్నారు. హైదరాబాద్ ఎక్స్‌షోరూం వద్ద టివిఎస్ అపాచీ ఆర్‌టిఆర్ 160 ధరను రూ.1,09,990గా, ఆర్‌టిఆర్ 160 4వి ధరను రూ.1,19,990గా నిర్ణయించామన్నారు. ప్రస్తుతం బుకింగ్స్ ప్రారంభించామన్నారు. వచ్చే వారం నుంచి డెలివరీలు ప్రారంభిస్తామన్నారు. అపాచీలో ఇప్పటి వరకు తాము 50 లక్షల యూనిట్లను విక్రయించామన్నారు.

కెనరా రోబెకో నుంచి 'బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్'

ముంబయి : దేశంలోనే రెండవ పురాతన అసెట్ మేనేజర్ కెనరా రోబెకో మ్యూచువల్ ఫండ్ కొత్తగా కెనరా రోబెకో బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌ను విడుదల చేసినట్లు వెల్లడించింది. ఈ ఎన్‌ఎఫ్‌ఒ జులై 26వరకు తెరిచి ఉంటుందని తెలిపింది. 'సంభావ్య నష్టాలను తగ్గించుకుంటూ మార్కెట్ ర్యాలీలలో తమ భాగస్వామ్యాన్ని నియంత్రించడానికి ప్రయత్నిస్తున్న పెట్టుబడిదారులకు ఇది అనుకూలంగా ఉంటుంది" అని కెనరా రోబెకో మ్యూచువల్ ఫండ్ సిఇఒ రజనీష్ నరులా తెలిపారు.

పర్పుల్ గ్రూపునకు రూ.1000 కోట్ల నిధులు

న్యూఢిల్లీ : దాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (అడియా) అనుబంధ సంస్థ నుంచి రూ.1,000 కోట్లు నిధులు సమీకరించినట్లు పర్పుల్ గ్రూప్ ప్రకటించింది. ప్రముఖ బ్యూటీ ప్లాట్‌ఫారమ్‌లలో ఒకటైన పర్పుల్ గ్రూప్ ప్రాథమిక, ద్వితీయ షేర్లను జారీ చేయడం ద్వారా ఈ నిధులను అందుకున్నట్లు పేర్కొంది. బ్యూటీ ఉత్పత్తులను కూడా విక్రయించే ఈ సంస్థ దేశంలో 40వేల పైగా టచ్‌పాయింట్‌లను కలిగి ఉన్నట్లు తెలిపింది.

ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ ఫీజు 20 శాతం పెంపు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ వేదికలు అయినా జొమాటో, స్విగ్గీ తన ప్లాట్‌ఫామ్ ఫీజులను పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో ప్లాట్‌ఫామ్ ఫీజును 20 శాతం పెంచడం ద్వారా రూ.6కు చేర్చినట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. ఇంతక్రితం ఈ రుసం రూ.5గా ఉంది. తొలుత రూ.2గా ఉన్న ఈ ఫీజును విడతల వారీగా పెంచుతూ వస్తున్నాయి. ఏప్రిల్‌లో జొమాటో ఈ ఫీజును 25 శాతం మేర పెంచి రూ.5గా చేసింది.

'రైతుబంధు'ను 'రాబందు'గా మార్చిన బీఆర్ఎస్

- పదెకరాల రైతులు, కౌలుదార్లకు 'భరోసా' ఇవ్వాలి
- రైతుభరోసా క్యాబినెట్ సబ్‌కమిటీలో రైతులు, రైతుసంఘాల ప్రతినిధులు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రైతుబంధు పథకాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం రాబందు పథకంగా మార్చిందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చి అన్ని సబ్సిడీ పథకాలను ఎత్తేసి రైతులకు అన్యాయం చేసిందన్నారు. పంటకు నష్టపరిహారం ఇవ్వడానికి సైతం చేతులు రాలేదన్నారు. పదెకరాలున్న రైతులకు, కౌలుదార్లకు రైతు భరోసా వర్తింపచేయాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు కోరారు. మరికొందరు రైతులు, కౌలుదార్లను గుర్తించడానికి వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతోపాటు ఐదుగురు రైతులతో కమిటీ వేయాలని సూచించారు. సోమవారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన నిర్వహించిన రైతు భరోసా క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కమిటీ చైర్మెన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరారావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టు పంటలకు గిట్టుబాటు ధరతో పాటు రూ.500 బోనస్ ఇవ్వాలని, దీనివల్ల రైతుకు ఎక్కువ లాభం జరుగుతుందని అన్నారు. విత్తనాలు, ఎరువులు, పప్పుధాన్యాల సాగుకు సబ్సిడీలిచ్చి ప్రోత్సహించాలని తెలిపారు. దశాబ్దాలుగా సాగు చేస్తున్న చాలా మంది రైతులకు పట్టాలు లేక రైతుబంధు పొందలేకపోయారని, 'ధరణి'తో గందరగోళంతో తీవ్రంగా నష్టపోయామని, క్షేత్రస్థాయిలో విచారణ చేసి రికార్డులను కరెక్ట్ చేయాలని కోరారు. ప్రతి రైతుకూ పింఛన్ ఇవ్వాలని పలువురు రైతులు కోరారు. రైతు కమిషన్ వేసి నిత్యం రైతాంగ సమస్యలను పరిష్కరించాలని మేధావులు సూచించారు.

శాసనసభలో మీ అభిప్రాయాలపై చర్చిస్తాం : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు

రైతు భరోసా పథకం రూపకల్పన విషయంలో ఇక్కడ మీరు చెబుతున్న అభిప్రాయాలను శాసనసభలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి, రైతు భరోసా క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల సమక్షంలోనే ప్రజల అభిప్రాయాల మేరకే ప్రభుత్వ ఉత్తర్వులుండేలా చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పాన్‌కార్డ్ ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వరని చేస్తున్న దుష్ప్రచారం సరికాదన్నారు. రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సూచనల మేరకు ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ ఆగస్టులో అమలు చేయనున్నామన్నారు. ప్రభుత్వం ఏర్పడగానే రూ.7,562 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతుబంధులో జరిగిన అక్రమాలు, అవకతవకలు రైతు భరోసాలో జరుగకూడదనే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్టు చెప్పారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. రైతు భరోసా విషయంలో నేరుగా రైతులతో చర్చించడానికే సీఎం అధిక ప్రాధాన్యతనిస్తున్నారని, పశువులకు బీమా అమలు చేస్తే బాగుంటుందన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. అసలైన రైతులకు రైతు భరోసా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎంపీలు డాక్టర్ కడియం కావ్య, పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మెన్ జంగా రాఘవరెడ్డి, రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మెన్ మార్నేని రవీందర్‌రావు, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, నాయిని రాజేందర్‌రెడ్డి, దొంతి మాధవరెడ్డి, యశస్వినిరెడ్డి, డాక్టర్ మురళీనాయక్, 'కుడా' చైర్మెన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డి, హన్మకొండ, జనగామ, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు జిల్లాల కలెక్టర్లు పి. ప్రావీణ్య, రిజ్వాన్ భాషా షేక్, అద్వైత్ కుమార్ సింగ్, రాహుల్ శర్మ, దివాకర, రైతు సంఘాల ప్రతినిధులు, వ్యవసాయ, ఉద్యానవన శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు 'భరోసా' ఇవ్వాలి

క్షేత్రస్థాయిలో 40శాతం పైగా కౌలు రైతులే సాగు చేస్తున్నందున వారికీ రైతు భరోసాను ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం హన్మకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య తెలిపారు. కౌలు రైతులను క్షేత్రస్థాయిలో గుర్తించడానికి వ్యవసాయ శాఖాధికారులు కృషి చేయాలన్నారు. సాగుదారులందరికీ రైతు భరోసా అందించాలని చెప్పారు.

ఎం. చుక్కయ్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, హన్మకొండ జిల్లా

2లోగా ఇసుక తవ్వకాలపై నివేదికివ్వండి

- రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన సుప్రీం కోర్టు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై మరిన్ని వివరాలు సమర్పించేందుకు మరికొంత సమయం కావాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఆగస్టు 2 నాటికి ఇసుక అక్రమ తవ్వకాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. రాష్ట్రంలోని ఇసుక అక్రమ తవ్వకాలకు సంబంధించి పిటిషన్‌పై సోమవారం సుప్రీంలో విచారణకు వచ్చింది. జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనం పిటిషన్‌పై విచారణ జరిపింది. తదుపరి విచారణను ఆగస్టు 2కు ధర్మాసనం వాయిదా వేసింది. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మారిందని రాష్ట్ర ప్రభుత్వం తరపు న్యాయవాది హుజెఫా అహ్మదీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. గత అధికారులు ఇసుక తవ్వకాల్లో పెద్దగా ఉల్లంఘనలు జరగలేదని నివేదిక ఇచ్చారన్నారు. అదే సమయంలో మీడియాలో అందుకు విరుద్ధంగా ప్రసారాలు వచ్చాయని, అందువల్ల రెండింటినీ పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వం సమయం కోరిందని కోర్టుకు తెలిపారు. నివేదికతో పాటు ఉల్లంఘనపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో అఫిడవిట్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్రంలో ఏడు జిల్లాల్లో అక్రమ ఇసుక తవ్వకాలపై తనిఖీలు పూర్తి చేశామని, మరో ఆరు జిల్లాల్లో తనిఖీలు చేయాల్సి ఉందని సుప్రీంకోర్టుకు కేంద్ర పర్యావరణ శాఖ తరపు న్యాయవాది తెలిపారు. మరో ఆరు జిల్లాల్లో సర్వే పూర్తి చేసేందుకు ఆరు వారాల సమయం ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇసుక అక్రమ తవ్వకాలపై కేంద్ర పర్యావరణ శాఖ మధ్యంతర నివేదిక ఫైల్ చేసిందని, ఇసుక అక్రమాలపై పూర్తి స్థాయి నివేదిక ఫైల్ చేస్తామని సుప్రీంకోర్టుకు పర్యావరణ శాఖ తరపు న్యాయవాది తెలియజేశారు. తమ ఆధారాలను పరిగణనలోకి తీసుకోవాలని పిటిషనర్ దండా నాగేంద్రకుమార్ ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం ఆగస్టు 2కు విచారణను వాయిదా వేసింది. కాగా ఏపీలో ఇసుక అక్రమాలపై గతంలోనూ సుప్రీం సీరియస్ అయిన విషయం తెలిసిందే. ప్రతి ఇసుక రీచ్‌ను సందర్శించి అక్కడ జరిగిన అక్రమాలపై నివేదిక ఇవ్వాలని కేంద్ర కమిటీకి ఆదేశం చింది. ఇసుక అక్రమాలను ఖరారు చేసి గతంలో జేపీ వెంచర్స్‌కు గ్రీన్ ట్రిబ్యునల్ భారీ జరిమానా విధించిన సంగతి విధితమే.

సీఎంకు మెట్టు సాయికుమార్ ధన్యవాదాలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తనకు ఫెడరేషన్ చైర్మెన్‌గా నియమించిన నేపథ్యంలో సాయికుమార్ తన కుటుంబంతో సోమవారం హైదరాబాద్ లో సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ముఖ్యమంత్రికి మత్స్యకార చేప ప్రతిమను అందజేశారు. అనంతరం సాయికుమార్ మాట్లాడుతూ సీఎం రేవంత్ బలహీనవర్గాలు, మత్స్యకార పక్షపాతిగా చరిత్రలో మిగిలిపోతారని తెలిపారు. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలను ఆయన నాయకులుగా చేశారని ధన్యవాదాలు తెలిపారు.

మార్గదర్శకాలు కావవి .. మభ్యపెట్టేందుకే..

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రుణమాఫీపై ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు రైతాంగాన్ని మభ్యపెట్టేందుకేనని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినచందంగా ఉందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి ఉచిత కరెంటు, సాగునీరు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ పథకాలకు శ్రీకారం చుట్టిందని గుర్తు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో అనేకమంది రైతులు ప్రాణాలను కోల్పోయారని గుర్తు చేశారు. నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు విడతల్లో రూ.29,144.61 కోట్లు రుణమాఫీ చేసిందని గుర్తు చేశారు. తాము అధికారంలోకొస్తే రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ తమ ఎన్నికల ప్రచారంలో చెప్పిందనీ, రాష్ట్రంలో ఉన్న 69 లక్షలపై చిలుకు రైతాంగంలో ఆశలు రేపిందని తెలిపారు. అందుకు భిన్నంగా ఈ రోజు కొందరికే దాన్ని పరిమితం చేసేందుకు మార్గదర్శకాలు తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేకరాల వ్యవసాయదారుడు, రూ.30 వేల జీతం చేసే ఉద్యోగి కూడా ట్యాక్స్ పరిధిలోకి వస్తున్నాడనీ, .. రేషన్ కార్డు, పీఎం డాటా వంటి నిబంధనలు పెట్టి కొందరినే రుణమాఫీకి పరిమితం చేయటమేంటని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణం పొందిన రైతులు రాష్ట్రంలో ఎంత మంది ఉన్నారో ప్రభుత్వం ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పీఎం కిసాన్ డాటాను మార్గదర్శకంగా తీసుకుంటామని ఎన్నికల ప్రచారంలో చెప్పలేదని గుర్తు చేశారు. ఆ డేటాను అనుసరించడం అంటే రుణమాఫీ లక్ష్యానికి గండికొట్టడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. రైతాంగాన్ని వంచించడమేనని తెలిపారు.. హామీలు ఇచ్చినప్పుడు లేని ఆంక్షలు .. అమలు చేసేటప్పుడు ఎందుకని ప్రశ్నించారు.

సచివాలయంలో సీఎం తమ్ముడి వసూళ్ల పర్వం : పాల్వాయి హరీశ్‌బాబు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీఎం తమ్ముడు సచివాలయంలో రాత్రయ్యే వరకూ మకాం వేసి వసూళ్ల పర్వానికి పాల్పడుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఏడు నెలల పాలనలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నదనీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, నాయకుల అవినీతిపై అసెంబ్లీ వేదికగా నిలదీస్తామని అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ నియోజకవర్గంలో కల్యాణ లక్ష్మి కోసం రూ.7,500 లంచం ఇచ్చినా చెక్కు రాలేదని కాంగ్రెస్ నాయకున్ని నిలదీసిన ఘటనపై సమగ్ర విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. మంత్రులు కూడా ప్రతిపనికీ వసూళ్లు చేసే పనిలో పడ్డారని ఆరోపించారు. గ్రామీణ, పంచాయతీ రాజ్, రోడ్లు, భవనాల శాఖ పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారాయనీ, బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు కూడా ముందుకు రావడం లేదని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అధ్వానంగా తయారైన నేపథ్యంలో ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఆగస్టు 15 నాటికి పంట రుణాల మాఫీ

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతులకు రూ.రెండు లక్షల వరకున్న పంట రుణాలను ఆగస్టు 15 నాటికి మాఫీ చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో టీజీఎస్‌డీసీఎల్ చైర్మెన్‌గా అన్వేష్ రెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉత్తమ్ మాట్లాడుతూ గతేడాది డిసెంబర్ నుంచి రైతు భరోసా పథకాన్ని ప్రారంభించామనీ, ఆ పథకం కింద రైతులందరికీ ఏడాదికి ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయాన్ని అంది స్తున్నామని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. అన్ని ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నదని చెప్పారు.పంట రుణాల మాఫీ సహా పలు కీలక అంశాలపై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించనున్నట్టు ఉత్తమ్ తెలిపారు.

రైతు వేదికల్లో కొత్త హంగులు

నిర్వహణ ఖర్చుల్లేక నిరుపయోగంగా ఉన్న రైతు వేదికలను రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేస్తోంది. ఆధునిక సాంకేతిక సదుపాయాల కల్పనలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు అవసరమైన దృశ్యశ్రవణ పరికరాల్ని సమకూర్చు తుంది. పరికరాల కోసం ప్రయోగాత్మకంగా ఎంపిక చేసిన రైతు వేదికకు రూ.3.50 లక్షల నిధుల్ని కేటాయించింది. రైతుల సమస్యల్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నివృత్తి చేయనుంది. సాగుబడిపై అవగాహనా శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. గత ప్రభుత్వం ఐదు వేల ఎకరాలకో వ్యవసాయ క్లస్టర్‌ను ఏర్పాటు చేసి రైతు వేదికల్ని నిర్మించింది. వాటిని వినియోగంలోకి తెచ్చేలోపే ప్రభుత్వం మారడంతో కొత్త ప్రభుత్వం వాటిపై దృష్టి సారించింది.

ఆధునిక సాంకేతిక సదుపాయాల కల్పన

- రైతు నేస్తం కార్యక్రమాల నిర్వహణ
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు సమస్యల పరిష్కారం
- సాగుబడిపై అవగాహన, శిక్షణా కార్యక్రమాలు
- రాష్ట్రంలో 2601.. ఉమ్మడి మెదక్ జిల్లాలో 319 రైతు వేదికలు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

వ్యవసాయ రంగంలో పెరుగుతున్న యాంత్రీకరణ, ఆధునికతను రైతులు అందిపుచ్చుకునేలా గత ప్రభుత్వంలో సాగు విస్తీర్ణాన్ని బట్టి 5వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున ఏర్పాటు చేశారు. ఆరేడు గ్రామాలకు ఒక క్లస్టర్‌గా విభజించి రైతు వేదికల్ని నిర్మించారు. ఒక్కో రైతు వేదిక నిర్మాణం కోసం రూ.22 లక్షలు వెచ్చించారు. ప్రభుత్వం వాటి నిర్వహణ కోసం ప్రతి నెలా రూ.9 వేలు సమకూరుస్తామని చెప్పి కొంత బడ్జెట్‌ను కూడా కేటాయించింది. ఆ తర్వాత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించిన సమయంలో కనీసం మంచినీళ్లు, టీ కోసం డబ్బుల్లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతు వేదికలు తెరవని పరిస్థితి నెలకొంది. చాలా చోట్ల కరెంట్ బిల్లులు కట్టకపోవడంతో సరఫరా నిలిచింది. ఊరికి దూరంగా ఉండి నిర్వహణ గాలికి వదిలేయడంతో ఫ్యాన్లు, ఫర్నీచర్ చోరీకి గురయ్యాయి.

2601 రైతు వేదికలు

రాష్ట్రంలో 2601 రైతు వేదికల్ని నిర్మించారు. ప్రతి వేదికలోనూ రెండు గదులు, మీటింగ్ హాల్, కుర్చీలు, బీరువా, మైక్‌సెట్ సమకూర్చారు. రైతు వేదిక కేంద్రంగా మండల వ్యవసాయ అధికారులు నిధులు నిర్వహించాలి. రైతు వేదికల నిర్వహణ కోసం నెలకు రూ.9 వేల చొప్పున ఇస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. కొంత కాలం నిధుల్ని విడుదల చేసింది. స్వీపర్‌కు రూ.3 వేలు, కరెంట్ బిల్లు రూ.వెయ్యి, సమావేశం నిర్వహణకు రూ.2500, స్టేషనరీ, జీరాక్స్‌కు రూ.వెయ్యి, ఇతర ఖర్చులకు రూ.వెయ్యి చొప్పున ఖర్చు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో 319 రైతు వేదికల్ని నిర్మించారు. సిద్దిపేట జిల్లాలో 127, సంగారెడ్డి జిల్లాలో 116, మెదక్ జిల్లాలో 76 చొప్పున రైతు వేదికలున్నాయి.

బహుల ప్రయోజనాలు

మండల వ్యవసాయ అధికారులు రైతు వేదిక కేంద్రంగా విధులు నిర్వహిస్తూ క్లస్టర్ పరిధిలో ఉన్న గ్రామాల్లో పర్యటించాలి. పంటల సాగుకు సంబంధించిన పర్యటన వివరాల్ని నోటీస్ బోర్డులో ఉంచాలి. పని దినాల్లో యాప్ ద్వారా అటెండెన్స్ వేస్తారు. సేంద్రీయ సాగు విధానం, పంట రుణాలు, ఉత్తమ సాగు పద్ధతులు, రైతు భరోసా, రైతు బీమా, పీఎం కిసాన్, పంటల నమోదు, కొనుగోళ్లు, ఆయిల్‌పామ్, పండ్లు, కూరగాయల సాగు పెంపు, ఎరువులు, విత్తనాల పంపిణీ, ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీలు, సస్యరక్షణ పద్ధతులు, మార్కెట్, మద్దతు ధరలు, వర్మీ కంపోస్ట్ వంటి విషయాల్లో రైతులకు అవగాహన కల్పించడం కోసం రైతు వేదికలను ఉపయోగించడం ద్వారా ఎంతో మేలు చేకూరనుంది.

నిధులిస్తేనే నిర్వహణ

గత ప్రభుత్వం రైతు వేదికల్ని నిర్మించి వాటి నిర్వహణ కోసం ఒకసారి మాత్రమే నిధులిచ్చి వదిలేసింది. ఇప్పుడు రైతు నేస్తం కార్యక్రమాలు, రైతు వేదికల నిర్వహణ కోసం నెలకు కనీసం రూ.10 వేల చొప్పున కేటాయించాలని రైతులు కోరుతున్నారు. ఆధునిక పరికరాలు ఏర్పాటు చేసి నిర్వహణను విస్మరిస్తే మళ్లీ రైతు వేదికలు పడావు పడే అవకాశముందని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఎక్కువ రైతు వేదికలను స్థల సేకరణ సమస్యతో ఊరికి దూరంగా నిర్మించడంతో చాలా చోట్ల ప్యాన్లు, పర్నీచర్ లూటీకి గురయ్యాయి. ఇటీవల సిద్దిపేట జిల్లాలోని కొండపాక మండలంలో రైతు వేదికలో ప్యాన్లు, కుర్చీలు ఎత్తుకెళ్లడంతో కేసు పెట్టాల్సి వచ్చింది.

దృశ్యశ్రవణ పరికరాల ఏర్పాటు

రైతు వేదికల ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు అవసరమైన దృశ్య శ్రవణ పరికరాల్ని సమకూరుస్తున్నారు. బీఎస్ఎన్ఎల్‌కు ఆధీనంలో ఉన్న టి.ఫైబర్ నెట్‌వర్క్‌ను ఉపయోగిస్తారు. వీడియో కాన్ఫరెన్స్ కోసం హై-రిజల్యూషన్ కెమెరాతో పాటు వీడియో తెర, ఇతర పరికరాల ఏర్పాటుకు ఒక్కో రైతు వేదికకు రూ.3.50 లక్షల చొప్పున కేటాయించారు. రాష్ట్రంలో ముందస్తుగా 110 వేదికల్లో ఆధునిక సాంకేతిక పరికరాల్ని సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. సంగారెడ్డి జిల్లాలో సిర్గాపూర్, కొండాపూర్, డాకూర్, రాయికోడ్, ఆల్లిపూర్, సోలక్‌పల్లి రైతు వేదికల్లో దృశ్యశ్రవణ పరికరాల్ని ఏర్పాటు చేశారు. మెదక్ జిల్లాలో రామాయంపేట, నర్సాపూర్, కొల్చారం మండల కేంద్రాల్లో ఉన్న రైతు వేదికల్లో ఆధునిక పరికరాల్ని ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లాలోనూ ఆరు రైతు వేదికల్ని ఎంపిక చేసి పరికరాల్ని సమకూర్చారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 15 రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ కోసం అవసరమైన పరికరాల్ని సమకూర్చారు. ఇప్పటికే వీటిల్లో రైతు అవగహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మెదక్ జిల్లా కొల్చారం రైతు వేదికలో దృశ్యశ్రవణ పరికరాలు ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ప్రారంభించారు. అదే రోజు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంగారెడ్డి జిల్లాలో మనురు, కల్హేర్, గుమ్మడిదల, మునిపల్లి, వట్‌పల్లి, సంగారెడ్డి, కోహీర్, సదాశివపేట, నాగిల్‌గిద్ద, మావినేలి, దౌల్తాబాద్, గొగ్గూర్, తడ్కల్, రుద్రారం వెలిమెలా, బిద్రుప్ప, మడ్డికుంట, బర్దీపూర్, గుడుపల్లి, ముంగి రైతు వేదికల్లోనూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు.



నీటి వనరులను అధ్యయనం చేయండి

- పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులివ్వండి : ఎన్‌డబ్ల్యూడీఏ భేటీలో తెలంగాణ డిమాండ్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి కావాల్సిన నీటి వనరులను అధ్యయనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. తద్వారా 50 శాతం ప్రయోజనాలను తెలంగాణకు వర్తింప జేయాలని కోరింది. తెలంగాణ ప్రతిపాదించిన పెండింగ్ ప్రాజెక్టులకు వెంటనే అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేసింది. సోమవారం ఢిల్లీలోని నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఎన్‌డబ్ల్యూడీఏ) 73వ పాలకమండలి సమావేశం జరిగింది. దీనికి ఎన్‌డబ్ల్యూడీఏ చైర్మెన్ దేబశీష్ ముఖర్జీ అధ్యక్షత వహించగా కేంద్ర జలశక్తి శాఖ ఉన్నతాధికారి భూపాల్‌సింగ్ సమన్వయం చేశారు. ఇందులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, తమిళనాడు, ఛత్తీస్‌గఢ్, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. కొందరు స్వయంగా, మరికొందరు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. ఎన్‌డబ్ల్యూడీఏ చైర్మెన్ దేబశీష్ ముఖర్జీ స్వాగతోపన్యాసం చేశారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి సంబంధించి చిన్న చిన్న అడుగులు పడుతున్నాయన్నారు. మున్ముందు మీ అందరి సహకారంతో పురోగతి సాధిస్తామనే నమ్మకం ఉందన్నారు. తెలంగాణ నుంచి సాగునీటి శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ఇంజినీర్ ఇన్ చీఫ్ బి.అనిల్‌కుమార్,ఇతర అధికారులు పాల్గొన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానికి సంబంధించి చర్చ ఈ సందర్భంగా చోటు చేసుకుంది. తెలంగాణ అధికారులు మాట్లాడుతూ గోదావరి-కావేరీ నదుల అనుసంధానానికి నీటి లభ్యత వనరులను అధ్యయనం చేయాలని సూచించారు. ఇచ్చంపల్లి దగ్గర నిర్మించే బ్యారేజీకి బదులుగా ఇప్పటికే నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ నుంచే నీళ్లను తరలించాలని కోరారు. ఆరు నెలల కిందట చెప్పిన విధంగా ఇచ్చంపల్లి దగ్గర బ్యారేజీ నిర్మిస్తే గోదావరి-కావేరి అనుసంధాన నదులకు, తెలంగాణ ప్రాజెక్టులకు నీళ్లను ఒకేసారి అందించడం సాధ్యం కాదన్నారు. సమ్మక్కసాగర్ బ్యారేజీకి బ్యాక్‌వాటర్ సమస్య ఏర్పడుతుందనీ, వరదల నిర్వహణ కష్టతరంగా మారుతుందని అన్నారు అలాగే రాష్ట్రానికి 158 టీఎంసీల నీటి అవసరాలకు సైతం నష్టం కలుగుతుందని చెప్పారు. నాగార్జుసాగర్ ఆపరేషన్ ప్రొటోకాల్‌ను ఫిక్స్ చేయాలని సూచించారు. అలాగే ప్రాజెక్టుల వారీగా ప్రొటోకాల్‌ను నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ఇదంతా కేడబ్ల్యూటీటీ అధ్యయన నివేదిక వచ్చాకే తేల్చాలని అన్నారు. గత మార్చి 6, 2024న సాగునీటి శాఖ కార్యదర్శి రాసిన లేఖను యధాతథంగా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ అధికారులు మాట్లాడుతూ గోదావరి-కావేరి నదుల అనుసంధానానికి నీటి వనరులను పోలవరం నుంచి సోమశీల , అక్కడి నుంచి కావేరికి తీసుకోవాలని కోరారు. దీనిపై తెలంగాణ అభ్యంతరం చెబుతున్నదన్నారు. పోలవరానికి ప్రత్యామ్నాయంగా ఏపీలోని బొల్లిపల్లిలో 300 టీఎంసీల సామర్థ్యంతో కొత్త రిజర్వాయర్ నిర్మించాలని సూచించింది. కర్నాటక అధికారులు మాట్లాడుతూ నదుల సంధానం నేపథ్యంలో కర్నాటకకు నీటి పరిమాణాన్ని పెంచాలని కోరారు. చైర్మెన్ దేబశీష్ ముఖర్జీ మాట్లాడుతూ సమ్మక్కసాగర్‌పై అధ్యయనం చేయాల్సి ఉందన్నారు. కర్నాటక లేవనెత్తిన అంశాలను పరిశీలిస్తామన్నారు. అన్ని రాష్ట్రాలు ఓపెన్‌గా తమ అభిప్రాయాలు చెప్పాయనీ, సాంకేతిక అంశాలనూ అధ్యయనం చేస్తామన్నారు. అందరికీ ఉపయోగపడే ప్రాజెక్టును రూపొందించాల్సి ఉందన్నారు.

చేనేత క్లస్టర్లలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని చేనేత క్లస్టర్లలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన పలు ఖాళీలను భర్తీ చేయనున్నట్టు ఆ శాఖ కమిషనర్ శైలజరామయ్యర్ ఒక ప్రకటనలో తెలిపారు. 8 క్లస్టర్ డెవలప్ మెంట్ ఎగ్జిక్యూటివ్(సీడీఈ) పోస్టులు, 22 టెక్స్‌టైల్ డిజైనర్ పోస్టులకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. వీరిని మూడేండ్ల కాలపరిమితి కోసం ఎంపిక చేస్తామన్నారు. అయితే మొదట ఒక ఏడాదికి మాత్రమే ఒప్పందం చేసుకుంటామని చెప్పారు. ఈ తర్వాత వారి పనితీరు ఆధారంగా కాలపరిమితిని పొడిగిస్తామని తెలిపారు. సీడీఈ పోస్టులకు చేనేత టెక్నాలజీలో డిప్లొమా, టెక్స్ టైల్ డిజైనర్‌కు ఏదైనా పేరున్న విద్యాసంస్థ నుంచి డిజైనర్‌గా ఉత్తీర్ణత కలిగిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ప్రకటన వెలువడినప్పటి నుంచి 21 రోజుల్లో హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల చేనేతజౌళి శాఖ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ. 24,000 చెల్లిస్తారని పేర్కొన్నారు.

నకిలీ వైద్యుని ఇంజెక్షన్‌తో మరణం

- సంఘటనపై విచారణకు టీజీఎంసీ ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండ గ్రామంలో నకిలీ వైద్యులు అశోక్ యాంటీ రాబీస్ ఇంజెక్షన్ ఇవ్వడంతో మణిదీప్ (10) మరణించిన నేపథ్యంలో ఈఘటనపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) విచారణకు ఆదేశించింది. టీఎస్ఎంసీ ఛైర్మెన్ డాక్టర్ కె.మహేష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య వరంగల్ జిల్లా యాంటీ క్వాకరీ బందాన్ని విచారించి నివేదిక సమర్పించాలని ఆదేశించింది. ఈ ఘటనకు సంబంధించి వివిధ వార్తాపత్రికల్లో వచ్చిన వార్తలను టీఎస్ఎంసీ సుమోటో కేసు కింద స్వీకరించి ఈ ఆదేశాలను జారీ చేసింది. వరంగల్ టీజీఎంసీ సభ్యులు డాక్టర్ ఎం.శేషు తదితర వైద్యులతో కూడిన బృందం ఈ ఘటనపై విచారించనున్నది.

నిరుద్యోగుల ముందస్తు అరెస్టులు దారుణం

- స్వయం ప్రకటిత మేధావులెందుకు మాట్లాడట్లేదు? : డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్


తమ గోడును రాష్ట్ర సచివాలయంలో చెబుకుందామని వచ్చే నిరుద్యోగులను ముందస్తుగా అరెస్టు చేయడం దారుణమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు అన్నారు. హౌజ్, ముందస్తు అరెస్టులపై స్వయం ప్రకటిత మేధావులైన కోదండరామ్, హరగోపాల్, ఆకునూరి మురళి ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ తాయిలాలకు ఏమైనా లొంగిపోయారా అని నిలదీశారు. సోమవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జాబ్ క్యాలెండర్ ప్రకటించడానికి క్యాలెండర్ దొరకడం లేదా రేవంత్‌రెడ్డీ? అని ప్రశ్నించారు. అధికార దాహంతో చిక్కడపల్లి గ్రంథాలయానికి వెళ్లి మోకాళ్ల మీద నిలబడి నిరుద్యోగుల దగ్గర ఓట్లు అడిగింది గుర్తులేదా? అని నిలదీశారు. సీఎంకు పాలించడం చేత కావడం లేదని విమర్శించారు. నిరుద్యోగులను నెల నుంచి రోజూ అరెస్టు చేయడం దారుణమన్నారు. ముందస్తు అరెస్టులతో కేసీఆర్ కంటే రేవంత్‌రెడ్డి రెండింతలు తప్పులు చేస్తున్నారని విమర్శించారు. యూనివర్సిటీల్లో చదుకునే పరిస్థితి లేదన్నారు. రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఉద్యమం చేపించలేదా? అని ప్రశ్నించారు.

నీటి పంపకాలపై కృష్ణా ట్రిబ్యునల్‌లో విచారణ వాయిదా

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకాలపై ఢిల్లీలో కృష్ణా ట్రిబ్యునల్ కార్యాలయంలో సోమవారం విచారణ జరిగింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక తాజా అఫిడవిట్ వేసేందుకు ఏపీ ప్రభుత్వం సమయం కోరింది. అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న ట్రిబ్యునల్, అఫిడవిట్ దాఖలు చేసేందుకు నాలుగు వారాల గడువునిస్తూ తదుపరి విచారణను ఆగస్టు 28, 29 తేదీలకు వాయిదా వేసింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాలు వాదనలు వినిపించాయి. ఇందులో న్యాయవాదులు, అధికారులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్‌పై దాడి కేసులో నిందితుడికి బెయిల్ రద్దుకు సుప్రీం నిరాకరణ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై దాడి కేసులో నిందితుడు శ్రీనివాసరావు బెయిల్‌ను రద్దు చేయడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ఏపీ హైకోర్టు మంజూరు చేసిన బెయిల్ ఉత్తర్వులపై జోక్యానికి అత్యున్నత న్యాయస్థానం అంగీకరించలేదు. 2019 ఎన్నికలకు ముందు విశాఖపట్నం విమానాశ్రయంలో అప్పటి ప్రతిపక్ష నేత జగన్‌పై శ్రీనివాసరావు కోడికత్తితో దాడి చేశాడు. ఈ కేసును దర్యాప్తు చేసిన ఎన్ఐఎ నిందితుడిని అరెస్ట్ చేసింది. సుమారు ఐదేండ్లు జైల్లో ఉన్న శ్రీనివాసరావుకు హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. దీన్ని రద్దు చేయాలంటూ ఎన్ఐఎ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం బెయిల్ రద్దుకు నిరాకరించింది.

సీనియార్టీ జాబితాలో మళ్లీ తప్పులు ఎవరికి చెప్పుకోవాలి?

- తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ పరిధిలో రెండో సారి రూపొందించిన సీనియార్టీ జాబితాలో మళ్లీ తప్పులొచ్చాయని తెలంగాణ మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆరోపించింది. ఈ మేరకు సోమవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ నిజాముద్దీన్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకసారి తప్పు జరిగిందని ఉద్యోగులంతా గగ్గోలు పెడితే రెండో సారి రూపొందించిన దానిలోనూ తప్పులెలా వస్తాయని? ప్రశ్నించారు. సీనియార్టీ జాబితాలో టెర్మినేట్ అయిన వారు, మరణించిన వారు, 317 జీవో ప్రకారం ఇది వరకే బదిలీ అయిన వారి పేర్లున్నాయని చెప్పారు. కొన్ని జోన్లలో పూర్తిగా పని చేస్తున్న వారి సంఖ్యను కూడా సరిగా పేర్కొనలేదని వాపోయారు. సీనియార్టీ జాబితా రూపొందిస్తున్న వారు ఆ పని చేయగలుగుతారా? అని ప్రశ్నించారు. తప్పులకు సంబంధించి ఇది వరకే డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌ను కలిసి విన్నవించినప్పటికీ ఫలితం లేకపోయిందని చెప్పారు. కౌన్సిలింగ్‌కు 3 రోజుల వ్యవధే ఉండటంతో ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. ఇప్పటికైనా ఆయా జిల్లాల డీఎంహెచ్ఓలు పంపిన జాబితాలను పరిగణనలోకి తీసుకుని తప్పులను సరి చేయాలని డిమాండ్ చేశారు. ల్యాబ్ టెక్నీషియన్లతో పాటు ఫార్మసిస్టుల జాబితాలోనూ ఇదే పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు.


షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి : ఏలేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. నిధులు లేకపోవడంతో పనులు చేయలేకపోతున్నారని ప్రజావాణిలో గ్రామ కార్యదర్శులు వెల్లడించారనీ, సర్పంచులకు కూడా ప్రభుత్వం బిల్లులు కూడా చెల్లించలేదని తెలిపారు. కానీ.. చెల్లించని మీరు ఒక్కరోజు పెండింగ్ లేకుండా మంత్రుల కంపెనీలకు వందల , వేల కోట్ల రూపాయాల బకాయిలు ఎలా విడుదల చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలగొడతామని చెప్పిన కడియం శ్రీహరిని ఆ పార్టీలో ఎందుకు చేర్చుకున్నారో చెప్పాలని నిలదీశారు.

క్వారీలో ఘోరం

ఏపీలో ముగ్గురు కార్మికులు దుర్మరణం



కంచికచర్ల : ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలం పరిటాల సమీపంలోని దొనబండ క్వారీలో సోమవారం ఘోరప్రమాదం చోటుచేసుకుంది. డ్రిల్లింగ్ చేస్తుండగా పెద్ద మొత్తంలో బండరాళ్లు జారి పడడంతో ముగ్గురు కార్మికులు దుర్మరణం చెందారు. సోమవారం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... దొనబండ పవన్ క్రషర్‌కు చెందిన క్వారీలో బ్లాస్టింగ్ నిర్వహించారు. అనంతరం పెద్ద బండలను చిన్నవిగా చేసి మరోసారి బ్లాస్టింగ్ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పెద్ద బండలకు డ్రిల్లింగ్ ద్వారా నలుగురు కార్మికులు హోల్స్ పెడుతున్నారు. ఈ ప్రకంపనలకు లూజుగా ఉన్న పెద్ద బండ రాళ్లన్నీ ఒక్కసారిగా కొండ నుండి దిగువకు జారి పడ్డాయి. దీంతో, అక్కడ పనిచేస్తున్న ముగ్గురు కార్మికులు బండరాళ్ల మధ్య చిక్కుకొని దుర్మరణం చెందారు. వారిలో జి.కొండూరు మండలం చెరువు మాధవరానికి చెందిన డ్రిల్లింగ్ యజమాని బత్తుల దుర్గారాజ్ (23), ఒడిశా రాష్ట్రానికి చెందిన, ప్రస్తుతం జి.కొండూరు మండలం చెవుటూరు గ్రామంలో ఉంటున్న డ్రిల్లర్ బిబి నాయక్ (42), ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన, ప్రస్తుతం చెవుటూరులో నివాసం ఉంటున్న కార్మికుడు రామ్‌దేవ్ భాగేల్ (33) ఉన్నారు. ఒడిశాకు చెందిన కోమార గోలి ప్రమాదం జరిగిన ప్రాంతానికి దూరంగా ఉండడంతో క్షేమంగా బయటపడ్డారు. కంచికచర్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రొక్లయినర్లు, పెద్ద మిషన్ల ద్వారా బండరాళ్లను తొలగించి మృతదేహాలను వెలికితీశారు. బ్లాస్టింగ్, డ్రిల్లింగ్ సమయంలో భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని తోటి కార్మికులు చెప్తున్నారు. క్వారీ యజమానే ఈ ప్రమాదానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పొట్ట కూటి కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల మృతితో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రమాద ప్రాంతాన్ని నందిగామ ఎసిపి డాక్టర్ బి.రవికిరణ్, గ్రామీణ సిఐ పి.చంద్రశేఖరరావు సందర్శించారు. బండరాళ్ల గుట్టల కింద నుండి మృతదేహాలను వెలికితీసే సహాయ చర్యలను వారు పర్యవేక్షించారు. నందిగామ ఆర్‌డిఒ ఎ.రవీంద్రరావు, కంచికచర్ల తహశీల్దార్ సుస్వాగతం, మైనింగ్ ఎడి, ఇంటలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.50 లక్షల నష్టపరిహారమివ్వాలి : సీఐటీయు

మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. క్వారీల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

రూ.8 లక్షలు ఇచ్చేందుకు క్వారీ యజమాని అంగీకారం

క్వారీ ప్రమాదంలో ముగ్గురు కార్మికులు మృతి చెందిన నేపథ్యంలో క్వారీ యజమానితో మృతుల బంధువులు, అధికారులు నష్టపరిహారంపై సంప్రదింపులు జరిపారు. మృతుల కుటుంబాలకు రూ.8 లక్షల చొప్పున నష్టపరిహారం ఇచ్చేందుకు క్వారీ యజమాని రామ్మోహనరావు అంగీకరించారు.

ఆర్‌ఎంపీ వైద్యం వికటించి బాలుని మృతి..?

- సోషల్ మీడియాలో దూమారం
- సుమోటోగా ఫిర్యాదు స్వీకరించిన జిల్లా వైద్య మండలి
- వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో ఘటన



నవతెలంగాణ-నెక్కొండ

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం ముదిగొండ గ్రామంలో ఓ ఆర్ఎంపీ వైద్యుడి వైద్యం వికటించి ఓ పదేండ్ల బాలుడు మృతి చెందినట్టు సోషల్ మీడియాలో దుమారం రేగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ముదిగొండకు చెందిన కోటేశ్వర్-సరిత దంపతుల కుమారుడు మణిదీప్(10) హసన్‌పర్తిలోని మహాత్మా జ్యోతిరావుపూలే గురుకులంలో ఐదో తరగతి చదువుతున్నాడు. వారం రోజుల క్రితం జ్వరంతో మణిదీప్ ఇంటికి వచ్చినట్టు తల్లిదండ్రులు చెబుతున్నారు. సోమవారం ఉదయం బాలుడు అస్వస్థతతో ఇంట్లోనే పడిపోయాడని, ఒంటిపై దద్దుర్లు వచ్చాయని, వైద్యం కోసం ఎంజీఎంకు తరలించగా వైద్యులు పరీక్షించి మరణించినట్టు చెప్పారని కుటుంబ సభ్యులు చెబుతూ బోరున విలపించారు. బాలుని మృతిలో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

సంఘటనా స్థలాన్ని నెక్కొండ ఎస్ఐ మహేందర్, డిప్యూటీ తహసీల్దార్ రవి పరిశీలించారు. కాగా, బాలుడు వారం క్రితం కుక్కకాటుకు గురికాగా వ్యాక్సిన్ వేయిస్తున్న క్రమంలో గ్రామంలోని ఆర్ఎంపీ అశోక్ ఇంజక్షన్ వేయడంతోనే బాలుడు అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడని, వెంటనే బాలుడిని ఎంజీఎంకు తరలించగా మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతోంది. దాంతో జిల్లా వైద్య మండలిని విచారణకు ఆదేశించినట్టు వైద్య మండలి ఛైర్మెన్ డాక్టర్ మహేష్‌కుమార్, రిజిస్టర్ లాలాయ్య ఆదేశాలు జారీ చేశారు. ఆరుగురు సభ్యులతో కూడిన వైద్య బృందం బాలుని కుటుంబాన్ని పరామర్శించడంతోపాటు వైద్యం చేసిన ఆర్ఎంపీ వైద్యుని ఆస్పత్రి, చికిత్సలపై నివేదిక సమర్పించాలని ఆదేశాల్లో పేర్కొంది. బృందం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయని రిజిస్టర్ లాలయ్య తెలిపారు.

బీజేపీలో బీఆర్ఎస్ విలీనం

- ఢిల్లీలో బావబామ్మర్దుల చర్చలు
- బండి సంజయ్‌కు ఒకే.. నో అంటున్న కిషన్ రెడ్డి : మీడియాతో చిట్‌చాట్‌లో మధుయాష్కి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేసేందుకు కేసీఆర్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని పీసీసీ ప్రచార కమిటీ చైర్మెన్ మధుయాష్కీ, గౌడ్ వ్యాఖ్యానించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. విలీనం కోసం బావబామ్మర్దులు హరీశ్‌రావు, కేటీఆర్ ఇద్దరూ ఢిల్లీలో చర్చలు జరిపారని చెప్పారు. విలీనాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వ్యతిరేకిస్తే, బండి సంజయ్ ఒకే చెప్పారనీ, అందుకే హరీశ్ రావు మంచొడంటూ కితాబులిస్తున్నారని వ్యాఖ్యానించారు. కవిత కోసమే హరీశ్ రావు, కేటీఆర్ ఈ రకంగా పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ మొదట్నుంచి ఒకటేననీ, అందుకే బీజేపీ రాష్ట్ర ప్రభుత్వాలను కూలగొడుతుంటే బీఆర్ఎస్ మద్దతుగా నిలిచిందని విమర్శించారు. కాంగ్రెస్‌లో చేరే వారికి ఎలాంటి పదవులు, హామీలు ప్యాకేజీలు ఇవ్వట్లేదని తెలిపారు. ఏఐసీసీ అనుమతితోనే చేరికలు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలోకి వస్తే ఫిరాయింపుల చట్టాన్ని సవరిస్తామని హామి ఇచ్చింది కేవలం కాంగ్రెస్ పార్టీయేనని గుర్తుచేశారు. ప్రధానమంత్రి మోడీ అనుమతితోనే గతంలో జగన్ , చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేశారనీ, దీంతో లోకేష్ ఢిల్లీకి వెళ్లి బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నారని చెప్పారు.

నారాయణ, శ్రీచైతన్యలో 15 శాతం వాటా

కేటీఆర్, హరీశ్ రావు, కవితకు నారాయణ, శ్రీచైతన్య సంస్థల్లో 15 శాతం వాటా ఉందని మధుయాష్కీ ఆరోపించారు. పరీక్షలు వాయిదా వేస్తే శిక్షణ సంస్థలకు రూ.100 కోట్ల లబ్ధి పొందుతాయని తెలిపారు. ఆ రూ.100 కోట్లలో కేటీఆర్,హరీష్ రావు, కవితకు వాటా ఎంత? అని ఆయన ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పని చేసిన అధికారులు రూ.100 కోట్లు ఇస్తామని తిరుగుతున్నా... అయితే వారితో నిజం కక్కించేందుకే సీఎం రేవంత్ నిర్ణయించుకున్నారని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడి పదవినిస్తే తీసుకుంటాననీ, వేరే పదవులు తీసుకోబోనని స్పష్టం చేశారు.

ఉగ్ర దాడిలో జవాను మృతి



నందిగాం : జమ్మూకాశ్మీర్‌లోని అనంతనాగ్‌లో ఉగ్రవాదుల దాడిలో శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం వల్లభరాయుడుపేటకు చెందిన జవాను సనపల జగదీశ్వరరావు (40) సోమవారం అమరుడయ్యారు. ఉగ్రవాదులు దాక్కున్నారన్న సమాచారంతో సోమవారం వేకువజామున కూంబింగ్ చేపడుతుండగా జరిగిన ఎదురుకాల్పుల్లో ఆయన అసువులు బాశారు. 2002లో ఆర్మీకి ఎంపికైన జగదీశ్వరరావు మరో ఏడాదిన్నరలో రిటైర్ కాబోతున్నారు. ఆయనకు తల్లిదండ్రులు, భార్య సమత, ఇద్దరు కుమార్తెలు మోక్ష ప్రియ, దీక్షిత ఉన్నారు. సమత దిమిలాడ సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తున్నారు. ఉగ్రవాదుల కాల్పుల్లో జగదీశ్వరరావు మృతి చెందాడన్న విషయాన్ని ఆర్మీ అధికారులు కుటుంబసభ్యులకు సమాచారం అందించడంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎలాంటి విచారణ లేకుండా 1400 రోజులుగా జైల్లోనే...

- జెఎన్‌యు స్కాలర్ ఉమర్ ఖలీద్‌కు న్యాయం జరిగేనా?



న్యూఢిల్లీ : జెఎన్‌యులో పిహెచ్‌డి చేసిన ఉమర్ ఖలీద్ ఎలాంటి విచారణ లేకుండా 1400 రోజులుగా జైలులో మగ్గుతున్నారు. ఆయనకు న్యాయం సుదూర స్వప్నంగానే మిగిలిపోయింది. 2020 సెప్టెంబరులో ఢిల్లీలో అల్లర్లు రెచ్చగొట్టారని ఆరోపిస్తూ ఢిల్లీ పోలీసులు ఖలీద్‌ను అరెస్టు చేశారు. అప్పటి నుండి తీహార్ జైల్లో ఉమర్ ఖలీద్ ఉన్నారు . ఫైడర్ డోస్టోఎస్కీ రచించిన 'ది బ్రదర్స్ కరమజోవ్', మనోజ్ మిట్టా రచించిన 'క్యాస్ట్ ప్రైడ్: బ్యాటల్స్ ఆఫ్ ఈక్వలిటీ ఇన్ హిందూ ఇండియా' వంటి పుస్తకాలను చదువుతూ ఉమర్ ఖలీద్ జైలు జీవితాన్ని గడుపుతున్నాడు. సిఎఎ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలు కారణంగానే ఈ అల్లర్లు చోటుచేసుకున్నాయని ఢిల్లీ పోలీసులు ఆరోపిస్తున్నారు. ఖలీద్‌తో పాటు సిఎఎ ఆందోళనల్లో పాల్గొన్న షర్జీల్ ఇమామ్ వంటి వారితో పాటు మొత్తంగా 20 మందిని ఈ అల్లర్ల కేసులో ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. ఈ 20 మందిలో అరెస్టయిన వారిలో ఖలీదే చివరి వ్యక్తి. ఉమర్ ఖలీద్‌పై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. వీటిలో ఒకదాన్ని ఎత్తివేశారు. మరొక కేసులో ఇప్పటి వరకూ ఖలీద్‌కు వ్యతిరేకంగా ఛార్జీషీట్ దాఖలు చేయలేదు. మరోవైపు దిగువ కోర్టుల నుంచి అత్యున్నత న్యాయస్థానాల వరకూ ఖలీద్‌కు బెయిల్ ఇవ్వడానికి నిరాకరిస్తూ వస్తున్నాయి. ఉమర్ ఖలీద్ జెఎన్‌యులో పిహెచ్‌డిని పూర్తి చేసుకున్నారు. 'కాంటెస్టింగ్ క్లెయిమ్స్ అండ్ కాంటిజెనిసిస్ ఆఫ్ ది రూల్ ఆన్ ఆదివాసిస్ ఎట్ జార్ఖండ్' అనే అంశంపై ఖలీద్ పిహెచ్‌డి అందుకున్నారు. ఈ థీసెస్‌ను యూనివర్శిటీ ముందుగా అంగీకరించలేదు. 2018లో కోర్టులు పదేపదే ఆదేశించిన తరువాత యూనివర్శిటీ ఈ థీసెస్‌ను అంగీకరించింది. జెఎన్‌యులో 2016 ఫిబ్రవరి 9న కార్యక్రమాల ద్వారా ఇతర విద్యార్థి నాయకులు కన్నయ్య కుమార్, షెహ్లా రషీద్‌తో పాటు ఖలీద్ వెలుగులోకి వచ్చాడు. ఈ ఎనిమిది సంవత్సరాల్లో వీరు వేర్వేరు రాజకీయ మార్గాల్లో ప్రయాణం చేస్తున్నారు. ఈ సంఘటనల తరువాత జెఎన్‌యు అధికారులు ఖలీద్‌ను నియంత్రించడానికి ప్రయత్నించారు. ఖలీద్‌పై 'బలవంతపు చర్య' తీసుకోవద్దని కోర్టు ఆదేశించడంతో ఆగారు.. సిఎఎ వ్యతిరేక ఆందోళనల్లో ఖలీద్ చురుగ్గా పాల్గొన్నారు. ఎలాంటి విచారణ లేకుండా ఏళ్ల తరబడి ఖలీద్‌ను జైల్లో ఉంచడంపై ఆయన భార్య బానోజ్యోత్స్న లాహిరి ఆందోళన వ్యక్తం చేశారు. . 'మాకు కనుచూపు మేర న్యాయం కనిపించడం లేదు. చాలా కష్టమైన పరిస్థితుల్లో ఉన్నాం' అని అన్నారు. గత వారంలో తీహార్ జైల్లో ఖలీద్‌ను ఆమె కలుసుకున్నారు. వారానికి ఒకసారి సందర్శకులను కలవడానికి కోర్టు ఖలీద్‌కు అనుమతించింది. 2021 జులైలో మొదటిసారిగా ఖలీద్ సెషన్స్ కోర్టులో బెయిల్ దరఖాస్తు చేసుకున్నారు. 2022 మార్చి 24న సెషన్స్ కోర్టు ఈ పిటీషన్‌ను తిరస్కరించింది. తరువాత వివిధ కోర్టులు ఖలీద్ బెయిల్ పిటీషన్‌ను వివిధ కారణాలతో తిరస్కరించాయి.

ఢిల్లీ అల్లర్లు 2020 కేసులో మొత్తం 20 మందిని అరెస్టు చేయగా వీరిలో ఆరుగురికి మాత్రమే బెయిల్ లభించింది. మిగిలిన 14 మంది ఇంకా కటకటాల వెనుక మగ్గుతున్నారు.

జ్యోతిజగ్తాప్‌కి మధ్యంతర బెయిలు నిరాకరించిన సుప్రీం

కార్యకర్త, కళాకారిణి జ్యోతిజగ్తాప్‌కి మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేష్, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం బెయిల్ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. 2022 అక్టోబర్ 17న బాంబే హైకోర్టు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించడాన్ని సవాలు చేస్తూ జ్యోతి జగ్తాప్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

నేపాల్ ప్రధానిగా ఓలి ప్రమాణ స్వీకారం

ఖాట్మండు : నేపాల్ నూతన ప్రధానిగా కె.పి.శర్మ ఓలి సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. నాలుగోసారి ప్రధానిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. రాష్ట్రపతి భవన్‌లోని శీతల్ నివాస్‌లో అధ్యక్షుడు రామచంద్ర పౌడెల్, ఓలి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం.. ఓలి ప్రమాణ స్వీకారం అనంతరం 30 రోజులలోపు పార్లమెంటులో తన బలాన్ని నిరూపించాల్సి వుంది.

275 సీట్లు కలిగిన పార్లమెంట్ ప్రతినిధుల సభలో ఓలి విశ్వాసపరీక్షలో నెగ్గాలంటే కనీసం 138 ఓట్లు కావాల్సి వుంది.

శుక్రవారం ప్రతినిధుల సభలో విశ్వాస పరీక్షల్లో ఓడిపోయిన ప్రచండ స్థానంలో ఓలి బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం దేశంలో రాజకీయ సుస్థిరత నెలకొల్పడమే కొత్త సంకీర్ణ ప్రభుత్వానికి ప్రధాన సవాలుగా వుంది.

సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షులు నాగరాజు గౌడ్ సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ భూమిలో తాటి, ఈతవనాలను పెంచుకోవడానికి సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ప్రభుత్వం, ఐఐటీ హైదరాబాద్‌తో కలిసి ఆధునాతన పరికరాలు తయారు చేయిస్తోందని తెలిపారు.

గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి : బీఆర్ఎస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గౌడ కులస్తులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వి.శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాటమయ్య మోకులు కేసీఆర్ హయంలోనే తయారయ్యాయనీ, వాటి కోసం అప్పుడే రూ.15 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. వైన్, బార్ షాపుల్లో బీఆర్ఎస్ ఇచ్చిన 15 శాతం రిజర్వేషన్ ను 25 శాతం పెంచుతామన్న హామీపై సీఎం మాట్లాడటం లేదని విమర్శించారు. సర్వాయి పాపన్న జయంతికి ముందే ట్యాంక్ బండ్‌పై విగ్రహ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన తిరిగిన నాలుగు వేల ఎకరాల గుట్టల పరిరక్షణ బాధ్యతను పురావస్తు శాఖకు అప్పగించాలని డిమాండ్ చేశారు. హామీల అమలుపై స్పందించకుంటే గౌడ సంఘాలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని హెచ్చరించారు.

నీట్ కేసుల బదిలీపై మీరేమంటారు ?

విద్యార్థులకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ : వివాదాల్లో చిక్కుకున్న నీట్ పరీక్ష అక్రమాలు, ప్రశ్నా పత్రాల లీకేజీలపై వివిధ హైకోర్టుల్లో దాఖలు చేసిన పిటిషన్లన్నింటినీ సుప్రీం కోర్టుకు బదిలీ చేయాల్సిందిగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) అభ్యర్థనపై స్పందనలు తెలియచేయాల్సిందిగా విద్యార్థులను సుప్రీం కోర్టు సోమవారం కోరింది. ఈ మేరకు విద్యార్థులకు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ నోటీసులు జారీ చేసింది. అధీకృత రూలింగ్ కోసం వివిధ హైకోర్టుల్లో పెండింగ్‌లో వున్న కేసులను సుప్రీంకు బదిలీ చేయాలని ఎన్‌టిఎ కోరింది. తాజాగా నీట్ పరీక్ష నిర్వహించాలన్న డిమాండ్ నుండి ఎన్‌టిఎను రద్దు చేయాలన్న డిమాండ్ వరకు వివిధ డిమాండ్లపై మొత్తంగా 40 పిటిషన్లు వేర్వేరుగా దాఖలయ్యాయి.

డిగ్రీ కాలేజీ విశ్రాంత అధ్యాపకులు శ్రీధర్‌రెడ్డి హఠాన్మరణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ డిగ్రీ కాలేజీల విశ్రాంత అధ్యాపక సంఘం రాష్ట్ర సలహాదారు, ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజీ రిటైర్డ్ లెక్చరర్ల అసోసియేషన్ ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి హఠాన్మరణం పొందారు. సోమవారం గుండెపోటు రావడంతో ఆయన తుదిశ్వాస విడిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎయిడెడ్ కాలేజీల అధ్యాపకుల సంఘాల నాయకుడిగా ఐదు దశాబ్దాల పాటు ఎనలేని సేవలందించారు. అనేక పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారు. ఎయిడెడ్ కాలేజీల అధ్యాపకులతోపాటు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేశారు. గుండెపోటుతో శ్రీధర్‌రెడ్డి మరణించడం పట్ల తెలంగాణ రాష్ట్ర రిటైర్డ్ కాలేజీ అధ్యాపకుల సంఘం సంయుక్త కార్యదర్శి నీలం సంపత్ సంతాపం ప్రకటించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

నిరుద్యోగులపై నిర్బంధం అప్రజాస్వామికం

- తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నిరుద్యోగులతో చర్చలు జరపకూడదనే మొండి నియంతృత్వ వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం విడనాడాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె చక్రధర్‌రావు, ప్రధాన కార్యదర్శి జి హరగోపాల్, కార్యనిర్వాహక కార్యదర్శి కె లక్ష్మినారాయణ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగులపై నిర్బంధాన్ని ప్రయోగించడం అప్రజాస్వామికమని విమర్శించారు. గతకొన్ని వారాలుగా వారు తమ డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్నారని తెలిపారు. అయినా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడం గర్హనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం బేషజాలకు పోయి డీఎస్సీ పరీక్షలను కొద్ది రోజులైనా వాయిదా వేయకపోవడం సరైంది కాదని తెలిపారు. డీఎస్సీ, గ్రూప్-2 రాతపరీక్షలకు ఒక్కరోజే గడువుందని వివరించారు. నిరుద్యోగులను చర్చలకు ఆహ్వానించకపోవడం ప్రజాపాలన అనిపించుకోదని పేర్కొన్నారు. ఈ ఉద్యమంలో ప్రతిపక్ష పార్టీలున్నాయనే పేరుతో వారి సమస్యలను పట్టించుకోకుండా అరెస్టులు చేయడం, బారికేడ్లు, ముళ్లకంచెలు ఏర్పాటు చేసి నిర్బంధాన్ని ప్రయోగించడం నియంతృత్వ ప్రభుత్వాల లక్షణమని విమర్శించారు. నిరుద్యోగులు తక్షణ సమస్యలోపాటు ఉద్యోగం ఒక హక్కు అని తెలిపారు. ఉద్యోగాలను కల్పించే ఆర్థిక విధానాలు, ఆర్థిక నమూనా గురించి లోతుగా ఆలోచించాలని సూచించారు. నిరుద్యోగులతో చర్చలు జరపకూడదనే మొండివైఖరిపై పునరాలోచించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. పరీక్షలను వాయిదా వేయాలనే విషయాన్ని సానుకూలంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగులకు రుణమాఫీ వర్తింపచేయాలి

- టీఎస్‌సీపీఎస్‌ఈయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకూ రైతు రుణమాఫీని వర్తింపచేయాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు మ్యాన పవర్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన రావడానికి అన్ని విధాలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులు సంపూర్ణ సహకారం అందించారని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారిని రైతు రుణమాఫీ పథకం నుంచి ఆహార భద్రత కార్డు లేని కారణంగా అనర్హులుగా ప్రకటించడం బాధాకరమని పేర్కొన్నారు. వ్యవసాయం కోసం తీసుకున్న రుణాలను మ్యానిఫెస్టోలో పెట్టిన విధంగా రైతులందరికీ రూ.రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ కుటుంబాలను కూడా రుణమాఫీ పథకంలోకి తేవాలని కోరారు. ఆ నిబంధనలను మరోసారి సమీక్షించి రైతులందరికీ దీన్ని వర్తింపచేయాలని సూచించారు.

బీహార్‌కు ప్రత్యేక హోదా కోసం నితీశ్ ఏం చేస్తున్నారు?

- కాంగ్రెస్ నిలదీత

న్యూఢిల్లీ : బీహార్‌కు ప్రత్యేక హోదా డిమాండ్ సాధన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి, జేడీ(యూ) నాయకులు నితీశ్‌కుమార్ ఏమి చేస్తున్నారని కాంగ్రెస్ సోమవారం ప్రశ్నించింది. ప్రస్తుతం బీహార్‌కు ప్రత్యేక హోదా తీసుకోరాగల స్థితిలో ఉన్న నితీష్‌కుమార్ దీని కోసం మరింత ఒత్తిడి తేవాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఇటీవల విడుదల చేసిన నిటి ఆయోగ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీ) ఇండియా ఇండెక్స్ 2023-24 తరువాత బీహార్ ముఖ్యమంత్రులు రాష్ట్రానికి ఆర్థిక సాయం డిమాండ్‌ను సమర్థించడాన్ని కాంగ్రెస్ తప్పుపట్టింది. ఇటీవల నిటి ఆయోగ్ నివేదిక విడుదల తరువాత నుంచి బీహార్‌కు ప్రత్యేక కేటగిరి హోదా కేంద్రం నుంచి ఆర్థిక సాయంను రాష్ట్ర మంత్రులు డిమాండ్ చేస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేష్ విమర్శించారు. ఈ మేరకు ఎక్స్‌లో ఆయన పోస్టు చేశారు. ఇలాంటి డిమాండ్‌తో ఒక ఆర్థిక రుణంలో కేంద్రం చేసే సహాయం 70 శాతం నుంచి 10 శాతానికి తగ్గుతుందని వివరించారు. 'పార్టీ సమావేశాల్లో తీర్మానాలు చేయడం, పత్రికా ప్రకటనలు ఇవ్వడం తప్ప బీహార్‌కు ప్రత్యేక హోదా కోసం నితీశ్ కుమార్ ఏమి చేస్తున్నారు. ఏమీ చేయకుండా దీనిపై కేవలం ఆయన మాట్లాడుతూ.. మాట్లాడుతూ.. మాట్లాడుతూ.. ఉన్నారు' అని జైరాం రమేష్ విమర్శించారు. 'ప్రస్తుతం బీహార్‌కు ప్రత్యేక హోదా తీసుకోరాగల స్థితిలో ఉన్న నితీష్‌కుమార్ దీని కోసం మరింత ఒత్తిడి తేవాలి' అని జైరాం రమేష్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి కూడా ఇదే వర్తిస్తుందని జైరాం రమేష్ పేర్కొన్నారు.